# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com


**నమ్మలేని నిజాలు**

పూల బజారు
అదృశ్యం మట్టిజీవి
శ్రమ సౌందర్యం.

జనం సామెత
నిందతోనె బొందకు
చావు ఓసర్గ.

కొత్త పంచాంగం
లాభనష్టాలచిట్ట
అదోగణితం.

కాలిబాటలు
దుకాణాల అడ్డలు
మహానగరం.

మట్టికుండలు
పాతకాలం ఫ్రిడ్జీలు
తగ్గని మోజు.



– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

ఈడ లేదు ఆడ లేదు
ఆక్సిజన్ కై పరుగులు
అయ్యా! దేశాధినేత
చస్తున్నారయ రోగులు.

మోదీ ఉపన్యాసాల
రాజకీయ ఆకర్షణ !
సన్నగిల్లు తున్నదనా
లోలోపల సంఘర్షణ !



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245


హైదరాబాద్ | గురువారం 6-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 230 | పేజీలు: 8 | వెల: రూ.1/-


# హ్యాట్రిక్.. బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ ప్రమాణ స్వీకారం



కోల్‌కతా, మే 5: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె సీఎం పదవి చేపట్టడం ఇది వరుసగా మూడోసారి. కొవిడ్ కారణంగా గవర్నర్ అధికార నివాసంలో నిరాడంబరంగా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. బెంగాల్ గవర్నర్ జగ్‌దీప్ ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత గవర్నర్ ఆమెను అభినందించారు.

ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కౌంటింగ్ జరిగిన 292 స్థానాలకుగాను 213 స్థానాల్లో విజయంతో తృణమూల్ మూడోసారి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఫలితాల తర్వాత బెంగాల్‌లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఇందులో 12 మంది చనిపోయారు. ఈ హింసపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ.. మంగళవారం రాష్ట్ర గవర్నర్ జగ్‌దీప్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే.

# హైదరాబాద్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం

హైదరాబాద్ , మే 5: హైదరాబాద్ నగరాన్ని వర్షం మరోసారి ముంచెత్తింది. రెండు రోజుల క్రితం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియగా, నేడు ఈదురుగాలులతో కూడిన వాన పడింది. ఉదయం నుంచి ఎండ దంచికొట్టగా, మధ్యాహ్నం వాతావరణం చల్లబడింది. సాయంత్రం సమయానికి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. ఈదురుగాలులు వీచడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. చెట్లు నేలకొరిగాయి.

ఖైరతాబాద్, అమీర్‌పేట, సోమాజిగూడ, పంజాగుట్ట, కూకట్‌పల్లి, మియాపూర్, బాలానగర్, బేగంపేట, సికింద్రాబాద్, ఉప్పల్, తార్నాక, బోయిన్‌పల్లి, ఎల్బీనగర్, హయత్‌నగర్, సంతోష్ నగర్, దిల్‌సుఖ్‌నగర్, చార్మినార్, మెహిదీపట్నం, అఫ్జల్‌గంజ్, లక్డికాపూల్, టోలిచౌకి, ముసారాంబాగ్, రాంనగర్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, నాంపల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ, కొండాపూర్ ఏరియాల్లో భారీ వర్షం కురిసింది. ఇక సిటీ చుట్టు పక్కల ప్రాంతాల్లో కూడా వర్షం కురియడంతో.. ధాన్యం తడిసినట్లు సమాచారం.

# తెలంగాణలో ఆక్సిజన్, బెడ్ల కొరత లేదు : సీఎస్ సోమేశ్ కుమార్

హైదరాబాద్ , మే 5: తెలంగాణలో కరోనా వైరస్ వ్యాప్తిని కంట్రోల్ చేస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ స్పష్టం చేశారు. కరోనాపై సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య తెలంగాణలో తక్కువగా ఉంది అని పేర్కొన్నారు. తాత్కాలిక సచివాలయం బీఆర్కే భవన్‌లో సీఎస్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మందులు, ఆక్సిజన్‌తో పాటు నిత్యావసరాల కొరత లేదు. ప్రస్తుతం 62 వేల ఆక్సిజన్ బెడ్లు ఉన్నాయి. ఇంకా ఆక్సిజన్ బెడ్స్ పెంచాలని సీఎం ఆదేశించారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా ఆక్సిజన్, బెడ్ల కొరత లేకుండా చూస్తున్నాం. అన్ని ఆస్పత్రుల్లో ఆక్సిజన్ అడిట్ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఇక్కడ మెరుగైన వైద్యం అందడం వల్లే ఇతర రాష్ట్రాల రోగులు వస్తున్నారు. ఆస్పత్రుల్లో ఇతర రాష్ట్రాల రోగులే అధికంగా ఉన్నారని తెలిపారు. వైద్య సౌకర్యాలు మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. కరోనా వ్యాప్తి నివారణకు వైద్యారోగ్య సిబ్బంది తీవ్రంగా కష్టపడుతున్నారని తెలిపారు. ఒడిశా నుంచి ఒక ఆక్సిజన్ ట్యాంకర్ రావాలంటే కనీసం ఆరు రోజుల సమయం పడుతోంది. ఎయిర్‌లిఫ్ట్ చేయడం వల్ల మూడు రోజుల సమయం ఆదా అవుతోంది. రాష్ట్రానికి రోజుకు 125 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ సరఫరా సామర్థ్యం ఉందన్నారు. కర్ణాటక, తమిళనాడు నుంచి రావాల్సిన 45 టన్నుల ఆక్సిజన్ రావట్లేదు. ప్రతి జిల్లాలో ఆర్టీపీసీఆర్ టెస్టులు చేసేందుకు సౌకర్యం కల్పిస్తామన్నారు. కరోనా నియంత్రణకు ఎంత డబ్బు అయినా ఖర్చు చేయమని సీఎం చెప్పారు అని సీఎస్ సోమేశ్ కుమార్ వెల్లడించారు.

**45 ఏండ్లు పైబడిన వారికి వ్యాక్సినేషన్ కొనసాగుతోంది..**

45 ఏండ్లు పైబడిన వారికి వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. తగినంత వ్యాక్సిన్ సరఫరా లేకనే 18 నుంచి 44 ఏండ్ల వారికి వ్యాక్సినేషన్ ప్రారంభించలేదు అని తెలిపారు.



కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అసలు ఆస్పత్రికి వచ్చే అవసరమే రాదు. కరోనా లక్షణాలు కనిపించగానే విటమిన్ టాబ్లెట్లు, పారాసిటమాల్ తీసుకోవాలని సూచించారు. లక్షణాలు ఉన్నా నిర్లక్ష్యం చేసిన వారే ఇబ్బంది పడుతున్నారు. సరైన సమయంలో చికిత్స ప్రారంభిస్తే ఎలాంటి ఇబ్బందులు రావు అని సీఎస్ సోమేశ్ కుమార్ స్పష్టం చేశారు.

# తెలంగాణలో వీకెండ్ లాక్‌డౌన్‌ను పరిశీలిస్తాం : సీఎస్ సోమేశ్ కుమార్

హైదరాబాద్ , మే 5: తెలంగాణలో పూర్తి స్థాయి లాక్‌డౌన్ ఉండదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ పేర్కొన్నారు. హైకోర్టు సూచనల్ని పరిగణనలోకి తీసుకుంటామని, ఆ మేరకు వీకెండ్ లాక్‌డౌన్ అంశాన్ని పరిశీలిస్తామని సీఎస్ స్పష్టం చేశారు. పూర్తి స్థాయి లాక్‌డౌన్ అవసరమైనప్పుడు సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. లాక్‌డౌన్ విధించడం వల్ల పెద్దగా ఉపయోగం లేదన్నారు. ఢిల్లీలో లాక్‌డౌన్ కారణంగానే రాష్ట్రానికి టెస్టింగ్ కిట్లు రావడం లేదని పేర్కొన్నారు. లాక్‌డౌన్ కంటే మంచి చికిత్సను అందించడం ముఖ్యమని ఆయన చెప్పారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందన్నారు. త్వరలోనే సాధారణ పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. లాక్‌డౌన్ వల్ల ప్రజల జీవనోపాధి దెబ్బతింటుంది. ఆ విషయాన్ని కూడా గమనించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక అవసరాలు, అక్కడి పరిస్థితులను బట్టి పొరుగు రాష్ట్రాలు లాక్‌డౌన్ పెట్టుకున్నాయని సీఎస్ సోమేశ్ కుమార్ పేర్కొన్నారు.

# వివాహాలను వాయిదా వేసుకోవాల్సిందిగా సీఎం విజ్ఞప్తి

పాట్నా, మే 5: : కొవిడ్ విజృంభన నేపథ్యంలో పెండ్లిళ్లు, ఇతర సామూహిక కార్యాక్రమాలను వాయిదా వేసుకోవాల్సిందిగా బిహార్ సీఎం నితీశ్ కుమార్ ఆ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 10 రోజుల లాక్‌డౌన్ ప్రకటన వెలువడిన మరుసటి రోజే సీఎం స్పందిస్తూ ఈ చర్య ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి చైన్‌ను బ్రేక్ చేయొచ్చన్నారు. కరోనా మహమ్మారి నుండి ప్రజల సంరక్షణార్థం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. దయచేసి ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందిగా కోరారు. లాక్‌డౌన్ విషయంలో ఒకవేళ ప్రభుత్వం కనుక నిర్ణయం తీసుకోకపోతే తామే నిర్ణయం తీసుకుంటామని పాట్నా హైకోర్టు హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటన చేసింది. లాక్‌డౌన్ నిబంధనలు అనుసరించి వివాహాలకు 50 మందికి మించి అతిథులు హాజరుకావడానికి వీలులేదు. అదేవిధంగా అంత్యక్రియల్లో 20కి మించి పాల్గొనరాదు. కిరాణా దుకాణాలు సైతం ప్రతిరోజు నాలుగు గంటలు మాత్రమే తెరిచేందుకు అనుమతించారు. ఉదయం 7 నుండి 11 గంటల మధ్య మాత్రమే దుకాణాలు కార్యకలాపాలు కొనసాగించేందుకు అనుమతి. బిహార్‌లో ప్రతీరోజు 10 వేలకు పైగా కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి.

# తగిన కరోనా మరణాలు

న్యూఢిల్లీ, మే 5: : దేశ రాజధానిలో వరుసగా మూడు రోజుల పాటు 400కు పైగా కరోనా మరణాలు నమోదైన అనంతరం బుధవారం మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టడం ఊరట ఇస్తోంది. గత మూడు రోజులుగా వరుసగా 448, 407, 412 మరణాలు నమోదవగా బుధవారం మరణాల సంఖ్య 311కి తగ్గడం అధికారులకు ఉపశమనం కలిగించింది.

ఇక గడిచిన 24 గంటల్లో ఢిల్లీలో 20,960 తాజా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అయితే పాజిటివిటీ రేటు 30 శాతం దిగువకు పడిపోయినా ఇప్పటికీ 26.37 శాతం ఉండటం కొంత కలవరం కలిగిస్తోంది. తాజా కేసులతో ఢిల్లీలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 12,53,902కు ఎగబాకింది. వీరిలో 11.43 లక్షల మంది కోలుకోగా 18,603 మంది ప్రాణాలు కోల్పోయారు.

# 12 రాష్ట్రాల్లో లక్ష చొప్పున యాక్టివ్ కేసులు : లవ్ అగర్వాల్

న్యూఢిల్లీ, మే 5: : దేశంలో కరోనా కేసులు తగ్గినట్లే తగ్గి.. పెరుగుతున్నాయని, కరోనా పాజిటివిటీ, మరణాల రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోంది అని కేంద్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు. 12 రాష్ట్రాలు.. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, బీహార్, హర్యానా రాష్ట్రాల్లో లక్ష చొప్పున యాక్టివ్ కేసులు ఉన్నాయి. 50 వేల నుంచి లక్ష మధ్య యాక్టివ్ కేసులు 7 రాష్ట్రాల్లో ఉన్నాయి. 50 వేల కంటే తక్కువ కేసులు నమోదు అవుతున్న రాష్ట్రాలు 17 ఉన్నాయని ఆయన తెలిపారు.

13 రాష్ట్రాల్లో రోజుకు వంద మంది చనిపోతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, హర్యానాలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. రోజువారీ కరోనా కేసుల్లో 2.4 శాతం పెరుగుల ఉంది. నిన్నటితో పోలిస్తే ఈ రోజు పాజిటివ్ కేసులు ఎక్కువగా వచ్చాయన్నారు. మహారాష్ట్రలో కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. కరోనా వ్యాప్తిని అరికట్టకపోతే.. వైద్యసేవల నిర్వహణ మరింత కష్టతరమవుతుందన్నారు.

బెంగళూరు, చెన్నైలో కరోనా కేసులు ప్రమాదకరంగా పెరుగుతున్నాయి. ఒక్క బెంగళూరులోనే వారం రోజుల్లో లక్షన్నర పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. బెంగళూరులో పాజిటివిటీ రేటు 50 శాతం కంటే ఎక్కువగా ఉంది. తమిళనాడులో 38 వేల పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. కోజికోడ్, ఎర్నాకులం, గురుగ్రామ్ జిల్లాల్లో కరోనా కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. 18 ఏండ్ల నుంచి 44 ఏండ్ల మధ్య వయసున్న వారికి వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు 9 రాష్ట్రాల్లో 6.71 లక్షల మందికి వ్యాక్సిన్ ఇచ్చామని లవ్ అగర్వాల్ వెల్లడించారు.

# యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ ఎండ్ నార్దన్ ఐలండ్‌కు మధ్య ఎమ్ఒయుకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం

హైదరాబాద్ , మే 5: వలస పోవడం, మొబిలిటి పార్ట్‌నరశిప్ అనే అంశాల పై భారతదేశ గణతంత్ర ప్రభుత్వానికి, యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ ఎండ్ నార్దన్ ఐలండ్ ప్రభుత్వాని కి మధ్య సంతకాలైన ఒక అవగాహన పూర్వక ఒప్పంద పత్రానికి (ఎమ్ఒయు కు) ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

విద్యార్థులు, పరిశోధకులు, నైపుణ్యాన్ని సంపాదించుకొన్న వృత్తి నిపుణుల రాక–పోకల ను ప్రోత్సహించేందుకు గాను వీజాల జారీ ని సరళతరం చేయడం, నియమ విరుద్ధ ప్రవాసానికి, మానవుల ను చట్ట విరుద్ధం గా తరలించడానికి సంబంధించిన అంశాల లో ఉభయ పక్షాల మధ్య సహకారాన్ని పటిష్ట పరచుకోవడం అనేవి ఈ ఎమ్ఒయు ఉద్దేశ్యాలు గా ఉన్నాయి.

ఈ ఎమ్ఒయు భారతీయ విద్యార్థుల కు, విద్యావేత్తల కు, పరిశోధకుల కు, వృత్తి పరమైనటువంటి, ఆర్థిక పరమైనటువంటి కారణాల తో వలస పోయే వారికి మేలు ను చేస్తుంది. దీనితో పాటు రెండు దేశాల లో ఆర్థికాభివృద్ధి ప్రధానమైనటువంటి వివిధ ప్రాజెక్టుల కు తోడ్పాటు ను అందించాలనుకొనే వారికి కూడా వారి కులం, వర్గం, మతం అనే అంశాలను గాని, లేదా వారు మగ వారా లేక ఆడవారా అనే భేదాన్ని ను పట్టించుకోకుండా ఈ ఎమ్ఒయు ఉపయోగకరం గా ఉంటుంది. ఈ ఎమ్ఒయు ప్రతిభావంతులు స్వతంత్రం గా రాక– పోకల ను జరుపుకొనేందుకు వీలు ను కల్పించడం ద్వారా ఇరు దేశాల లో నూతన ఆవిష్కరణల కు సంబంధించిన స్థితిగతుల ను బలపరుస్తుంది.

విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక సంయుక్త కార్యాచరణ సమూహ పాలన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, ఈ ఎమ్ఒయు ప్రభావవంతమైన విధం గా అమలు అయ్యేటట్లు నిశితం గా పర్యవేక్షిస్తుంది.

# యూపీలో కర్ఫ్యూ పొడిగింపి- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

లక్నో, మే 5: : ఉత్తరప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా అమలువుతున్న లాక్‌డౌన్ తరహా కర్ఫ్యూను రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. గురువారం ఉదయంతో కర్ఫ్యూ ముగియనుండగా మే 10 వరకు పొడిగిస్తూ ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని అన్నిదుకాణాలు, వ్యాపార సముదాయలను వచ్చే సోమవారం ఉదయం 7 గంటల వరకు మూతపడున్నాయి. రాష్ట్రంలో కరోనా పరిస్థితిని యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఆరోగ్యశాఖ మంత్రి జైప్రతాప్ సింగ్‌తోపాటు ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అధికారుల సూచన మేరకు సీఎం కర్ఫ్యూ పొడిగింపునకు పచ్చజెండా ఊపారు. రాష్ట్రంలో కరోనా కర్ఫ్యూ పొడిగించడం వరుసగా ఇది మూడోసారి. కర్ఫ్యూ సమయంలో అత్యసవర సేవలకు మినహాయింపునిచ్చారు. వ్యాక్సిన్ డ్రైవ్ కొనసాగించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. కరోనా కట్టడికి రాష్ట్రంలోని 75 జిల్లాల్లో శానిటైజేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడిచిన కొన్నివారాలుగా యూపీలో కరోనా కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే యాక్టివ్ కేసులు 3 లక్షలు దాటాయి. దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రం కావడంతో కరోనా కట్టడి ప్రభుత్వానికి సవాల్‌గా మారింది.

బాల గేయం

# "హల్లుల"తో పాట

కఖ–కఖ–కఖ అంటూ
కలము–ఖడ్గము చేపడదాం!
గఘ–గఘ–గఘ అంటూ
గదిలో ఘంటముతో రాద్దాం!
ఇ(జ)–ఇ(జ)–ఇ(జ) అంటూ
వాఙ్మయమంతా గమనిద్దాం!
చఛ–చఛ–చఛ అంటూ
చక్రము– ఛత్రము చేపడదాం!
జఝ–జఝ–జఝ అంటూ
జగమున కత్తిని ఝుళిపిద్దాం!
(ఇ)ఞ–(ఇ)ఞ–(ఇ)ఞ అంటూ
ఇంగిత జ్ఞానము సాధిద్దాం!
టఠ–టఠ–టఠ అంటూ
టక టక కంఠస్థము చేద్దాం!
డఢ–డఢ–డఢ అంటూ
డమ డమ ఢంకా మోగిద్దాం!
(అ)ణ–(అ)ణ–(అ)ణ అంటూ
నాణ్యంగానే జీవిద్దాం!
తథ–తథ–తథ అంటూ
తకథిమి నాట్యం చేసేద్దాం!
దధ–దధ–దధ అంటూ
దగ్ధ జీవులను ఆదరిద్దాం!
నన–నన–నా అంటూ
నమస్కారమే చేసేద్దాం!
పఫ–పఫ–పఫ అంటూ
పలు ఫలాలనూ రుచి చూద్దాం!
బభ–బభ–బభ అంటూ
బలభద్రులమై జీవిద్దాం!
మమ–మమ–మమ అంటూ
మమకారాలను కలిగుందాం!
యయ–యయ–యయ అంటూ
యమసాధనతో పయనిద్దాం!
రర–రర–రర అంటూ
నవరసాలనూ పోషిద్దాం!
లల–లల–లల అంటూ
లక్షణంగా అడుగేద్దాం!
వవ–వవ–వవ అంటూ
వడివడిగన్నీ చదివేద్దాం!
శశ–శశ–శశ అంటూ
శశమును వెదకి పట్టేదాం!
షష–షష–షష అంటూ
షట్పదాలుగా విహరిద్దాం!
సస–సస–సస అంటూ
సమతా భావన పెంచేద్దాం!
ళళ–ళళ–ళళ అంటూ
కళ కళ లాడుతు కనిపిద్దాం!
హహ–హహ–హహ అంటూ
హరిత హారముల కృషిచేద్దాం!
క్షక్ష–క్షక్ష–క్షక్ష అంటూ
కక్షలు లేక ప్రేమలతో
క్షరములేని అక్షరాలతో
కలకాలం యిల కలిసుందాం!
అఱ–అఱ–అఱ అంటూ
గుఱ్ఱముపై రౌతుగ పయనిద్దాం!



– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

**చరిత్రలో నేటినిజం**



క్రీడలో ఘనుడు "ప్రదీప్ కొచారు" కు
ఘనతరముగ శ్రీ కెరటమునకు గలబంధమ్మునే
వినిపింపుటనే సర్వులు
ప్రణాయులు నందించినారు ప్రా జ్ఞంతనుచునే !!

( మే 6 క్రికెట్ దిగ్గజం "ప్రదీప్ కొచారు" పుట్టిన రోజు..)



–రాధశ్రీ
సెల్: 9494481210

# తరగని ప్రేమకు చిరునామా ....అమ్మ

**పదాలు తెలియని పెదాలకు తియ్యటి పదం అమ్మ....**
**ఆమె వెచ్చని ఒడిలో మొదలైంది మానవ జన్మ.**

ప్రేమ,త్యాగం, ఆప్యాయత, అనురాగం వీటన్నింటి కలబోసిన ప్రతిరూపం అమ్మ. దేవుడు తనకు మారుగా ఈ భూమి మీదకి పంపించిన దేవతామూర్తి అమ్మ.....

ఈ సృష్టిలోని మాధుర్యం అంత అమ్మ ప్రేమలోనే ఉంటుంది. సంతోషంలో అమ్మే.. బాధలోనూ అమ్మే.. కిందపడ్డా అమ్మే.. ఆనందపడ్డా అమ్మే.. ఓదార్పు కావాలన్న అమ్మే... తప్పులు చేసినప్పుడు వెనకేసుక రావడానికి అమ్మే... విజయాలలో వెన్నుతట్టి ప్రోత్సహించేది అమ్మే.. నిత్యం నీడగా తోడుగా ఉంటూ ఆత్మ స్థైర్యం నింపేది అమ్మే... అన్నింట్లో అమ్మే.. అన్నింటికి అమ్మ కావాలి.. అందుకే దేవుడు ప్రతి ఇంట్లో తాను ఉండలేక అమ్మను సృష్టించిన మాట నిజమే అని నిరూపిస్తుంది అమ్మ ప్రేమ.

ఈ సృష్టిలో ఏ స్వార్థం లేకుండ ప్రేమ పంచేది అమ్మ మాత్రమే. మనకోసం ప్రాణాలు అడ్డుపెట్టడంలో తొలిస్థానం అమ్మదే. అందుకేనేమో మాతృదేవోభవ?అంటూ దేవుళ్ళకన్నా మొదటి ప్రాధాన్యత ఇచ్చారు. దేవుని పరిచయం చేసేది కూడా అమ్మే. లేకుంటే మనకు దేవుడెవరో కూడా తెలియదు.దేవుళ్ళకి సైతం అమ్మ ప్రేమ రుచిని ఒక్కసారైనా చూడలనిపించేదట. ఒకరోజు విష్ణుమూర్తికి మానవుడుని చూసి ఈర్ష్య కలిగిందట. "మానవుడు ఎంతటి అదృష్టవంతుడు. అమ్మ ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు. తాను అమ్మ ప్రేమను ప్రత్యక్షంగా అనుభవించాలని ఆరాటపడ్డాడు. అనుకున్నదే తడవుగా దేవకీ వసుదేవులకు ఎనిమిదవ సంతానంగా జన్మించి తల్లీ యశోధర అందించిన మాతృత్వపూ మాధుర్యాన్ని పొందాడట. ఈ సమస్త విశ్వాన్ని ఏలుతున్న ఆ గోపాలుడు యశోధర మాతృప్రేమ ముందు పసివాడై ఆనందంగా పరవశించిపోయాడట. మహాభారతంలో యక్షుడు యుధిష్టరుని భూమికంటే గొప్పదేదని ప్రశ్నించాడట. దానికి సమాధానంగా

'మాతా గురుతరా భూమే'! అన్నాడంటే. సన్యాసాశ్రమం తీసుకున్నవారికి అందరూ నమస్కారం చేస్తారు తండ్రితో సహా. కానీ తల్లికిమాత్రం తనే నమస్కరించాలి. అంత గొప్పది అమ్మతనం. సాక్షాత్తు ఆ జగన్మాతయే వాత్సల్యం, దయ, శాంతి, శ్రద్ధ, ప్రేమ, త్యాగం, ఓరిమి ..... మొదలగు సమస్త సద్గుణముల రూపంలో ప్రతీ తల్లీ హృదయంలో కొలువైంది.

ఢిల్లీకి రాజైన తల్లికి కొడుకే అన్నట్టుగా కొడుకు రాజైన కూలీఅయిన ఆ తల్లి ప్రేమ ఒకేలా ఉంటుంది. పేదరికంలో ఉన్నా ధనిక కుటుంబంలో ఉన్నా తల్లీ పిల్లలపట్ల చూపించే ప్రేమలో వ్యత్యాసం ఉండదు.

కంటికి రెప్పలా కాచుకున్న.. జోలాలి పాడుతూ నిద్రపుచ్చిన....చందమామ రావే అంటూ గోరుముద్దలు తినిపించిన....స్థాయిల్లో అంతస్థుల్లో తేడా ఉండొచ్చేమోకానీ తల్లీ ప్రేమలో వారి సంరక్షణ కోసం పడేతపనలో తేడా ఉంటుందనేది అసంభవం. తనపిల్లల ఆనందంకోసం, బంగారు భవిష్యత్ కోసం తల్లీ అనుక్షణం ఆలోచిస్తూనే ఉంటుంది. పిల్లలు ఎదగడానికి, మంచి చదువుల కోసం తల్లిపడే ఆరాటం ఎంత గొప్పదంటే తానూ పడే కష్టమంతా వారి అభివృద్ధికి ధారపోస్తుంది. తాను ఏస్థితిలో ఉన్న తనపిల్లలు మాత్రం తనకన్నా ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలలుకంటూ వాటి సాకారం కోసం తన శక్తిసామర్థ్యాలను కూడగట్టుకొని పనిచేస్తుంది. ప్రతి మనిషి ఎదగడంలో...వివిధ రంగాలలో రాణించడంలో తల్లిపాత్ర ఖచ్చితంగా ఉంటుంది. ఛత్రపతి శివాజీకి పసితనం నుంచే అన్నీరకాల యుద్ధవిద్యలు నేర్పించి గొప్ప రాజుగా తీర్చిదిద్దడంలో తల్లీ జిజియాబాయి పాత్ర చరిత్రపుటల్లో ఉన్నతంగా లిఖించబడ్డది. అలాంటి ఎందరో మహతల్లుల స్ఫూర్తిగాథలు ఈ దేశంలో ఉన్నాయి. ప్రపంచంలో కుటుంబవ్యవస్థను ఇప్పటికీ అద్భుతంగా ఆచరిస్తున్న దేశం మనది. దానికి ముఖ్యకారణం తల్లి తన కుటుంబం గురించి తీసుకుంటున్న శ్రద్ధనే గర్వంగా చెప్పవచ్చు. ఇల్లాలు ఇంటికి దీపమని అందుకే అంటారు. అనాది నుంచి మనదేశం మాతృస్వామ్య దేశం. గొప్పగొప్ప నాగరికతలు ఈ గడ్డపై ఫరిడవిల్లాయంటే దానికి ప్రధాన కారణం మాతృస్వామ్య వ్యవస్థనే.

అమెరికాదలో ఒకసారి అమ్మ సేవలను గంటల ప్రకారం లెక్కకట్టారు. ఆ విలువ సంవత్సరానికి అక్షరాల డెబ్బైలక్షల రూపాయలు. అంటే నెలకి ఐదున్నర లక్షలంట. కానీ ఈ వెలలు ఏవి అమ్మప్రేమకి సరితూగవు. అమ్మప్రేమకు వెలకట్టే సాహసం అసలు అర్థంలేనిది. అమ్మప్రేమని కొలవడం హరిహర బ్రహ్మాదులకు సైతం అసాధ్యం.

అమ్మతో మంచి అనుబంధం ఉన్నపిల్లల మెదడు ఆరోగ్యంగా ఎదుగుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. మెదడులో ఉండే హిప్పోకాంపస్ (ఊతిజూజూనీఇజీఎజూబీబ)అనే భాగం మన జ్ఞాపకశక్తికి, తెలివితేటలకి,ఒత్తిడిని తట్టుకునే శక్తికి ఆధారితమైనది. అమ్మప్రేమ సంపూర్ణంగా లభించే పిల్లలలో హిప్పోకాంపస్ 10% పెద్దదిగా ఉంటుంది. అమ్మ అక్కునచేర్చుకుని తలనిమురుతూ నుదుట ముద్దుపెట్టే ఆ స్పర్శ చాలా గొప్పది. ఉదయమే తల్లి ఓ చిరునవ్వుతో నిద్రలేపితే, పిల్లలు మానసిక మరియు శారీరకంగా ఆనందంగా ఉంటారు.

మానవ జన్మనే ఒక ఉత్కృష్టమైనది. అందులో అమ్మతనం అత్యంతోత్కృష్టమయినది. తన సంతానం యొక్క ఆకలిదప్పులు తీర్చడంకోసం తనూ ఎన్నాళ్ళైనా పస్తులు ఉండగలదు కానీ పిల్లల ఆకలిని తట్టుకోలేదు. కొన్నాళ్లక్రితం ఆఫ్రికాలో పిల్లలు ఆకలితో అలమటించిపోతుంటే తిండికి ఏమిలేని క్షణంలో పొయ్యిమీద ఒక గిన్నెలో రాళ్ళుపోసి ఆహారం వండుతున్నట్టు అనుకరిస్తూ మా అమ్మ మాకోసం ఏదో వండుతుంది అనే సంతోషంలో పిల్లలు ఆదమరిచి నిద్రపోయేలా చేసింది ఓ తల్లీ. ఆ తల్లీ ఆరాటం ఒక్కటే ఆకలితో తన పిల్లలు తల్లడిల్లొద్దని. తన పిల్లల కడుపునింపిన తరువాత ఆహారం మిగలని పరిస్థితిలో నీళ్లు మింగి నిద్రపోతున్న తల్లులు ఇప్పటికీ ఉన్నారు.

ఇంత గొప్ప ప్రేమచూపించే తల్లికోసం ప్రపంచవ్యాప్తంగా మదర్స్ డేను ప్రతీ ఏటా జరుపుకుంటున్నారు. మాతృదినోత్సవం అధికారికంగా మొదటిసారి 1914లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ ప్రారంభించాడు. విదేశాల్లో కొంత ఈడురాగానే సంతానం తల్లిదండ్రులపై ఆధారపడకుండా స్వంతంగా జీవించడానికి వేరుగా నివాసం ఏర్పాటుచేసుకోవడం సర్వసాధారణం. అందుకే సంవత్సరానికి ఒకసారైనా తమతల్లులను గౌరవించి బహుమతులు అందించి ఆరోజంతా ఉల్లాసంగా గడపాలని మదర్స్ డేని జరుపుకుంటారు. కాలక్రమేణా ఈ సంస్కృతి మిగతా దేశాలకు విస్తరించింది. పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతున్న భారతదేశంలో కూడా మాతృ దినోత్సవం ఘనంగా జరుపుకుంటున్నారు. కానీ మరోవైపు మనదేశ సంస్కృతి ప్రకారం తల్లిదండ్రులను ప్రతిరోజూ గౌరవించి వారి ఆశీర్వాదాలు తీసుకోకుండా ఏ పని ప్రారంభించని వాళ్ళు కూడా ఉన్నారంటే మన సంస్కృతి యొక్క గొప్పతనాన్ని అర్థం చేసుకోవచ్చు. ఎన్ని పాశ్చాత్య సంస్కృతులు వచ్చినా మంచిని స్వీకరించాలి కానీ మనదేశం మిగతా దేశాలకన్న ఉన్నతంగా నిలవడానికి కారణమైన మన సంస్కృతి సాంప్రదాయాలను ఎన్నడూ మర్చిపోవద్దు.

మనకోసం తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలను పక్కనపెట్టి పరితపించే తల్లులను ఒక్కరోజు మాత్రమే గౌరవించాలనుకోవడం సముచితం కాదు. అమ్మ ప్రేమని గౌరవించాలన్నా, గుర్తించాలన్న, కొలవాలన్న ఒక్కరోజు మాత్రం అస్సలు సరిపోదు. దేవతారూపం అమ్మను అనునిత్యం స్మరిస్తూ ఆమె నేర్పిన అడుగుజాడల్లో పయనిస్తే అంతకన్నా గొప్ప బహుమానం ఏ తల్లీ ఆశించదు.

తన కాటుక కనులు విప్పారటంతోనే ఈ భూమిని మేలుకొల్పి తన శ్రామిక శక్తి సామర్థ్యాలను సంతానంకోసం, కుటుంబంకోసం, సమాజంకోసం, దేశంకోసం ధారపోస్తున్న తల్లులు రక్తహీనతతో, సరైన పోషకాహారం లభించక అర్థాంతరంగా ఆయువు వదులుతున్నారు. మాతృమరణాల రేటుని పరిశీలిస్తే 2018–19 సంవత్సరానికిగాను ప్రతీ 1000 మందికిగాను 30 మంది, 2019– 20 సంవత్సరానికిగాను 20 మంది చనిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. మాతృమరణాలకు ప్రధాన కారణాలు గర్భధారణ సమయంలో సరైన పోషకాహారం లభించక, రక్తహీనత,బాల్యంలో వివాహాలు, కాన్పుల మధ్య తక్కువ వ్యవధి, ఆసుపత్రులలో ప్రసవం కాకపోవడం, సకాలంలో మెరుగైన చికిత్స అందకపోవడం తదితరకారణాలతో మరణాలు సంభవిస్తున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. కానీ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలవల్ల ప్రసూతి మరణాలు లక్షకు 92 నుంచి 63కి తగ్గాయనేది స్వాగతించదగిన విషయం. మాతాశిశు మరణాలరేటు తగ్గుదలలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉండటం గర్వించదగ్గ విషయం. ప్రసవం తర్వాత తల్లిబిడ్డను ఇంటికి చేర్చడానికి 102 అనే అమ్మఒడి సేవలు ప్రారంభించారు. ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా ప్రతిరోజూ 200 మి.లీ. పాలు ఇవ్వడం అంగన్వాడీలలో పోషకవిలువలున్న భోజనం, బాలమృతం, గుడ్లు, ఐరన్ మాత్రలు ఇవ్వడం జరుగుతుంది. గర్భిణీ స్త్రీకి ఆరవనెల నుండి ప్రసవించిన మూడోనెల వరకు రూ॥ 2000ల చొప్పున రూ॥12000 పౌష్టికాహారం తీసుకోవడం కోసం ఇస్తున్నారు. దీనివల్ల మాతాశిశు మరణాలు తగ్గడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవించిన వారికి కెసిఆర్ కిట్లు ఇవ్వడం మాత్రమే కాకుండా ఉచిత వైద్యం అందరికీ సక్రమంగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూడా అమ్మఒడి పథకం ద్వారా మాతృమూర్తులకు అండగా ఉండడం, మహిళలకు అద్భుతమైన పథకాలు అందించడం సంతోషదాయకం.

తల్లిలేకుండా జననం లేదు. తొమ్మిది నెలలు మోసి మరో జన్మలాంటి పురిటినొప్పుల బాధలో జీవితం మొత్తంలో తనబిడ్డ తొలి ఏడ్పుకోసం మాత్రమే ఆనందంగా నవ్వులు చిందించే తల్లీ ఆ మరుక్షణం నుంచి తనపిల్లలు పెరిగి పెద్దవారయ్యేదాకా వారిని అపురూపంగా అల్లారుముద్దుగా పెంచుతుంది. ఎంత చెప్పినా ఏమని వర్ణించినా తల్లీ ప్రేమను వ్యక్తం చేయలేము. తనపిల్లలు ఎంత పెద్దవాళ్ళైనా వారిని ఎప్పుడూ పసిపిల్లల మాదిరిగా భావించి తన అమూల్యమైన ప్రేమను నిరంతరం అందిస్తుంది.

ఆది శంకరుని దృష్టిలో తల్లి :
"కు పుత్రోజాయేత క్వచిదపి కు మాతా న భవతి"

పుత్రుడు చెడ్డవాడైన, తల్లి చెడ్డది కాబోదు'... దీనికి నిదర్శనం ఈ సంఘటన. జపాన్‌లో వృద్ధురాలైన తల్లిని దట్టమైన అడవిలో వదిలేసి వస్తున్న కుమారుడికి ఆ తల్లీ ఇలా చెప్పిందట.. మనం వచ్చిన మార్గంలో నీవు నన్ను భుజాలపై ఎత్తుకుని వస్తుంటే చెట్ల ఆకులు తెంచి దారి పొడవునా వేశాను. అదే దారిలో వెళ్ళు నాయనా అని చెప్పింది. తనని ఒంటరిచేసి వెళ్తున్న కొడుకు ఇంటికి క్షేమంగా చేరాలని ఆ తల్లి చేసిన ఆలోచన తల్లిప్రేమ గొప్పతనానికి నిదర్శనం. ఆనాడు తమపిల్లల భవిష్యత్ కోసం బడిలో చేర్పించిన తల్లిదండ్రులకు నేడు అదే పిల్లలు వృద్ధాశ్రమంలో బడిపిల్లలాగా అడ్మిషన్లు ఇప్పిస్తున్నారు. చరమాంకంలో తమ పిల్లల ఆదరాభిమానాలు కోల్పోయి పడే బాధను గ్రహించాలి. వృద్ధాశ్రమాలు లేని సమాజం నెలకొల్పినప్పుడే అసలైన మాతృదినోత్సవాలు, పితృదినోత్సవాలు జరుపుకున్నట్టు. ఆ దిశగా అందరం ఆలోచించాలని సంకల్పించుకుందాం. తమ పిల్లల సంతోషమే పరమావధిగా పరితపిస్తున్న మాతృమూర్తులు అందరికీ ప్రపంచ మాతృదినోత్సవ శుభాకాంక్షలు.

(మే 9వ తేదీ మాతృదినోత్సవం సందర్భంగా)



– స్వేచ్ఛావి
8185062909

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ గురువారం 6-5-2021

## నేటికవిత-కవిత్వ విశ్లేషణ



-దాస్యం లక్ష్మయ్య
అడ్మిన్, నేటికవిత
9440155240



-దాస్యం సేనాధిపతి
కవిత్వ విశ్లేషకులు
9440525544

నేటికవితలో ఈ వారం: "ఆమె ఓ నది"
అనే అంశంపై వచ్చిన 48 కవితల సమీక్షలో అత్యుత్తమంగా నిలిచిన కవితల్లోంచి ఓ మూడు ఎంపికయిన కవితలపై విశ్లేషణ

### పారే సంస్కృతి

నాకేం తెలుసు
సంద్రంలా పోగుపడటం తప్ప
ఆమెకే తెలుసు
ఆకాశమంత అణకువతో
నన్ను పరిపూర్ణం చేయడం.

నాకేం తెలుసు
ఉప్పుదేహంలో ఊగిసలాడుతూ
దాహార్తితో దహించుకు పోవడం తప్ప
ఆమెకే తెలుసు
మంచు పల్లకీలో ఊరేగిస్తున్నా
మూడు ముళ్ళ పిలుపుకే
మనసారా పరుగెట్టి గొంతు తడపడం.

నాకేం తెలుసు
అర్థం లేని ఆటుపోట్లకు
అమితంగా ఎగిసి పడడం తప్ప
ఆమెకే తెలుసు
పచ్చని కలలకు ప్రాణం పోస్తూ
రాతి గుండెను సైతం కరిగించడం.
నాకేం తెలుసు
ఒంటరి తీరాల పైకి
విచక్షణ లేక విరుచుకు పడడం తప్ప
ఆమెకే తెలుసు
ఒంటినిండా గాయాలవుతున్నా
ఎడారి అడుగులు పడుతున్నా
నిబ్బరంగా ముందుకు సాగడం

ఆమె పారే సంస్కృతి
రుచుల మాగాణాలు పండిస్తూ
తూరుపు సిందూరమై
తలెత్తుకునే సంసార జీవనది



-నల్లు రమేష్
9989765095

కవి శ్రీ నల్లు రమేష్ గారు 'ఆమె ఓ నది' అంశంపై 'పారే సంస్కృతి' శీర్షికతో రాసిన కవితలో తమ జీవిత భాగస్వామిని పారే సంస్కృతిగా రుచుల మాగాణాలు పండిస్తూ తూరుపు సిందూరమై తలెత్తుకునే సంసార జీవనదిగా ఆవిష్కరించారు. ఆద్యంతం కవితాత్మకంగా మలచబడిన ఈ కవితలో నాకేం తెలుసు.. అన్నీ ఆమెకే తెలుసు అంటూ.. శ్రీమతిని ఉన్నతంగా చిత్రించారు. తనను సంద్రంగా.. శ్రీమతి గారిని నదిగా అన్వయించుకుంటూ కొనసాగించారు. నాకేం తెలుసు సంద్రంలా పోగుపడటం తప్ప.. ఆమెకే తెలుసు ఆకాశమంత అణకువ.. వంటి పదబంధాలు కవితకు పుష్టిని కూర్చాయి. నాకేం తెలుసు.. ఉప్పు దేహంలోఊగిసలాడుతూ దాహార్తితో దహించుకుపోవడం తప్ప..ఆమెకే తెలుసు మంచుపల్లకీలో ఊరేగిస్తున్నా మూడు ముళ్ళ పిలుపుకే మనసారా పరుగెత్తి గొంతు తడపడం తప్ప..అంటారు. నాకేం తెలుసు అర్థం లేని ఆటుపోట్లకు అమితంగా ఎగిసి పడటం తప్ప.. ఆమెకే తెలుసు పచ్చని కలలకు ప్రాణం పోస్తూ రాతి గుండెను సైతం కరిగించడం అంటారు. సముద్రం విచక్షణ లేక విరుచుకు పడితే..నది ఒంటినిండా గాయాలవుతున్నా ఎడారి అడుగులు పడుతున్నా నిబ్బరంగా ముందుకు సాగుతున్నట్లు .. భర్త గంభీరంగా ఉంటూ విరుచుకు పడుతూ ఉంటే భార్య గాయాలన్నీ భరిస్తూ నిబ్బరంగా ముందుకు సాగడాన్ని కవి రమేష్ గారు చక్కని సమన్వయంతో కవితను తీర్చి దిద్దారు. అంశం వెలుగులో వస్తువును కవితామయం చేయడంలో కవి ఎంచుకున్న శైలి, అభివ్యక్తి , శిల్పం.. పదబంధ ప్రయోగాలు అన్నీ బాగున్నాయి.

### నదియే నాతి

ఓ ఇంటి గారాల పట్టి ఈ చిన్నారి
నడకతో పాటు నడత నేర్చిన నెలత.

చదువు సంస్కారం తీరుగా మార్చి
ఇంటిపేరు మార్చి మరో ఇంటికి మెట్టి.

రెండు ఇళ్ళ మధ్య ప్రేమ వారధిగా మారి
తన పేరు మరచేనేమో బాధ్యతలు చేపట్టి.

తల్లిగా తాను తన్మయం పొందుతూ
చెల్లిగా పుట్టింటి చెలిమి కోరుకుంటూ

తన కష్టాలు కడుపులో దాచిపెట్టి
అందరి కష్టాలు తనవిగా చేసుకుని

నిత్యమల్లె పువ్వులే నిత్యం నవ్వుతూ
బొండుమల్లె తీరుగ గుంభనంగా ఉండి

కొండవాలు నుండి జాలువారిన నదిలా
వాలు కొరకు చూసి వీలు మార్చుకుంటూ

రూపురేఖలు మారిన నదీమతల్లిగా
దూకుళ్ళు చాలించి నిశ్చలమైన చందం

ప్రవహించిన చోట పచ్చదనం పెంచి
సాగిపోతుంది తన పని చేసుకుంటూ
ఆమెయే ఓ నది వలె!



-లక్ష్మీమదన్
7989916640

కవయిత్రి శ్రీమతి లక్ష్మీమదన్ గారు 'ఆమె ఓ నది' అంశంపై 'నదియే నాతి' శీర్షికతో రాసిన కవితలో ఆమెను నదిగా ఆవిష్కరించ యత్నించారు. నది ప్రవహించిన చోట పచ్చదనం పెంచి సాగి పోయినట్లు నాతి తన పని తాను చేసుకుంటూ .. తానున్న చోట ప్రేమానురాగాలను పంచుతూ...తన వారి సేవలో తరిస్తుందన్న అర్థం ధ్వనించే విధంగా కవయిత్రి లక్ష్మీమదన్ గారు తమ కవితను తీర్చిదిద్దారు. ఓ ఇంటి గారాలపట్టి ఈ చిన్నారి నడకతో పాటు నడత నేర్చిన నెలత అంటూ.. ఎత్తుగడలోనే మహిళను ఉన్నతంగా చిత్రించారు. నది ఎలా పొందికగా తన నడకను కొనసాగిస్తుందో.. మహిళ కూడా చదువు సంస్కారాలను ఒంట పట్టించుకుని .. ఇంటిపేరు మార్చుకుని పుట్టినింటి నుండి మెట్టినింటికి వచ్చే విధానాన్ని కవయిత్రి తమ కవితలో ప్రస్తావించిన తీరు బాగుంది. మహిళ తల్లిగా తాను తన్మయత్వం పొందుతూ చెల్లిగా పుట్టింటి చెలిమి కోరుకుంటూ తన కష్టాలను కడుపులో దాచిపెట్టి అందరి ఇష్టాలు తనవిగా చేసుకుంటుందని ..నిత్యమల్లె పువ్వులే నిత్యం నవ్వుతో బొండుమల్లె తీరుగ గుంభనంగా ఉండి కొండ వాలు నుండి జాలువారిన నదిలా వాలుకొరకు చూసి వీలు మార్చుకుంటుందని చెప్పడం బాగుంది. నదివలెనే నాతికూడా ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ పయనం సాగిస్తుందన్న విషయాన్ని చక్కగా తెలియజెప్పారు.

రూపురేఖలు మారిన నదీమతల్లిగా దూకుళ్ళు చాలించి నిశ్చలమైన చందం వోలే మహిళ కొనసాగుతుందని వివరించిన తీరు అభినందనీయంగా ఉంది. నది ప్రవహించే చోటల్లా సుఖ సంతోషాలు ఆనందాలు వెల్లి విరిసినట్లు మహిళ తానున్న చోట తనవారి సుఖం కోసం తనపని తాను చేసుకుంటూ వెళ్తుందని చెప్పడంలో కవయిత్రి ఔచిత్యాన్ని ప్రశంసించి తీరుతాం. వస్తు విశ్లేషణలో నదితో నాతిని పోల్చుతూ చక్కని పదబంధాలతో అలతి అలతి పదాలతో..సరళత్వానికి పెద్దపీట వేస్తూ కవితను రూపుదిద్దిన తీరు బాగుంది. మహిళ పెళ్ళయ్యాక రెండిళ్ళ ప్రేమ వారధిగా మారి మెట్టినింట బాధ్యతలను నిర్వర్తిస్తూ నదిని తలపింస్తుందన్న అర్థం వచ్చేలా ఈ కవితను మలిచారు. అభివ్యక్తి.. శిల్పం,వర్ణనలు, పోలికలు వంటి అంశాల్లో ఇంకా పరిణతి సాధిస్తారన్న విశ్వాసం ఉంది. అధ్యయనం ద్వారా తమ కలానికి మరింత పదును పెట్టుకుంటారని ఆశిద్దాం.

### మాతృమూర్తి

సూర్యున్ని నిద్రలేపే
చురుకుదనం
చందమామకు జోలపాడే
మధుర మృదుత్వం.

బండెడు చాకిరి
భుజాలకెత్తుకున్నా
బడాయిపోని అమాయకత్వం
ఆకలి దప్పికల్లో
ఇంటిల్లిపాదికీ కల్పతరువు.

ఓర్పు మంత్రాన్ని
ఒంటపట్టించుకుని
మార్పు దిశగా అడుగులు వేసే
మహాసాధ్వి
ఆయాసం ముఖమెరుగని
అల్పసంతోషి

తల్లిగా, చెల్లిగా
ఇల్లాలిగా
బహుముఖ పాత్రల
ప్రజ్ఞాశాలి
కుటుంబ శ్రేయస్సుకై
అహర్నిశలు పరితపించే
మహాతపస్వి
కట్టుకున్నోడికి కానుక
కన్న కడుపుకు దేవత
లోకానికి ఆదర్శమూర్తి
లౌక్యానికి మారుపేరు
మమతానురాగాల మహానది
నా మాతృమూర్తి
కష్టాల తుఫానులో
కన్నీటి సంద్రాన్ని
రెప్పల మాటున దాచి
రేపటికోసం పరితపించే
ఆమె
నది కాక మరేమవుతుంది.



-గంభీరావుపేట యాదగిరి
9440617611

కవి శ్రీ గంభీరావుపేట యాదగిరి గారు ఆమె ఓ నది అంశంపై 'మాతృమూర్తి' శీర్షికతో రాసిన కవిత ఆసక్తికరంగా మలచబడింది. తల్లిగా, చెల్లిగా, ఇల్లాలిగా బహుముఖ పాత్రల ప్రజ్ఞాశాలి. కుటుంబ శ్రేయస్సుకై అహర్నిశలు పరితపించే మహాతపస్విగా మాతృమూర్తిని ఆవిష్కరించారు. ఓ గృహిణిగా, దినచర్యను ఏకరువు పెడుతూ మాతృమూర్తిని ఉన్నతంగా ఆవిష్కరించారు. సూర్యున్ని లేపే చురుకుదనం.. చందమామకు జోలపాట పాడే మధుర మృదుత్వం.. అంటూ ప్రారంభ పంక్తుల్లోనే అతివ గుణగణాలను అక్షరాల్లో కవితాత్మకంగా నిక్షిప్తం చేశారు. బండెడు చాకిరీ భుజాలకెత్తుకున్నా.. బడాయిపోని అమాయకత్వం..ఆకలి దప్పికల్లో ఇంటిల్లిపాదికి కల్పతరుత్వం అని వర్ణించడంలో అతిశయోక్తి ఏమాత్రం కనిపించకుండా వాస్తవానికి దగ్గరగా కవి తమ ప్రతిభతో అంశం వెలుగులో గాఢంగా తీర్చిదిద్దారు. ఓర్పు మంత్రాన్ని ఒంటపట్టించుకుని మార్పు దిశగా అడుగులు వేసే మహాసాధ్విగా.. ఆయాసం ఎరుగని అల్ప సంతోషిగా అభివర్ణించారు. కట్టుకున్నోడికి కానుక.. కన్న కడుపుకు దేవత.. లోకానికి ఆదర్శమూర్తి..లౌక్యానికి మారుపేరు.. మమతానురాగాల మహానదిగా మాతృమూర్తిని ఆవిష్కరించిన తీరు బాగుంది. కష్టాల తుఫానులో కన్నీటి సంద్రాన్ని రెప్పల మాటున దాచి రేపటికోసం తపించే ఆమె నదికాక మరేమవుతుందని ప్రశ్నిస్తూ..చక్కని ముగింపునిచ్చారు. సూర్యున్ని నిద్రలేపే చురుకుదనం, చందమామకు జోలపాటపాడే మధుర మృదుత్వం.. బడాయి అసలే ఎరుగని అమాయకత్వం ఆకలి దప్పికల్లో ఇంటిల్లి పాదికీ కల్పతరుత్వం.. ఓర్పుమంత్రం.. అల్ప సంతోషి.. మహాతపస్వి.. లౌక్యానికి మారు పేరు..తదితర పదబంధాలు కవితలో చక్కగా ఒదిగిపోయి కవితావస్తువుకు బలాన్ని కూర్చాయి. శిల్పంలో చతురతను ప్రదర్శించారు. అభివ్యక్తిలో విలక్షణతను చాటారు. కవిత్వ నిర్వహణలో కనీస ప్రమాణాలు పాటించి మాతృమూర్తిని నదీమతల్లిగా అక్షరాలలో ఆవిష్కరించారు.

## నానీలు

కత్తిపోట్లు ఎన్నయినా
భరించవచ్చేమో
వెన్నుపోటు
పొడిస్తేనే కష్టం.

కార్పోరేటు ఆసుపత్రుల
చోద్యం
ప్రాణం పోయినా
చేస్తున్నారు వైద్యం.



-వద్దేపల్లి సంధ్య
సెల్:7036000123

# చంద్ర ఎందరికో మిత్రుడు.. నాక్కూడా..



-బి.నర్సన్
9440128169



ఆర్టిస్టు చంద్ర మరణంపై వేదనాభరిత జ్ఞాపకాలు వరదలా వచ్చాయి. సాధారణంగా కళాకారులు ఎక్కువగా ఏకాంతాన్ని ఇష్టపడతారు లేదా ఎంపికైన మిత్రబృందానికి పరిమితమవుతారు. వారి అవసరాలు కూడా అలాంటివే. కథలకు బొమ్మలు, పుస్తకాలకు ముఖచిత్రాలు వేసేవారికి ఒడువని పనుంటది. చంద్ర నాకూ తెలుసు అని చెప్పుకోడానికి చిన్న చిన్న సందర్భాలు మదిలో తిరుగుతున్నాయి.

1976 ప్రాంతంలో సిరిసిల్లలో భారీ ఎత్తున సాహితీ సమావేశాలు జరిగాయి. ఇప్పటి వాళ్లకు విచిత్రంగా ఉంటుంది కాని ఆ సభలకు వచ్చిన రచయితలు, కళాకారులను భాజాభజంత్రీలతో ఊరంతా తిప్పారు. ఆయన చంద్ర, ఈయన నగ్నముని అని ఆసక్తిగా చెప్పుకున్నారు. అప్పుడు పత్రికలెక్కువ, చదివేవారు ఎక్కువే. అందుకే ఆ గుర్తింపు, గౌరవం ఉండేవి.

సభల వార్త తెలియగానే జగిత్యాల నుండి నేను, అలిశెట్టి ప్రభాకర్ వెళ్ళాము. అప్పటికి నిజాం వెంకటేశం సార్, జూకంటి జగన్నాథం తెలుసు. వారు కనబడగానే ఇద్దరికీ బెరుకు పోయింది. ఆ వేడుకల్లో చంద్ర చిత్రకళా ప్రదర్శన ఏర్పాటైంది. గంభీర విగ్రహం, ఒత్తైన జుట్టు, చక్రాల్లాంటి కళ్ళను కప్పుతూ, కోటేరు ముక్కుపై నల్ల ఫ్రెమ్ కళ్ళజోడు, ఎప్పుడు వెంటే తిరుగుతున్న చిన్న అమ్మాయి..అదిగో ఈ బొమ్మలేసిన కుంచె మాంత్రికుడని దూరం నుంచే చెప్పుకున్నాం.

తిరిగి 1982 లో మరో మహత్తర అవకాశం. రంగులకల సినిమాకు స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నప్పుడు చంద్ర మాటల్ని రికార్డు చేసిన కేసెట్లను కాగితంపై రాసే పని పడింది. ఆ సినిమాలో హీరో క్యారెక్టరైజేషన్ కోసం పలు చిత్రకారులను ఇంటర్వ్యూ చేశారు. చంద్ర సమాధానాలు వింటుంటే ఆయన బోల్డ్ నెస్ కు ముచ్చటేసింది. ఇందులో ఏ మాట బయటికి రాదు, నీవు ఇష్టమొచ్చినట్లు మనసు విప్పి మాట్లాడచ్చు అని ముందే హామీ ఇచ్చినందువల్ల కళాకారుడి మనసు, చూపు, ఘర్షణ, చాటుమాటు ఆలోచనలు, ఆకాంక్షలు అన్ని బయటికి వచ్చాయి. అయితే ఆయన సినిమా ఆఫీసుకు గాని, షూటింగ్ వద్దకుగాని పని ఒత్తిడివల్లనేమో వచ్చేవాడు కాదు. నాకేమో ఆయన్ని చూడాలని, కలవాలని ఆశగా ఉండేది. షూటింగ్ బ్రేక్ లో ఓ రోజు నారాయణగూడలో ఆయన ఇంటికి వెళ్ళాను. పెద్ద దర్వాజాకు ఎదురుగానే బల్ల ముందు కుర్చీలో కూచొని ఏకాగ్రతతో బొమ్మ వేస్తున్నాడు. డిస్టర్బ్ చేస్తున్నాననే శంకతో మెల్లగా నేను ఫలానా, మీ మాటల్ని కాగితంపై రాసినవాణ్ణి అని చెప్పుకున్నాను. ఆయన కుంచె పక్కనబెట్టి పెద్దగా నవ్వి సిగరెట్ దమ్ము గట్టిగ లాగి మళ్ళీ పనిలో పడ్డాడు. ఓ



సన్మాన పత్రాన్ని దించుతున్నాడు. 'సాయంత్రమే ఈ అమ్మాయికి గానసభలో నర్తకిగా సన్మానం ఉంది' అన్నాడు. నాకు అంతా అర్థమైంది. టీ తాగాను. 'నేను వెళ్తాను సార్' అన్నాను. తల తిప్పకుండానే, కుంచెను ఆపకుండానే 'అరె అదేం లేదు.. ముచ్చట ముచ్చటే.. పని పనే.. ఏమైనా షూటింగ్ ముచ్చట్లు చెప్పు' అన్నాడు. బాతాఖానీ గంటకు పైనే సాగింది. ఓ దిక్కు మాట్లాడుతూనే చంద్ర బొమ్మలేసే విధానాన్ని గమనించాను. నాట్యభంగిమలో అమ్మాయి నిలువెత్తు ఆకారాన్ని స్కెచ్ వేయడం, తగిన రంగులద్దడం, చుట్టూ బంగారు వన్నెలో డిజైన్లతో ఫ్రెము, బొమ్మ పక్కన ఆమె కౌశలాన్ని వివరిస్తూ వాక్యాలు.. చూస్తుండగానే తెల్ల కాగితంపై అద్భుత చిత్రరాజం సిద్ధమైంది. 'కథలకు, పుస్తకాలకు వేసే బొమ్మల కన్నా వీటికి ఎక్కువ ఛార్జ్ చేయవచ్చు. సంతృప్తిగా, సంతోషంగా ఇస్తారు కూడా..' అన్నాడు. అసలు ఆ సభకు వన్నె తెచ్చే పనితనమది. స్వీకరించిన అమ్మాయి ఎంత ఆనందపడిందో.. ఇంట్లో అలంకరించుకొని ఎంత మురిసిపోయిందో..

ఇలా ఒక్కరా.. ఇద్దరా.. వందల్లో వేలల్లో ఉండి ఉంటారు. ఇంటింటా చంద్ర వెలుగులు ఎన్ని ఉన్నాయో.. ఆయన సిగరెట్ తాగుతూ మరో పనిలో పడ్డాడు. 'వెళ్తాను సార్' అంటూ లేచాను. కూచోమన్నా నాకే ఎందుకో ఇబ్బంది పెడుతున్నాననిపించి బయటికి వచ్చేశాను. యూనివర్సిటీలో పరీక్షలు ఉన్నందున రంగులకలలో చంద్ర షూటింగ్ పార్ట్ కు పనిచేయలేకపోయాను. తర్వాత కూడా పరిచయం అలాగే కొనసాగింది.

1975 నుండి నిజామాబాదులో కేకలు పత్రిక నడిపిన బైస సోదరులకు చంద్రతో గురు శిష్య సోదర సంబంధముంది. ఇప్పటికి నేటి నిజం సంపాదకులు బైస దేవదాస్ ను దేవా అని ప్రేమగా ఆప్యాయంగా పిలిచేవాడు. చంద్రకు తాను వేసిన కార్టూన్లతో ఓ బుక్ వేయాలని ఆలోచన రాగానే చాలా కార్టూన్లను బ్లాకులు చేయించాడు. 1980 లలో అక్షరాలు కాకుండా పేపర్ పై బొమ్మైనా, ఫోటో అయినా ప్రింట్ కావాలంటే బ్లాక్ చేయించవలసిందే. బొమ్మను కెమికల్స్ తో సీసంపై కట్ చేసి కర్ర ముక్క కొట్టి ఇచ్చేవారు. బుక్ రాలేదు గాని ఆ కార్టూన్లు కేకలులో వేసుకొమ్మని బ్లాకుల మూట వారికిచ్చేశాడు. ఆ రోజుల్లో స్థానిక పత్రికలో చంద్ర కార్టూన్ రావడం ఓ హైలైట్. వాటిని చూసి అడగగానే జగిత్యాల నుండి ఆ రోజుల్లో వచ్చిన చాటింపులో కూడా వాటిని వేసుకునేందుకు చంద్ర అనుమతిని ఇచ్చాడు. 1983 లో ఏడాది పాటు నడిచిన చాటింపుకు కీ. శే. బాల గంగాధర్ ఎడిటర్ గా ఉన్నారు.

అలిశెట్టి ప్రభాకర్ కు చంద్రకు మంచి అనుబంధముండేది. విద్యానగర్ లో ప్రభాకర్ స్టూడియోకి ఓపెనింగ్ చంద్ర చేతుల మీదుగానే జరిగింది. బాగ్ లింగం పల్లి హౌజింగ్ బోర్డు ఇళ్లలో ఇద్దరు దగ్గర దగ్గర ఉండేవారు. ఆ తర్వాత చంద్ర పద్మారావునగర్ కు వెళ్లిపోయారు. మిగితా జీవితం అక్కడే గడిచింది.

నేను ఉద్యోగపరంగా తిరిగి తిరిగి 2011 మళ్ళీ హైదరాబాద్ కు వచ్చాను. నేను చిక్కడపల్లిలో ఉన్న సంగతి నిజాం వెంకటేశం సార్ చెప్పగానే తీసికెళ్ళమని అడిగేవాడు. ఓ రోజు ఆఫీసు నుండి రాగానే సార్, చంద్ర మా ఇంట్లో దర్శనమిచ్చారు. చూడగానే ఇద్దరమూ గట్టిగా వాటేసుకున్నాం. తానే ఆటో మాట్లాడుకుని వచ్చి వెళ్దాం పద అన్నాడని సార్ సర్ది చెప్పబోయాడు. చాలా మంచి పని చేశారని సార్ కు థాంక్స్ చెప్పాను. రాత్రి పది గంటలదాకా ఎన్ని ముచ్చట్లో..ఎన్ని నవ్వులో..చాలా ఆనందంగా గడిచింది. చంద్ర సిగరెట్ పొగతో మా డ్రాయింగ్ రూమ్ లో ఏర్పడ్డ మబ్బుల గురించి మా ఆవిడ ఇప్పటికి గుర్తు చేసేది, ఇక ఎప్పటికి మరిచిపోలేదు.

2014 లో అలిశెట్టి మిత్రులు తరపున ప్రభాకర్ కవితాచిత్రాలతో 'అక్షర నక్షత్రంమిద..' వేసినప్పుడు బలవంతంగా చంద్రతో దానికి ముందుమాట రాయించడం జరిగింది. ఒక్క పేజీ రాసినా అలిశెట్టి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిం చాడు. ' నిలువెల్లా రంగు, రుచి, వాసనలతో కుళ్ళిన మనుషుల మధ్య బతకలేక వెళ్ళిపోయినా ప్రభాకరుడా! నీ కోసం ఎదురు చూస్తూ ...ఇన్నేళ్లకు, ఇప్పటికి, ఎప్పటికి నిన్నెరిగిన నీ చంద్ర' అంటూ ముగించాడు.



ఇలా మరిన్ని.. చంద్ర చిత్రకారుడు, కథకుడు, కవి, నటుడు, కళా దర్శకుడు, పబ్లిసిటీ డిజైనర్.. కుంచెను అలవోకగా తిప్పే మొనగాడు, పైపెచ్చు మంచి మనిషి, గొప్ప స్నేహితుడు, కుటుంబ సభ్యుడు, మరో వైపు నిక్కచ్చి మనిషి, ప్రలోభాలకు లొంగని వ్యక్తిత్వం, పని రాక్షసుడు, మనసులేని చోట నిలువలేని వ్యక్తి. వేల కథలకు రేఖాచిత్రాలు, పుస్తకాలకు ముఖచిత్రాలు చంద్ర చిత్రకళా వైభవాన్ని సుస్థిరం చేస్తాయి. మైదం చంద్రశేఖర్ అంటే తెలియదు గాని చంద్ర అనగానే ఇంగ్లిష్ లో నిలువు కర్రల్లా ఆరు అక్షరాలు, తెలుగులో కలహంసల కదలాడే చంద్రవంకలు బొమ్మ అందాలు చూడమని ఆహ్వానిస్తాయి. ఇక చంద్ర ఎక్కడికి పోగలడు?

### ఇప్పుడే

నీకున్న ఓపికేమిటో
ఇప్పుడే చూపాల
నీకున్న సహనం సత్తా ఏంటో
ఇప్పుడే ముడి విప్పాల
దేశమంతా
నీ విజ్ఞత పైనే నమ్మకం పెంచుకుంది
నీకున్న జాగ్రత్త ఏమిటో
దేశదేశాలకు స్ఫూర్తి గీతమవ్వాలా
నీయింటికి నువ్వే తాళం
లేకుంటే వేస్తుంది కరోనా గాలం
నీ దేహానికి నువ్వే ముకుతాడేయ్యాల
నీ మనసుకు నువ్వే కల్లెం కావాలా
సబ్బుతో చేతులు శుభ్రం చేస్తే
మంటతో మల మల మాడిపోతుంది
తుమ్ముకు దగ్గుకు చిక్కం తొడిగితే
గిల గిలా తన్నుకొని చస్తుంది కరోనా
కదులుతున్న తాడును
బుసకొట్టే పామనుకోకు .

అనుమానం జాగ చేస్తే కాదా
కరోనా కంటె చాల డేంజర్
ప్లీజ్ ఒక సారి ఆలోచించు
నీ విచ్చలవిడితనం నీతోపాటు
ప్రపంచాన్నే తుడిచేస్తుంది



-డా.ఉదారి నారాయణ
9441413666

### గొంగడి

చిన్నపుడు నానమ్మ
గొంగడిపై కూర్చోబెట్టి చెప్పిన కథలెన్నో
పంచుకున్నా చెరగని జ్ఞాపకాలెన్నో.

బిరప్పపటం కథలు చెపుతుంటె
చలిలో వెచ్చని హాయినిచ్చే
గొంగడి కొప్పెర గుర్తులెన్నో

ఇప్పుడు ఎలక్ట్రానిక్ స్టోర్ లో
సెల్ ఫోన్ల సేల్స్ ఎట్లనో
పూర్వం సంతలో
ఎటుచూసినా గొంగండ్ల బ్యారమే
శుభకార్యాల్లో ఐతే
తనకే అగ్రతాంబులం
అప్పుడు ఇంట్లో గొంగడి ఉంటే
అది హుందాతనానికి
పేటెంట్ లెక్క
ఏ పెండ్లిలోనైనా పెత్తనం దానిదే !
అనుబంధానికి,ఆప్యాయతకు
మరో పేరు గొంగడి
గిజిగాని గూడు అల్లికను
మైమరిపించిన
కురుమ గొల్లల కృషిఫలితం
ఈ గొంగడి నేత.

రాత్రికి నిద్ర నేస్తం
చలికి గొంగడి నేస్తం
వెచ్చని వేడినిచ్చే
గుణం దాని సొంతం
భుజంపై దాని గుర్తు
అవిరేను కుండ అలంకరణ
నెత్తిపై కొప్పెర పెడితే
హిమాలయ పర్వతపు
ఎవరెస్టు శిఖరమే!
నేటి కాలపు కాస్లిరగ్గు
మానవ చరిత్రకు సాక్ష్యం
మన అస్తిత్వ మనుగడే ఈ గొంగడి.



-డాక్టర్ గుంటి గోపి
8019808207

### మావి బూడిద గిన్నెలు

రాతిర్నుంచి సెగకుబ్బిపోయిన
మాపొయ్యి
అస్తమించేటప్పుడు
సన్నిల్లతో ముస్తాబు జేసి.
మా గిన్నెలకు బుడిదేత్తింది మాయమ్మ.
అట్లా.... పోయ్యిని మోక్కి
అగ్ని దేవుని మంటసల్లర్సి...
మా ఆకలి దేవున్కి తోల్త పూజ జేయనికె
బూడిదను 'జాలెడ్కాకి' తీస్కపోయింది
'మావి ఈ దినంకి బుడిద గిన్నెలే....'
ఇరుకు గదుల్లో పోత్తింట్లో
వాసాల మీద మగ్గిన
మా అవ్వ ఇంటి గిన్నెలకు....
బూడిదతో తానంజేపిచ్చింది.......
మా ఇంట్ల జరిగే
తోల్త కార్యం ఇదే
ఒత్తుకెల్లి సల్లుకుంటోచ్చిన
మా నిద్రతల్లి
'మళ్ళీ ఊడ్సి మల్లె చెట్లకేసింది'
మా ఆకలి బత్కుల గిన్నెలకు
ఇంక కొత్త బురుగుపూయలే.....
గట్లే బుర్గేల్లనికె కుకుడుకాయనో
లేక చింతరిక్కేనో ఎస్తది....
కోబ్బెరి నారతోనే తెల్లగైతే తోముతది
మా గిన్నెలు మేం ఎప్పటికీ నల్పే
"మా బత్కులు మారిందాంక
మాగిన్నెలు బుడిద గిన్నెలె?...అంటా?"



-దండు వెంకట్ రాములు
6303163202

### భల్లం భాష్యం

# కవి వ్యక్తిత్వమే.. కవిత్వానికి చిరునామా...!

ఎంతసేపూ కుటుంబ సబంధాలు.. మానవ సంబంధాల చుట్టూ తిరిగే కవిత్వాన్ని, అందుకు భిన్నంగా వస్తు వైవిధ్యంతో తెలుగులో రాసే కవుల కొరత ఎప్పుడూ ఉండనే వుంది. ఉంటుంది. సామాజిక ఆర్థిక రంగాలలో దూసుకొస్తున్న పెను మార్పులతో పాటు నాగరికత సృష్టించిన అనేక సమస్యల్ని ప్రతిబింబించాల్సిన కవిత్వం రావాల్సిన అవసరం తక్షణం ఎంతో వుంది. ఈ దిశగా పర్యావరణం, గ్రామీణాభివృద్ధి, మానవీయ అంశాల ఆధారంగా కవిత్వం రాస్తున్న వారు అరుదుగానే కనిపిస్తున్నారు.

కవులకు తమ అభిప్రాయాలను, వివిధ సాహిత్య ప్రక్రియలో వెలిబుచ్చే స్వేచ్ఛ ఉండాలనే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేనప్పటికీ వాళ్ళు పొందుతున్న స్వేచ్ఛ వెనుక ఒక కనిపించని పరిమిత ఉంటుంది. అదే సామాజిక బాధ్యత. కవులనే వాళ్ళు సమాజం పట్ల స్పష్టమైన అవగాహనతో రచనలు చేయాలని, వారి అవగాహనారాహిత్యం, సమాజానికి ఏ రూపంలోనూ హాని చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఆయా కవులదే.

కవి వ్యక్తిత్వమే అతని కవిత్వానికి చిరునామా. వస్తువురీత్యా, అభివ్యక్తిపరంగా, భాషాపరంగా మాత్రమే కాక, అన్ని విధాల మంచి కవిత్వంగా భాసిస్తుంది. ఆ కవిత్వంలో కనిపించే అతిపటిష్టమైన శిల్పం వుండకపోవచ్చు. కానీ మన హృదయాల్ని తాకే సున్నితత్వం ఉంటుంది. మనల్ని ఒక అనుభూతికి, ఒక భావనకి గురిచేసే నైపుణ్యం ఆకవిత్వంలో వుంటుంది.

అక్షరాన్ని భావ వ్యక్తీకరణకు సాధనంగా నిబద్ధ ఆశయి నిరూపణకు ఆయుధంగా ఉపయోగించే కవులు తనచూ మనకు తారసిల్లుతూనే వుంటారు.అయితే మానవ జీవితంలో గల విషాద మానవతా భావ రాహిత్యాన్ని వెలికి తోడి, వేదనాక్షర సితారల మీదే వసించే కవులు బహు అరుదుగా అనుభవంలోకి వస్తారు.

సామాజిక సిద్ధాంతాల ఒత్తిడి పెరిగే కొద్దీ కవిత్వం తీరు మారిపోతుంది అనేకంటే పారిపోతుంది అంటే బాగుంటేదేమో దీన్ని బట్టి తేలిందేమంటే కవిత్వం పలచబడుతుంది. సామాజిక సంక్షోభాల తాకిడికి సున్నితమైన కవి స్పందనలే కవితలవుతున్నాయి. వాటికి సిద్ధాంతాల స్థాయికి కవి తీసుకెళితే కృత్రిమత్వాన్ని సంతరించుకుంటుంది. కవి తన హద్దుల్ని విస్మరిస్తే కవిత్వం కవిని విస్మరిస్తుంది. ఇటీవల రకరకాల సిద్ధాంతాల రాపిడిలో కవిత్వం నిష్క్రమిస్తుందేమనే భయం ఏర్పడుతుంది.

ఏ ఉద్యమమైనా మొదట కవిత్వంలో వ్యక్తమవుతుంటుంది. ఆయా ఉద్యమ సమయంలో ఎందరో కవులు నిలిచి వెలిగితే, మరెందరో పుట్టుకొస్తారు. ఒక్కోసారి ఉద్యమం పక్కదారి పట్టినప్పుడల్లా నిబద్ధత కల కవులు హెచ్చరికలవుతుంటారు. ఉద్యమం వెనుక పట్టు పట్టినప్పుడల్లా సుతిమెత్తని, లేదా సుత్తిమెత్తల మాటలో అదిలిస్తుంటారు. ఈ క్రమంలో బదలించే కవులు కూడా ప్రయత్నం పరుగులో ఎక్కడా వెనకడుగు వేసిన దాఖలా కనిపించదు. ఉద్యమం చతికిలపడిన సందర్భాలొచ్చినప్పుడల్లా కవులు యుద్ధవీరుల మాదిరి కవిత్వంలో జవసత్వాలనిచ్చే ప్రయత్నం చేశారు. చేస్తుంటారు.చేయబోతుంటారు కూడా.

కవిత్వంలో ప్రయోగం అనేది ఒక ప్రయోజనానికి దారితీస్తుంది. కవి ఈ దృష్టికోణంలోంచే తన కవిత్వాన్ని ఆలోచిస్తాడు. ప్రయోగం ద్వారా- ఏదనేది నిర్ధారించుకుంటాడు. పదం-భాష, అభివ్యక్తి ఇవన్నీ ఎపుడూ ప్రయోగదశలో ఉండేవే. ప్రయోజనం కవి పరిణితి. చైతన్యం అనుసరించి ఉంటుంది. కవి సామర్థ్యాన్ని బట్టి కవిత్వం రాణిస్తుంది.

> "కవిత్వమంటే- నిప్పులమీద నడవడం ముళ్ల కిరీటాన్ని మోయడం, అశ్రుకణం, అగ్నిగోళం కావడం, ఆర్తినీ, ఆకలి బాధని అంతమొందించడం లాంటిది"

వ్యక్తి కవిత్వానికీ- వర్గ కవిత్వానికీ ప్రాంతీయ కవిత్వానికీ ఇటీవల కాస్త విలువ పెరిగింది. మొత్తం మీద సామాజిక కవిత్వ స్వేచ్ఛ విలువ గాడి తప్పుతుందేమో. తప్పొప్పుల గ్రహింపు పోతుందేమో. ఆధునిక కాలం అందించిన అంతర్జాల సేవలు యువతరాన్ని ఉగ్రూతలూగించడమే కాదు. అడపాదడపా పెడతోవ పట్టిస్తున్నాయెమో. ప్రజల కోసం ప్రతిక్షణం పని చేయాల్సిన ప్రచార, ప్రసార మాధ్యమాలు, వినోదానికి ఆలవాలమయ్యి- కవిత్వాభివృద్ధికి- అంతగా విలువ ఇవ్వకుండా పోతున్నాయి.

ఒకవైపు గ్లోబలైజేషన్ ఉరవడితో ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనజీవన సరళులనూ, మానసిక స్పందనలనూ చిత్రించే కవిత్వం అడపాదడపా ఎదురుపడి సమాజాన్ని ప్రభావితం చేస్తున్నమాట నిజమే.

కవులకు కమర్షియల్ దృష్టి కూడా వుంటే మంచిది. ఎందుకంటే కవిత్వ విజయానికి కమర్షియల్ వయబిలిటీ కూడా ఒక కొలబద్దే కాబట్టి అలాగని కేవలం- అదే దృష్టితో రాత్రింబవళ్లు శ్రమించి- ఒరిజినల్స్‌కి దూరంగా- మానవీయ విలువలకు భారంగా- పక్తు వచనంలా కవిత్వీకరిస్తే ఘోరంగా వుంటుంది. నేటివిటీని పోగొట్టుకున్న ఏ కవి మంచి కవిత్వం రాయలేడు. ఇప్పుడు కవి ఏ సొసైటీలో ఉన్నా, రూరల్ నేటివిటీని పోగొట్టుకోకూడదు.

కవిత్వంలోనూ కొత్త ట్రెండ్ వచ్చిందేమో. కవిత్వమిప్పుడు ఒక ప్రయోజనానికి కాకుండా లాభనష్టాల వ్యాపారం అయిపోతుందేమో. ఒక వస్తువుని ప్రామోట్ చేయాలంటే దానికి అడ్వర్‌టైజ్‌మెంటు అవసరమైనట్లు కవిత్వం పరిస్థితి ఇప్పుడు దానికేం మినహాయింపేం కాదు.

మామూలు మాటలకు కవిత్వ పరిమళాలు అద్దడం గడ్డకట్టుకుపోయిన అనుభవాలను కవిత్వ వస్తువులుగా స్వీకరించడం, కవికి వెన్నతో కాదు- పెన్నుతో పెట్టిన విద్య. తత్ఫలితంగా కవి అనుభవాల సారాంశమే కవిత్వ నేపథ్యంగా రూపొందించబడుతుంది.

ఏ కవి కూడా ప్రారంభంలో తాను కమర్షియల్ రచనలే చెయ్యాలి. తాను సీరియస్ రచనలే చెయ్యాలి. అని నిర్ణయించుకొని రాయడం మొదలుపెట్టడు. పరిస్థితులు అనుభవం స్థితిగతులు- ఆయా సందర్భాలు- అన్నీ ముప్పేట వహిస్తే- ఏ కవి అయినా తదనుగుణంగా కవిత్వీకరణకు పూనుకుంటాడు.

కవిత్వమంటే- నిప్పులమీద నడవడం ముళ్ల కిరీటాన్ని మోయడం, అశ్రుకణం, అగ్నిగోళం కావడం, ఆర్తినీ, ఆకలి బాధని అంతమొందించడం లాంటిది. అభిమాన కవి గొప్పకవి అయివుంటే- చాలా మంది కవులు కావడానికి అతగాని కవిత్వం ప్రేరణ అవుతుంది. అడపాదడపా ఏకలవ్య శిష్యులు ఎక్కువతుతుంటారు కూడా. కాకపోతే ద్రోణాచార్యుని మాదిరిగా ఆ గొప్పకవి తన ఏకలవ్య కవులను- తన కోసమై బొటనవేలుని త్యాగం చేసే అవసరం ఏర్పరచనే కూడదు. ఎందుకంటే- వేలకొద్దీ కవితలు రాయడానికి వేలు ముఖ్యం కదా..!



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642




నేటినిజం దసరా ప్రత్యేక సంచిక-2001లో ప్రముఖ చిత్రకారులు, రచయిత చంద్రతో డా॥నాళేశ్వరం శంకరం చేసిన ఇంటర్వ్యూ ఇది.

ఈ సంచికకు ముఖచిత్రం వేసింది చంద్రగారు.

## చంద్ర ఇకలేరు



ప్రఖ్యాత చిత్రకారుడు, కార్టూనిస్టు రచయిత, కళాదర్శకుడు ఆర్టిస్టు చంద్రగా సుపరిచితుడైన మైదం చంద్రశేఖర్ (75) ఏప్రిల్ 28 బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. కొంతకాలంగా నాడీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన మూడేళ్లుగా సికింద్రాబాద్‌లోని ఒక రీహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంటున్నారు. నాలుగురోజుల క్రితం ఆయనకు కరోనా సోకింది. అప్పటి నుంచి అదే సెంటర్‌లో చికిత్స పొందుతున్న ఆయన ఏప్రిల్ 28 బుధవారం అర్ధరాత్రి 1.20 గంటలకు గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య విజయ భార్గవి, కుమారుడు చైతన్య, కూతుళ్లు కవిత, లాలిమ ఉన్నారు. విజయ భార్గవి హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. ముగ్గురు పిల్లలూ విదేశాల్లో స్థిరపడ్డారు. చైతన్య, కవిత అమెరికాలో, లాలిమ జపాన్‌లో ఉంటున్నారు. చంద్రకి మరో సహచరితో కుమార్తె మేఘన ఉన్నారు. ఆమె విదేశాల్లో ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం 3గం॥లకు పద్మారావునగర్ పరిసరాల్లోని బాపూజీనగర్ శ్మశానవాటికలో చంద్ర అంత్యక్రియలు ముగిశాయి. విదేశాల నుంచి విమాన రాకపోకలపై పరిమితులు ఉండటంతో ఆయన పిల్లలెవరూ అంత్యక్రియలకు రాలేకపోయారు. బాపూ మాదిరే చంద్రది తెలుగు చిత్రకళపై చెరగని సంతకం. బాపూ బొమ్మల స్ఫూర్తితోనే కుంచె పట్టినా.. అనతి కాలంలోనే తనదైన శైలిలో బొమ్మలు గీస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. 1970 నుండి దాదాపు 30 ఏళ్ల పాటు చంద్ర వేసిన ముఖచిత్రాలతో వేలాది పుస్తకాలు వెలువడ్డాయి. దాశరథి కృష్ణమాచార్య, పల్లా దుర్గయ్య, కాళోజీలకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. చంద్ర స్వస్థలం వరంగల్ 1946 ఆగస్టు 25న జన్మించారు. తల్లిదండ్రులు సోమలక్ష్మి, రంగయ్య 1955లో వారి కుటుంబం హైదరాబాద్‌కు మారింది. చంద్ర, పీయూసీ చదివి ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లొమా పూర్తిచేశారు. నారాయణగూడలోని పల్లాదుర్గయ్య ఇంటి ప్రాంగణంలో దాశరథి, బిరుదురాజు రామరాజు, వట్టికోట తదితర వైతాళికుల స్ఫూర్తి ఛాయలో చంద్ర పెరిగారు. ఆరు, ఏడు తరగతుల్లోనే శంకర్ వీక్లీ చిత్రలేఖనం పోటీలో పాల్గొని బహుమతులు అందుకున్నారు. చంద్ర గీసిన కార్టూన్లు తొలిసారిగా 1959లో ఆంధ్రపత్రికలో ప్రచురితమయ్యాయి. ఆయన కలం నుంచి జాలువారిన తొలి కథ 'నా సూటుకేసు' 1961లో ఆంధ్రప్రభలో వెలువడింది. ఆపై మూడేళ్లకు 'గడ్డిపూలు' పుస్తకానికి బొమ్మలు గీశారు. చంద్ర చిత్రకళాప్రస్థానంలో కొన్ని వందల సంచికలకు ముఖచిత్రాలు, కొన్ని వేల ఇలస్ట్రేషన్లు, కార్టూన్లు, పెయింటింగ్‌లు, గ్రీటింగ్ కార్డులు వెలువడాయి. విరసం, భూమిక, కథాసాహితీ వంటి ప్రముఖ ప్రజా సాహిత్య సాంస్కృతిక హక్కుల సంస్థలకు లోగోలను రూపొందించారు. 'యువ', 'జ్యోత్స్న', 'జ్యోతి', 'రచన', తదితర పత్రికల్లోనూ పనిచేశారు. మరికొన్ని సాహిత్య పత్రికల్లో కొన్నాళ్లు సంపాదకీయ విభాగంలోనూ సేవలందించారు. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఆర్టిస్టు కమ్ డిజైనర్‌గా పనిచేశారు. పాఠ్యపుస్తకాల అట్టమీద బొమ్మలు, లే-అవుట్, డిజైనింగ్ రూపకల్పనలో చంద్ర ప్రధాన పాత్ర పోషించారు. ఆయన సుమారు నూటయాభై కథలు రచించారు. 'బడ్జెట్ జీవితం', 'గడియారం గొల్లుమంది', 'అంజనం', 'చావు', 'చీకటి', 'తలుపులు', కథలున్నాయి. 'బడ్జెట్ కథ'కు యూత్‌టైమ్స్ జాతీయ అవార్డు అందుకున్నారు. 'ఓ అమ్మకథ", 'డిటెక్టివ్ నారద', తదితర సినిమాలకు కళాదర్శకుడిగా పనిచేశారు. మరికొన్ని సినిమాలకు పబ్లిసిటీ డిజైనర్‌గానూ వ్యవహరించారు. దర్శకుడు బీ నరసింగరావు ప్రోత్సాహంతో 'రంగులకల', 'చలిచీమలు', 'అబ్బాయి ప్రేమలోపడ్డాడు' తదితర చిత్రాల్లో నటించారు. 'ఇంద్రధనస్సు', 'వెన్నెలవేట' ధారావాహికలకు దర్శకత్వం వహించారు. చంద్రను ఉమ్మడి ఏపీ ప్రభుత్వం హంస అవార్డు'తో సత్కరించింది. ఏపీ సాంస్కృతిక మండలి 'కళారత్న అవార్డు'ను ప్రదానం చేసింది. 'చంద్ర' 'కార్టూన్లు', 'డస్ట్‌బిన్ కార్టూన్లు' పేరుతో పుస్తకాలు వెలువడ్డాయి. చంద్ర ఆత్మీయులు, స్నేహితులంతా కలిసి 2016లో 'ఒక చంద్రవంక' పేరుతో అభినందన సంచిక ప్రచురించారు.

చంద్ర మృతిపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రఖ్యాత దర్శకుడు బి. నరసింగరావు, ప్రముఖ చిత్రకారుడు శీలావీర్రాజు, ప్రముఖ నటుడు త్రిపురనేని సాయిచంద్, కవయిత్రి విమల మొర్తల, సాహితీ విశ్లేషకుడు సమ్మెట నాగమల్లేశ్వరరావు, కథాసాహితీ సంపాదకుడు వాసిరెడ్డి నవీన్, రచయిత వీ. రాజారామ్మోహనరావు, పూర్ణ, హైదరాబాద్ ఆర్ట్‌సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, డా॥ఎన్.గోపి, బి.యస్.రాములు, డా॥నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, భాషా, సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, కవి యాకూబ్, వంశీరామరాజు, సీనియర్ జర్నలిస్టులు తాడి ప్రకాశ్, బైస దేవదాసు, భండారి శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

# మనోఫలకం మీద మానవ అగ్నిరేఖల్ని గీసే చంద్రతో ముఖాముఖి



మనోఫలకం మీద మానవ అగ్నిరేఖల్ని సానబెట్టగల ప్రజాచిత్రకారుడు మన చంద్ర. కళాకుంచకు బతుకును అంకితం చేసుకున్నవాడు చంద్ర. ఒక సాటిలేని బొమ్మను గీసే నిర్మాణపు శైలీ రహస్యాలను పాఠ్యగ్రంథంలా ఒంటబట్టించుకున్నాడాయన. ప్రయోగాత్మక బొమ్మలు వేయడంలోనే కాదు, సృజనాత్మక రేఖల్ని కాగితం మీద నాటడంలోను ఆయన కాయనేసాటి. ప్రపంచ చిత్రకళ వేదిక మీద స్థిరంగా నిల్చోబెట్టదగ్గ పేంటింగ్ గీతలు యెల్లవేళలా ఆయన అంతఃప్రపంచంలో సంచరిస్తూనే ఉంటాయి. ఆయన సామాన్యంగా కనిపించే అతి సాహసవంతుడు. బొమ్మగీయడానికుండే పరిభాష కోసం, బొమ్మల్ని మాట్లాడించగల నైపుణ్యం కోసం అనుక్షణం అసహనానికి లోనవుతూనే ఉంటాడు. ఎవరూ పట్టుకోని బొమ్మల వాస్తవ జీవన పార్శ్వాలకోసం, సామాజిక గర్భంలో దాగిన ఒక అనంతమైన మానవ గాయాన్వేషణ కోసం బతుకుతున్నట్లుంటాడు. తొలి రోజుల్లో ఆయనను బాపు బొమ్మలు వెంటాడినాయనుకుంట. ఆ తరువాత తరువాత బాపును జీర్ణం చేసుకుని చిత్రకళారహదారిలో ప్రయాణిస్తూ ప్రయాణిస్తూ వెనుదిరిగి చూసుకంటే ఆయన తరువాత ఆంధ్రుల చిత్రకళకు చంద్రనే దిక్కన్నంతగా స్థిరపడిపోయిన స్వయం కృషీవలుడికి మన రాష్ట్రంలోనే కాదు. మన దేశంలోనే కాదు, అంతర్జాతీయంగా కూడా కీర్తికిరీటాలు తొడిగింది, అవార్డులిచ్చి, దుశ్శాలువాలతో సత్కరించింది. ఆయన బొమ్మల అభిమానులే తప్ప భజన ముకాభిమానుల అభిమానంతో మాత్రం కాదు. నిజానికి ఆయన జీవితంలో మిగుల్చుకున్నది నలభైయేళ్ళ చిత్రకళా జీవన సంపదనే. చంద్ర కథలకు, బొమ్మలకు ఒక సుస్థిర స్థానం తెచ్చిపెట్టింది. కచ్చితంగా చెప్పాలంటే బేసీగ్గా ఆయన చాలా ఎమోషనల్ మనిషి కావడమే. తప్పుకు తిరుగాలనే ఆలోచన లేకపోవడమే. అజాత శత్రువుగా జీవించాలని కూడా లేపోవడమేనని నేననుకుంట. ఆయన కొందరికి ఇష్టుడు, మరికొందరికి ఆయుష్టుడు. ఒక స్పష్టమైన ఇష్టాయిష్టాలున్న **చంద్రతో డా॥ నాళేశ్వరం శంకరం** చేసిన ఇంటర్వ్యూ ఇది.

**మీ బాల్య స్మృతుల్లో ఏవైనా సాహిత్యానుభూతులున్నాయా?**

మా వరంగల్లులో రెండో క్లాస్‌లో చదువుతున్నపుడు ''రాణి రుద్రమ'' నాటకంలో ప్రతాపరుద్రుని వేషం వేశాను. నాటకం మొదలయింది. తెరతీయగానే నాదో డైలాగు ''అమ్మా ఈ రాజ్యంలో మీ పాలనకు వంక పెట్టువారున్నారా?'' అంటూ ఉండగానే లైట్లు పోయాయి. ఆనాటి సమావేశానికి ముఖ్య అతిథిగా బొంబాయి నుండి వచ్చిన పార్సీ తాయబ్‌జీ గారు నాటకం తరువాత స్టేజీ మీదకు వచ్చి నన్ను ఎత్తుకుని ముద్దు పెట్టుకున్న స్మృతి ఇంకా నాలో దాగే ఉంది.

మా ఫాదర్ నెలకోమారు అన్నయ్యకు నాకు కలిపి ''చందమామ'' కొనిచ్చేవారు. దాన్ని పదో తరగతి వచ్చేవరకు క్రమం తప్పకుండా చదివేవాణ్ణి. ''చందమామ''లోని తెలిసిన విషయాలేంటంటే మంచి చెడు, సుఖం దుఃఖం, న్యాయం అన్యాయం ఇట్లా మనిషికి కావలసిన ఫాసినేటింగ్ స్టోరీసే అయినా నాకు వంటబట్టేవి. అవి అమ్మమ్మ కథల్లాంటివే అయినప్పటికీ మనుషులు అనే పెద్దపదం కాదు గాని మనం యెట్లా బతకాలో నేర్పించాయి. ఈ రోజున ఆలోచిస్తే అసలు మనిషికి ఈ ఇజాలు, వీటి ప్రాతిపదికత చందమామ కథల్లోనే తెలుస్తాయి.

ఆరవ తరగతితో అనుకుంట మా స్కూల్ మ్యాగజిన్‌లో ''రాజాగాడి రాజాపెన్ను'' అనే కథ రాశాను. క్లాసులో ఆ రాజా పెన్నును యెవడో కొట్టేస్తాడు. అది కనుక్కోవడమే ఆ కథ సారాంశం. మరో విషయం తొమ్మిదవ తరగతో పదవ తరగతితో గుర్తులేదు కానీ 'ప్రభ' పత్రికకు మజిలీ అనే కథ పంపాను. అచ్చయింది. యం. చంద్ర కేరాఫ్ దాశరథిగారి అడ్రస్ రాశాను. దాశరథిగారు ''అడ్రస్‌లో నా పేరుందని యేసారురా'' అన్నారు. ''నీ పేరు చూసి యెవడు'' వేస్తాడు అన్నారు. అప్పుడు నాలో పట్టుదల పెరిగింది. కోపం వచ్చింది. ఆ పెద్దాయన అలా అనడం వల్లనేమో కథలూ, బొమ్మలూ వేయడానికి పెద్ద కారణమైంది.

మా నాన్నగారు ఆప్కో ఫాబ్రిక్స్‌లో పని చేసేవారు. ఫాబ్రిక్స్ వాళ్లకు ''నేత'' అనే వార పత్రిక ఉండేది. పదవ తరగతి వరకు అందులో చాలా కథలు రాశాను.

**బొమ్మలు వేయాలన్న ఉత్సాహం బాల్యం నుండి ఏమైనా ఏర్పడిందా?**

జ్ఞాపకం వస్తుంది. మాకు రెండవ తరగతిలో రామానుజాచార్యులు అనే డ్రాయింగ్ టీచర్ ఉండేవారు. ఆయన బ్లాక్ బోర్డుమీద వేసిన బొమ్మల్ని చూసినప్పుడల్లా ఇష్టమేర్పడేది. నాల్గులో ఉన్నపుడు ప్రభాకర్ అనే క్రిష్టియన్ కుర్రాడు క్లాస్ డెకరేషన్ కోసం అక్బర్, బీర్‌బల్, అశోకుడు ఇలా కొందరి బొమ్మలు వేసినవి చూసి అత్యద్భుతంగా ఇంప్రెసయ్యాను. నాల్గవ తరగతిలోనే మా స్కూల్‌కు ఓ మెజీషియన్ వచ్చాడు. వాడు రెండు చేతులతో చాక్‌పీస్ పట్టుకుని అలవోకగా నల్లబల్లమీద ఒకేసారి ఒక చేత్తో ఒక పక్క చిలక బొమ్మను వేస్తే, సరిగ్గా సైమల్టేనియస్‌గా మరో చేత్తో ఆ చిలక బొమ్మను ప్రతిబింబంగా వేశాడు. కుడి చేత్తో చిలక బొమ్మను వేస్తూ, ఎడమ చేత్తో అదే సమయంలో దాని కెదురుగానే దాని ప్రతిబింబంగా వేసింది నన్ను బాగా ఇంప్రెస్ చేసింది. కాగితం మీద బొమ్మవేసి మడతపెడితే ఎక్యురేట్‌గా ప్రతిబింబం ఎలా పడుతుందో అలా వేశాడు. అది నిజానికి ఆర్టుకు సంబంధించింది కాదుకాని వాడి సాధనను చూసి అద్భుతంగా ఫీలయ్యాను.

నీకో విషయం చెబుతాను విను. రెండవ తరగతిలోనో మూడవ తరగతిలోనో పలకమీద వరంగల్లు జిల్లా మ్యాపును రప్పగీసి బలవంతో వేశాను. ఎవ్వరైనా చిలక బొమ్మో వంకాయ బొమ్మో వేస్తారు కానీ ఈ వరంగల్లు మ్యాపునెందుకు వేసానో తెలియదు.

వరంగల్లు కోటలో ఒక అమ్మమ్మ ఉండేది. ప్రతి ఆదివారం ఆడుకోవడానికి వెళ్ళేవాణ్ణి. కోటలోని శిల్పాల్ని చూస్తూ ఉండేవాణ్ణి. బహుశా అది ఇన్స్పిరేషనేమో. కాగితాల మీద మామూలుగా, ఇష్టాయిష్టాలు ఏవి లేకుండానే వేసేవాణ్ణి. సీటీకి వచ్చిన తరువాతే ఎక్స్‌పోజర్‌నయ్యాను. హైదరాబాదు వచ్చిన తరువాత స్కూల్ లైబ్రరీ, కృష్ణదేవరాయంధ్ర భాషానిలయంలో వచ్చే ప్రభ, ప్రతిక మొదలగు పత్రికల్లోని బొమ్మల్ని బాగా గమనించేవాణ్ణి. సినిమా తాలూకు ''పోటింగ్స్'' నాపై ప్రభావం చూపాయి.

**బాల్యంలో మీ చుట్టూ ఉన్న సాహిత్య వాతావరణం ఏ విధంగా ఉండేది?**

మన హైదరాబాదులోని నారాయణగూడ దీపక్ మహల్ పక్కన ఉన్న వల్లా దుర్గయ్యగారి కాంపౌండ్‌లో ఉండేవాళ్ళం. ఆయన మా

మన హైదరాబాదులోని నారాయణగూడ దీపక్ మహల్ పక్కన ఉన్న వల్లా దుర్గయ్యగారి కాంపౌండ్‌లో ఉండేవాళ్ళం. ఆయన మా వోనర్. చాలా పోర్షన్స్ ఉండేవి. మా కుటుంబం ఒక పోర్షన్‌లో అద్దెకు ఉండేవాళ్ళం. ఫస్టుదాంట్లో దేశోద్ధారక గ్రంథమండలి, వట్టికోట ఆల్వారుస్వామి రెండవ పోర్షన్‌లో, ఒక మహారాష్ట్రియన్ ఫామిలి మూడవ పోర్షన్‌లో, నాల్గులో చక్రవర్తి రంగస్వామిగారు, బి.యన్. శాస్త్రి, దాశరథి కృష్ణమాచారి ఉండేవారు. నా చిన్నపుడు దాశరథి ''ఒరే రారా'' అని పిలిచి చదువు చెప్పేవాడు. అభినవ పోతన వానమామలై వరదాచారి, కాళోజివంటి మహామహులంత పల్లా దుర్గయ్యగారింటికి వచ్చిపోతూ ఉండేవారు. వీరందరినీ బాల్యంలోనే చూశాను. దాశరథి పిల్లలు నేనూ వారింటి పిల్లలుగా ఉండేవాళ్ళం. నిజానికి దాశరథి నన్నోమారు విమర్శించిన తీరే నన్నో కథకుణ్ణి చేసిందనుకుంట. నా యింటి చుట్టూ నా బాల్యంలో మహామహుల్ని చూసి, నేను కూడా రాయగలననే ధైర్యం వచ్చిందనుకుంట.

**కథా రచయితగా కథా రచనకు అనుగుణమైన వస్తు నిర్మాణాలను ఎలా సమకూర్చుకున్నారు? మీ మొత్తం కథలలో మీకు నచ్చిన మీ కథల్ని గూర్చి వివరించండి?**

నూటా యాభై దాక కథలు రాశాననుకుంట. నాకు నచ్చిన నా కథల్లో న్యాయం, మాయమనుసు, తలుపులు, శత్రువు, సూర్యుడు కూడా ఉదయిస్తాడు, అర్ధరాత్రి ఉదయించిన సూర్యుడు, బడ్జెట్ జీవితం, అందం, వెన్నెల ఆశ్చర్యం పోయింది..

కథలన్నిటా ప్రధాన కథా వస్తువు అన్యాయాన్ని ఎదిరించటం. ఆర్థిక పరమైన సమస్యలు, మానవ సంబంధాలను ఎలా కూలదోస్తున్నాయనీ, దోపిడి ఎన్ని రకాలుగా వికృత రూపాల్ని దరిస్తుందో ఎత్తి చూపడం,

అల్టిమేట్‌గా ఇవి ఇలా కొనసాగితే మనిషి ఏ ''స్టెప్'' తీసుకుంటాడు, ఎలా ఎదురు తిరుగుతాడు అనే అంశాలను నా కథల్లో యెత్తిచూపాను.

ప్రజాతంత్రలో ''దాహం'' అనే చిన్న కథే రాశాను. కేకలు ప్రారంభ సంచికలో ''కొత్తిల్లు'' అనే చిన్న కథ అచ్చయింది. ఎప్పుడైనా సినిమా తీస్తే ఈ కొత్తిల్లును సినిమాగా తీయాలని కూడా వుంది. నాకు ''తలుపులు'' అనే కథ మంచి పేరు తెచ్చి పెట్టింది. క్లాస్ లెస్ సొసైటీ కావాలని కాదు గాని, తలుపులు లేని సమాజం రావాలని రాశాను. ఇప్పుడు మీరంటున్నారే స్థలీకరణ లేకుండా రాయడం మంచిది కాదంటున్నారు కదా! ఈ కథ చదవండి.

తలుపుల్ని ఒక సరిహద్దు కింద పెట్టుకుంటున్నాం. నాదీనీదీ కాంది అని అన్నదానికి తలుపుల్ని తీసుకుంటున్నాం. తలుపులనేది ఒక మార్గం. అవి మూసి వేయటం వల్ల వ్యక్తికి వ్యక్తికి అవి ప్రతిబంధకం అవుతున్నాయి. వ్యక్తుల మధ్య ప్రతిబంధకంగా ఉండే తలుపులను లేకుండా ఉండాలనేదే నేనా కథలో ప్రతిపాదించాను.

''శత్రువు'' కథకు మా అక్క పెళ్ళే కారణం. పెళ్ళయిన మరుక్షణం నుంచి మా అక్క ప్రవర్తన, మా నాన్న మనస్తాపం చూసి బాధపడ్డాను. కథకు సంఘటనను మార్చాను. ఒక వ్యవసాయధారుని కుటుంబానికి కథావస్తును మార్చాను. రైతు ముగ్గురు కుమార్తెల పెళ్ళిళ్ళ ద్వారా పొలాన్ని పోగొట్టుకున్న తీరునూ, చివరి కూతురికి ఇచ్చిన రెండెకరాల పొలం సాగుచేసి, తన జీవనానికి కావలసిన ధాన్యాన్ని ఉంచుకుని, మిగతా ధాన్యాన్ని అల్లుడికిస్తానన్నా- కూతురు పెళ్ళికాక పూర్వం తండ్రి కష్టాల్ని పట్టించుకున్నదే పెళ్ళయిన తరువాత తండ్రితో ప్రవర్తించిన తీరును ఎత్తి చూపాను. స్వార్థం మనకున్నట్లు గానే మన సంస్కృతిలో కూడా ఎంత దారుణంగా ఉందో ఎత్తి చూపాను.

నా ''బడ్జెట్ జీవితం'' కథ వచ్చినపుడు నన్ను బడ్జెట్ జీవితం చంద్రగారని అనేవారు. ఇది డెభైలో రాశాను. ఎవ్రిథింగ్ ఈజ్ కంట్రోల్ బై ఎకనామిక్స్ అనేది ఈ కథలోని ప్రధాన వస్తువు.

''దాహం'' ఒక మంచి కథ అన్నాను కదా! డెభై ఆరులో రాశాను. ప్రజల తాగే నీరు ఎల కమర్షిలైజ్ అయిపోతుందో చూపాను. ఇక కొన్ని ఎక్స్‌ప్రెస్ చేయని బైండింగ్స్ ఉంటాయి. అవే నా కథా వస్తువులు చెరబండ రాజు ఎన్ని హింసలు పడ్డాడు. కొన్నిటికి బైండింగ్ అయ్యేకదా! ఆయనే కాదు వరవరరావు ఎన్ని కష్టాలు పడుతున్నారు. కొన్ని బైండింగ్స్ ఉండబట్టేకదా! అందువల్ల మనిషి కొన్ని బైండింగ్స్‌కు కట్టుబడే కృషి చేస్తాడు. నేనూ కొన్ని బైండింగ్స్‌కు కట్టుబడే కథలు రాశాను.

**కథ రాయడానికి పూనుకునేప్పుడు, దాని నిర్మాణ వైవిధ్యాన్ని గూర్చి ఏమైనా ఆలోచించి, అనుకుని శైలికోసం ప్రత్యేకంగా కృషి చేశారా?**

నేనెప్పుడు ఒక చిన్న పాయింట్ మీద రాస్తాను. ''థీమ్''ను ముందే ప్లాన్ చేసుకోను. కథ రాసేప్పుడు అస్సలు ప్లానింగ్ ఉండదు. ప్లాన్ ఉండదని కాదు కానీ ప్లాన్ తయారు చేసుకొని మాత్రం రాయను. ఆలోచించి రాయడం లాంటిది ఉండదు. పాత్రలను అనుకుని, సంఘటనలను ఆలోచించి రాయలేను. అప్పటికప్పుడు ఏది రాయాలనిపిస్తే అదే రాస్తాను. ఏది రాయదగిందో అదే రాస్తాను. ''బడ్జెట్ జీవితం'' లెక్కలతో రాయాలనిపించింది రాశాను. నిర్మాణమని అన్నారు కదా! నిర్మాణం గురించి నేనెప్పుడు ఆలోచించలేదు. దానికోసం శ్రమించలేదు. నూటాయాభై కథల్లో ఏకథ రాసేప్పుడైనా నిర్మాణం కోసం శ్రమించినా రాయనే లేదు. రాసేప్పుడు అది వచ్చినట్లుగా రాసేసేవాణ్ణి. కథల్లో నెనెప్పుడూ కథకు లైఫ్ ముఖ్యమని నమ్ముతూ వచ్చాను. థీమ్‌కు రంగులద్దటం నేనెప్పుడూ చేయలేదు. బొమ్మలకు వేసే ఎర్రరంగు నా చేతుల్లో ఎంతవున్నా కథకు ఎర్రరంగు వేయాలని ఎప్పుడూ అనిపించలేదు. తెలుగు, ఇంగ్లీషు కథలు చదివాను. నేను రాసేప్పుడు నా కథలకు మసిపూసి మారేడు కాయ చేసే మనస్తత్వం గల కథలు నాలోంచి రాలేదు. ఎవరిదో చదివి ప్రేరణతో రాసింది ఒక్కటీ లేదు. అంతా సెల్ఫ్ మేడే.

**ఎన్నో మంచి కథలు రాసిన మీరు ఇప్పుడెందుకు మానేశారు?**

మానేయలేదు. రాయబుద్ధికాక, చెత్త కథలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. వీరేంద్రనాథ్ రాస్తున్నపుడు వాడి మీద ధ్వజమెత్తారు. తిడుతూ రాశారు. తిడుతూ కూర్చోవడం కన్నా మంచి కథలు రాయవచ్చుకదా! ఎందుకో ఒక స్తబ్ధత వచ్చింది. చెత్త కథలపై ధ్వజమెత్తడం నావల్ల కాదు. నేనింకా మంచి కథలు రాస్తానేమో.

**వీరభద్రరావు, యెర్రంశెట్టిశాయి, మీరు కలిసి "ఎంతెంత దూరం" అని ఓ గొలుసు నవల రాశారు కదా! మీరా నవలలో ప్రవేశపెట్టిన అంశాలేవి?**

''ఎంతెంతదూరం'' నవల ప్రారంభించింది పమ్మి. ఆయన రాసేంతరాసి శాయి చేతిలో పెట్టాడు. ఆయనా రాసేంత రాసి చివరి భాగం నా చేతిలో పెట్టాడు. ఇప్పుడు మీకు మామూలు జ్వరంలో ఉండి ఇంటర్వ్యూ ఇస్తున్నాను కానీ అప్పుడా నవల రాస్తున్నప్పుడు నాకు మలేరియా జ్వరంతో ఉన్నాను. ఆ జ్వరంలో కూర్చునే రాశాను. చదువుకున్న స్త్రీ తాను దోషిని కాననీ, పచ్చినిజాలతో ఆమె జీవితాన్ని విప్పిచూపడమే నేను చేసిన పని. పమ్మి, శాయి నవలలోని స్త్రీని దోషిగా నిలబెడితే, నేను ఆమె జీవనానుభవాన్ని విశ్లేషిస్తూ, ఆమె దోషి కాదనే వెర్షన్‌లోంచి నేను రాశాను. నేనే ఆ పాత్రనయి రాశాను. ఉక్రోషం వల్ల రాశాను. ఈ నవలను ఆదిమధ్యం రమణమ్మ ఓ మారు వచ్చి గొలుసు నవలలో నీవు నడిపిన తీరు బాగుందని మెచ్చుకుంది.

**బొమ్మలు బాగా వేయాలనే పట్టుదల ఎప్పటి నుండి మొదలయింది? ఆర్టిస్టుగా ఎలా నిలదొక్కుకోవటానికి శ్రమించారు?**

1960లో మొదటి సెవన్ స్టార్ సిండికేట్ సంస్థవారు రెడ్డి ఉమెన్స్ కాలేజీలో బాపుగారి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పుడు పత్రికల్లో బాపుగారి బొమ్మల్ని, ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఒర్జినల్స్‌గా చూపిన తరువాతనే లైఫ్‌లో ఆర్టిస్టు కావాలనే నిర్ణయించుకున్నాను. అదే ఎగ్జిబిషన్‌లో చదువులావు సత్యమూర్తిగారి పాపులారిటీ, ప్రేక్షకుల్లో ఆయన కున్న క్రేజ్‌ను ప్రత్యక్షంగా చూసి, ఇంకోసారి ఏమైనా సరే ఆర్టిస్టుగా స్థిరపడాలనే నిర్ణయానికి వచ్చాను. ఎందుకంటే ఆర్టిస్టుగా అవటం వేరు సెలబ్రేటి ఆర్టిస్టు అవ్వటం వేరు. మంచి ఆర్టిస్టు కావాలనే కృషికి పూనుకున్నాను. మొదటిసారి బాపుగారిని ఈ ఎగ్జిబిషన్‌లోనే చూశాను. ఆయన దగ్గరకు వెళ్ళి, పరిచయం చేసుకుని, బొమ్మలేయటం నేర్పించమని అడిగాను. ఆయన ముందు సంకోచించి, నేను మద్రాసులో ఉంటాను మీరు హైదరాబాదులో ఉంటారు కదా, నేర్పించడం అనేది ఇబ్బంది గనుక ఓ పని చేయండి. నా బొమ్మల్ని చూసి ప్రాక్టీస్ చేయండని సలహా ఇచ్చారు. కొంత కాలమైనాక నాకు చూపిద్దురుగానీ, వాటిని చూసి మెలుకువలను చెబుతాను, వాటి బాగోగులు కూడా చెబుతాను అని అన్నారు. అంతే ఆ తరువాత రెండేళ్ళు రాత్రింబగళ్ళు ఆయన బొమ్మల్ని ప్రాక్టీస్ చేశాను. అదే ఆ బొమ్మల్ని కాపీ చేస్తుంటే రోజురోజుకీ ఏదో రహస్యం తెలిసినట్టుగా నాకే తెలిసేది. మళ్ళీ ఎప్పుడు ఈ ప్రాక్టీసు చేసిన బొమ్మల్నే ఆయనకు చూపించాలని అనిపించలేదు.

బొమ్మలు వేయడం వచ్చేసిందనే అనుకున్నాను. ఈ ప్రాక్టీస్ చేసినబొమ్మల్నే తీసికెళ్ళి యువ చక్రపాణి గారికి చూపించాను. చక్రపాణి గారు కూడా నేను బొమ్మలు వేయగలననే వారి ''యువ''లో కథలకు బొమ్మలు వేసే అవకాశం కల్పించారు. 1961లో అలా ప్రారంభమైన బొమ్మ లేసే చంద్ర ఇప్పటికీ బొమ్మలు వేస్తూనే ఉన్నాడు. అయితే బాపుగారు చెప్పి ఉండాల్సిన మంచి చెడులు, బాగోగులు నా బొమ్మల్లో ఉన్నయో లేవో నాకు తెలియదు. నా బొమ్మల్లో ఏ బాగోగులు ఉన్నా లేకపోయినా అ నా తప్పే అవుద్ది. అయితే ఇన్నేళ్ళ జీవితంలో మంచి బొమ్మల నుంచి నేర్చుకున్నవి, ఇంకా నేర్చుకోవలసినవి చాలానే ఉన్నాయి. అయితే ఇక్కడొక విషయం నిజాయితీగా చెప్పుకోవలసి ఉంటుంది. నేనెప్పుడు అద్భుతంగా బొమ్మలు వేశాననుకోలేదు. అనుకోను కూడా. ఇంకా నేర్చుకునే విద్యార్థి దశలోనే ఉన్నాను. ఈ నేర్చుకునే దశ అన్నదే నన్ను ఇంతకాలం చిత్రకారుడిగా నిలబెట్టింది. పర్ఫెక్షన్‌కు రీచ్ అవ్వలేదని అనుకుంట. ఇప్పడికీ కష్టపడత. ఒకటి మాత్రం చెప్పగలను. రేఖా చిత్రాలు ఎంత సులువుగా వేయగలనో వర్ణచిత్రాలని కూడా అంతే సులువుగా వేసి మెప్పించగలను.

**ఈ వేల వేల బొమ్మలు వేసిన మీ కుంచెకున్న అనుభవాన్నీ మీకు నచ్చిన ఒకటి రెండు బొమ్మలు వేసిన సందర్భాలనీ తెలుకోవాలని ఉంది? వాటి వలన పొందిన మీ ఆనందాన్ని కూడా చెప్పండి?**

బొమ్మ ప్రేక్షకుడి అనుభవంలో లేకపోతే ఆ బొమ్మను ఆస్వాదించలేడు. దాని బాగోగులు చెప్పలేడు. ప్రేక్షకుడి అనుభవంలో లేనిది నేను ఏది చూయించలేదు. బొమ్మ తాలూకు రూపురేఖలు నిజానికి దగ్గరగా ఉండక పోవచ్చు. అనుభూతికి దగ్గరగా ఉంటే ప్రేక్షకుడు ఆస్వాదిస్తాడు. ప్రతి బొమ్మను కొత్త కోణం నుంచి కొత్త విధంగా చూపించ గలిగితే అది ఆ చిత్రకారుడి కొంత నైపుణ్యమే. అది ఒక అటెంట్.

నేను జైల్లో ఉన్నపుడు ఎమర్జెన్సీలో మామూలుగా సెల్లో ఉండి ఇందిరాగాంధి మీద కసికొద్దీ కొన్ని ప్రత్యేకమైన బొమ్మలు వేసుకున్నాను. దాంట్లో ఓ బొమ్మ గుడ్డను వడిబెట్టినట్టు మనిషి ఆకారాన్ని వేశాను. నా ఇన్నేళ బొమ్మల అనుభవంలో చూడ్డానికది సింపులుగానే అని పించినా అది ఒక అచ్యువ్‌మెంట్. ఆ అచ్యువ్‌మెంట్ ఇచ్చే కిక్కు నన్ను నేను సెభాష్ అనుకునే తృప్తి నిచ్చింది. ఈ చిన్న చిన్న తృప్తులే నన్ను మళ్ళీ మళ్ళీ బొమ్మలు వేయటానికికున్న క్రియేటివిటి పెంచడానికి ఊతంగా నిలుస్తాయి. ఆంధ్రజ్యోతి కొత్త కెరటాలు శీర్షికతో పురాణం అర్వై వారాలు రాశారు. అందులో ఒక వారం ఒక ఏకలవ్యుడు అని నన్ను గురించి రాశారు. అది ఒక అచ్యువ్‌మెంట్ కింద గర్విస్తాను.

**ఏ విధమైన బొమ్మలు వేయడానికి ఇష్టపడతారు. తపన పడతారు. వైవిధ్యాన్ని ఎలా సమకూర్చుకుంటారు?**

నా కాలంలో నా అనుభవంలో చూస్తున్న, వస్తున్న బొమ్మల కన్నా భిన్నంగా కొత్తగా కనీసం అవకాశం కలిగినప్పుడన్నా వేయాలని ఉంటుంది. అందువల్లనే నా కథా చిత్రాలలో కొన్ని రేఖా మాత్రంగా, కొన్ని భావ ప్రధానంగా, కొన్ని వస్తువు ప్రధానంగా, కొన్ని శైలి ప్రధానంగా కనిపిస్తాయి. వీటిని మరింతగా మరింతగా ఒప్పుకునే లాగా తపన పడతాను. ఇంప్రెస్ చేయడం కన్నా యాక్సెప్ట్ చేయడం మీదే శ్రద్ధ వహిస్తాను. ఏ బొమ్మను ఎన్ని విధాలుగా వేసినా ఆ బొమ్మల్లో వస్తు ప్రకటనే కాకుండా భావ ప్రకటన ఉంటే తప్ప అది ఎక్కువ కాలం నిలబడదు. అంటే చిత్రకారుడు తన బొమ్మలో యే భావాల్ని చెప్పదలిచాడో అది చూసేవాడికి అంది తీరాలి. అట్లా జరగక పోతే ఆ బొమ్మ కేవలం బొమ్మగానే ఉంటుంది. దీన్నే సరదాగా చెప్పాలంటే మాట్లాడే బొమ్మ, మాట్లాడని బొమ్మ. ఈ విషయంలో మన రాష్ట్రంలో మాట్లాడే బొమ్మల్ని వేయగలిగింది ఒక్క బాపు గారేనని నేను నమ్ముతాను. తరువాత తరం వాళ్ళు చంద్ర కూడా బొమ్మలతో మాట్లాడిస్తాడని అంటారు.

(మిగతా 4వ పేజీలో...)

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 197వ రోజు 'కవితిలక డా.తిరునగరి రామానుజయ్య' గారి స్మృతికి నివాళిగా పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. 'కవితిలక డా.తిరునగరి రామానుజయ్య' గారి స్మృతికి నివాళిగా వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &
దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,** 9441046839



## తిరునగరాయణం

అర్ధ శతాబ్ది సుదీర్ఘ
సాహిత్య ప్రయాణం
దివికేగిన ఆ సమయం
మనసంతా నిండిన ఆవేదన
ముగిసిన సాహితీ ప్రస్థానం!!.
చెరగని చిరునవ్వు
మృదువైన పలకరింత
మధురమైన భాషణం
సహనం ఆయనకు భూషణం!!.
వ్యాసం గేయం కవిత పద్యం
ప్రక్రియ ఏదైతేనేం
అన్నీ ఆయన చేతిలో
పురుడుపోసుకుని ఎదిగిన బిడ్డలే!!.
సాహిత్య యానంలో
ఎన్నో మైలురాళ్లు ఎన్నో సన్మానాలు
దాశరథి పురస్కారంతో
రాష్ట్ర ప్రభుత్వం అందించిన
ఎనలేని గౌరవం!!.
మానవత్వాన్ని పరిమళింపచేసి
రైతన్నకు పెద్దపీటవేసి
సామాన్యుని గొంతుకగా మారిన
తిరునగరి మాటకు తిరుగులేదు!!
కాలం చేసే కల్లెర్ర
కలం కార్చే కన్నీళ్లు
అందరినీ విడిచివెళ్లిన
సాహిత్యాభిమాని!!
మనసు మనసు కలిస్తే స్నేహం
మనిషి మనిషి కలిస్తే దేశం
ఎన్నో విషయాలను
అర్థమయ్యే తీరులో చెప్పడం
తిరునగరి బాట!!
జానకమ్మ కడుపు పంట
మనోహరుని కలల పంట
ఆలేరులో జీవనమంత
నరసింహుని చేరె రామానుజనుడంత
అభిమానులకు ఆగని కన్నీరంత!!



**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి,** 9490367383

## దాశరథీప్రియ ధర్మమూర్తి

సీ. తిరునామమొక్కటి తేరుపైవెడలెను
సప్తగిరులుదాటిస్వర్గసీమ
తిరునగరీయమై దేదీప్యమానమై
జీవధారగ సాగు భావకరము
పద్యధార,విమర్శ పాండితీ ప్రభలను
వెదజల్లవిష్ణువుపదములందు
పద్య సౌరభముల పంచు రామానుజ
దాశరథీప్రియ ధర్మమూర్తి.
తే. గీ. అక్షరవాదము,క్రొవ్వొత్తి,రక్షవచన
ముక్తకాలు,ప్రవాహిని,ముదపు కవిత
మనిషికోసము,యీభూమి,తనివితీర
తిరునగరి వ్రాసె సంపుట పరిమళాలు!!
ఆ.వె. కవి తిరునగరి తన భవము బాసి దివికి
తరలె నాత్మ శాంతి వరల వలెను
అశ్రుకణములందునంజలిగావింతు
మది విలాపమైన తుదికి ప్రణుతి!!



**-మాడుగుల నారాయణమూర్తి,** 9441139106

## ఆగిన గంగా ప్రవాహం

ప్రవహించే గంగ ఆగింది
సాహితీలోకం మూగబోయింది!
మానవత ఆధునికత
సాంప్రదాయానికి ఆదర్శం
ఆలేరులోజన్మించి
సెలయేరులా ప్రవహించి
శతకంతో రచనకి శ్రీకారం
సాదాసీదా జీవితం!
దాశరథితో పరిచయం
ఆయనపురస్కారం
మట్టిపైమమకారం..
మానవతకి సాకారం
సాహితీ గిరులెన్నో
అవలీలగా అధిరోహించి
తిరునగరిగా ఖ్యాతి గాంచి
సెలవు తీసుకుని
తరలిపోయిన
సాహితీ గిరిశిఖరం

**-ఎ.రాజ్యశ్రీ,** 8985035283

## అశ్రు నివాళి

రాసిన అక్షరాలు
సంప్రోక్షణ భావాలు
సంపుటీకరణతో
సాహితీ ప్రియుల
హృదయాలలో
ముద్రింపబడి
దారి చూపబడి
తిరునగరి వారిని
వేల గొంతుకలు కీర్తిస్తూనే ఉన్నవి
రచనా చైతన్యాన్ని పురికొల్పుతూనే ఉన్నవి
యాదాద్రి నరసింహుని
దివ్య ఆశీస్సులతో
క్షేత్ర పరిధిలో జనియించి
తెలంగాణ సాహితీ
సేవలో తరించి
భారత్ భాషా భూషణ్,
కవితిలక, ఉత్తమ ఉపాధ్యాయ
జీవిత సాఫల్య పురస్కారాలెన్నో
రసజ్ఞుల సత్కారాలెన్నో
మహా మహోన్నతుల
హృదయాలను దోచుకున్న
పద్య, వచన కవితా తీపి రసాలెన్నో
మా నీలగిరి శ్రీ రామానుజం
ఆచార్య తిరువడిఘల్లు చేరడం
కవనానికి శోకమే
సాహితీ ప్రపంచానికి విషాదమే
మీ సాహిత్య సేవ ఆచంద్రతారార్కం..
తెలుగు కీర్తి శిఖరాలలో
ప్రకాశిస్తునే ఉంటుంది



**-జె.నరసింహ రావు,** 9490128690

## జ్ఞాన నిధి

తిరిగి రా..తిరిగి రా...
ఓ తిరునగరి రామయ్యా..
తిరిగిరాని లోకాలకు పయన మైనావు
సాహిత్య లోకాన్ని ఒంటరి గా
వదిలేసి వెళ్ళడం నీకు న్యాయమా
యాదాద్రి జిల్లాలో సాహిత్య మకుటమై
మనోహర్ జానకి పుణ్య దంపతుల
పుత్రుడిగ జన్మించి...
ముప్పది ఐదేళ్లు నిర్విరామంగా
ఉపాధ్యాయ వృత్తిలో కృషి చేసి
విద్యార్థి లోకానికి
జ్ఞానమందించిన జ్ఞాన నిధి
బలవీర శతకంతో
సాహిత్య ప్రస్థానం మొదలెట్టి
పద్యాలు, గేయాలు శతకాలు, వచనాలు
ఏ ప్రక్రియలోనైనా నీదైన శైలిలో
కలము ఝుడిపించిన కవి యోగివర్యా!
స్వయానా దాశరథే భుజము తట్టిన
కవి చక్ర వర్తీ..
సినారె ప్రశంసల జల్లుతో
మురిసిన నవచైతన్య సాహిత్య శిఖామణి
దివాకర్లగారు అభివర్ణించిన
అభినవ పోతన..
మూడువందల కు పైగా సాహిత్య సభలనే
అలరించిన ఓ సాహితీ ప్రియతమా...
మట్టి లోకానికి, మనిషి తత్వానికి
పట్టాభిషేకం కట్టిన సాహిత్య సాగర..
ఆలోచన వంటి విమర్శనా వ్యాసాలను
విసిరిన గొప్ప విమర్శనకారుడా..
అవార్డులనెన్నింటినో
రివార్డుల లెన్నింటినోమీ ఖాతాలో వేసుకున్న
విశ్వ సాహితీవేత్త...
ఎన్నెన్నో పదవులతో
సాహిత్యమాతకు కవితా పుష్పాలతో
సేవచేసిన సాహిత్య శీలి...
దాశరథి సాహిత్య పురస్కారానికి
తగిన వాడివని
తెలంగాణ ముఖ్యమంత్రే తెలిపిన
సాహిత్య లోకాన్ని ఏలిన నిగర్వి...
తిరిగి రా తిరిగి రా
ఓ తిరునగరి రామయ్య..



**- బండారు పుష్పలత,** 8639128535

## 'తిరు'నగరి

ఆజానుబాహుడైన శరీరం
కంచుకంఠ గాంభీర్యం
వాత్సల్యపూరిత పలకరింపు
విషయ పరిజ్ఞానపు పరిమళం
వినమ్ర సహిత నడవడికతో
నిలిచిన సాహితీ శిఖరం
అక్షరాలను ప్రేమించి,
పఠనం,లేఖనాలను
రెండు లోచనాలుగా చేసుకొని,
నిరంతర కవితా సృష్టి కర్తృత్వాన్ని వహించి,
సభలకు జీవం పోసిన తపస్వి
చిన్నా,పెద్దా తేడా చూపక
తన సృజనే చిరునామా చేసి
చిర యశస్సు పొందిన మహాకవి
తానొక నడిచే విజ్ఞానసర్వస్వమై
శ్రీమంతమైన కావ్యాలు వెలయించి
మూడుతరాలను చూసిన
సజీవ సాక్ష్యానందమై
సజ్జన చావిడే తానై
తెలుగుసాహిత్యానికి సేవ చేసి
సరస్వతికి తిరు నగరం ఏర్పరిచిన సవ్యసాచి
ఋషి, స్థితప్రజ్ఞుడు.
కాయం మాయమైనా,
కావ్యంతో చిరంజీవి అయ్యాడు.



**-డా.రామక కృష్ణమూర్తి,** 9948285353

## శ్రద్ధాంజలి

అనంతలోకాలకు
తిరునగరి
అక్షరనీరాజనాలు
ఆలేరులో అవతరించి
అవనిలో అమృతాక్షరాలు
పద్య,గద్య,కవిత పంటలు
నాటిన నీ కీర్తి అజరామరం
శ్రీ రామానుజచార్యగురు
నామధేయడవై సాహితీ
సుగంధాలు వెదజల్లిన సంస్కర్త
తెలంగాణ ఆణిముత్యం
సాహితీ జగత్తులో చైతన్య రథం
మహామహుల కవుల రసజ్ఞుల
మనసుల రంజింపజేసిన
కవిశిఖామణి.



**-జి. కొండల్ రావు,** 97059 65172

## కూలిన వటవృక్షం

తల్లి రామక్క గారన్న మమకారం
తండ్రి మనోహరం గారి సహకారం
భార్య భారతి గారి కల సాకారం
ఏకసంథాగ్రహి
ఆలేరంటే అమిత ఇష్టం
బోధనతో కీర్తి
కవితలతో సుకీర్తి
నూనూగు మీసాల నూత్న యవ్వనాన
రాసిన బాల వీర శతకంతో
దాశరథి గారి కవితావారధియై
భవిష్యత్తు సూచించబడ్డవాడై
'తిరు' అంటే సంప్రదాయమైనా
కులమతాలకు
అతీతమైన కవి కులంతో
జాషువా గారింట ఆతిథ్యం పొంది
'నగరి 'నాగరికతతో
వాదప్రతివాదాలు లేక సౌమ్యు లై
తిరునగరి కవితలు
"తేజస్వంతములు, ఓజస్వంతములు'
అని దాశరథి గారిచే
సినారె, దివాకర్ల ,జాషువా,తుమ్మల
మొదలైన కవితా దిగ్గజాల అలరించిన
వివిధ ప్రక్రియలు
నాలుగు భాషలలో ప్రావీణ్యత
వేలాది పుస్తకాలకు
ముందుమాటలూ సమీక్షలూ
ముప్పది పుస్తకాల పైన ప్రచురణలు
తిరునగరీయం నాలుగు భాగాలు
యోజన, శ్రీ చాదాత్తవైష్ణవ పత్రికలో
కాలం పేజీలు
తన రచనలపై వచ్చిన
నాలుగు పీహెచ్డీ లు
ఆదికవి నన్నయ నుండి
ఆధునిక కవుల వరకు
ఆపోసన పట్టిన కవితా వారధి
నిష్కామ కర్మ యోగి , మృదుస్వభావి
సన్మానాలు ఆశించక
రాష్ట్ర 'కవి (తా)తిలక'మై,
తెలుగు "భారత్ భాషా భూషణ" మై,
రెండు ప్రభుత్వాల అవార్డు గ్రహీతలై
కవితాక్షర బ్రహ్మయై
మనిషి లేరు
మాట ఉంది
ఆ కవితా గంగలో
ప్రతి కవి జీవన పునీతులవ్వాలి
కవితా వటవృక్షం ఒరిగిపోయినా
తిరిగి చిగురించి భావి కవులకు
ఆశ్రయం ఇవ్వాలి.



**- మన్నె పిన్నక లలిత,** 741 686 32 89

## కవితా మార్గ దర్శకుడు

తిరునగరి
అందరి మనసెరిగి
అక్కున చేర్చుకున్న
హిమనగరి
పద్యం, వచనం, గేయం
ఔపోసన పట్టిన
నేటి తరం అగస్త్యుడు.
బాలవీరశతకంతో
సాహితీ ప్రస్థానం
ఉపాధ్యాయుడిగా
మానవతా వాదిగా
ఎందరి జీవితాలలోనో
కొవ్వొత్తి వెలిగించి
అక్షర ధారలు పూయించి
వసంతం కోసం శ్రమించి
నీరాజనాలు అందుకున్న
కవితా మార్గదర్శకుడు
తిరునగరీయం
లోకాభిరామాయణం
విమర్శనా వ్యాసాలు
సాహిత్య సమీక్షలు
అనర్గళ ఉపన్యాసాలు
అసమానలతపై ఎక్కుపెట్టిన
ధనుర్బాణాలు
తెలుగు , సంస్కృతం,
ఆంగ్ల భాషల సాధికారత
ఇచ్చింది జీవితాంతం
సాహిత్య సృజన చేసిన
ఘనత
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ
దాశరథి పురస్కారం
చంద్రునికో నూలుపోగు



**-కపిలవాయి అశోక్ బాబు,** 87907 27772

## కవి శ్రేష్ఠ

'తిరు'లో సాంప్రదాయం
'నగరి'లో నాగరికతను
పుణికిపుచ్చుకు పుట్టిన
తిరునగరి రామానుజయ్యా
మీ కివే నా అశ్రు నివాళులు !.
సాహిత్య మెళకువలనెరిగి
ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాలను
ఆసాంతం ఆపోసన పట్టిన
తిరునగరి రామానుజయ్యా
మీ కివే నా అశ్రు నివాళులు !.
"బాల వీర "పద్య శతకంతో
సాహితీ వనంలో తొలి అడుగేసి
పద్య గద్య రచనలపై
పట్టు సాధించిన
తిరునగరి రామానుజయ్యా
మీ కివే నా అశ్రు నివాళులు !.
నాటి సాహితీ ఉద్దండ పండితులు
దివాకర్ల, దాశరథి, సి. నా. రె ల
ప్రశంసలను అందుకున్న కవి శ్రేష్ఠ
తిరునగరి రామానుజయ్యా
మీ కివే నా అశ్రు నివాళులు !.
ఉపాధ్యాయ వృత్తిలో
ఉత్తముడిగా నిలిచి
పురస్కారాల జల్లులో
నిండుగా తడిసి
తుది శ్వాస వరకు కలం వీడని
తిరునగరి రామానుజయ్యా
మీ కీవే నా అశ్రు నివాళులు !



**-రామకృష్ణ చంద్రమౌళి,** 9666656687.

## కూలిన సాహితీ శిఖరం

తెలుగు వెలుగు తిరునగరి
సాహిత్యంబనెడి గిరి
తెలంగాణ రాష్ట్రంలో
గొప్పవక్త తానె మరి!.
జాతీయ వాది భువి
కవనకాంతిలో రవి
తిరునగరి రామానుజం
మనసున్న మంచికవి!!.
మణిపూసల ప్రక్రియకు
తిరుగులేదు సుక్రియకు
అని చాటిన తిరునగరిల
సాహితి శిఖరము మనకు!.
అనుభవాల కూడ గట్టి
తరచు నాకు చెప్పినట్టి
గురుసమాన తిరునగరికి
అంజలింతు మనసువెట్టి!



**-వడిచర్ల సత్యం,** 9441350137

## పర్యవసానం

రోజంతా కాయకష్టం
సాయంత్రం కల్లు పాకలోనో
సారాయి దుకాణంలోనో
ఒళ్లు తెలీకుండా తాగి
ఉన్న డబ్బులు
కాస్త ఊడగొట్టు కోవడం.

తూలుతూ ఇల్లు చేరడం
భార్య ను పిల్లలను చితకబాదడం
గుర్రుపెట్టి నిద్ర పోవడం
మళ్లీ తెల్లారగానే షరా మామూలే.

మార్పులేని దినచర్య
మార్పు లేని జీవితం
ఇల్లు ఒళ్లు గుల్ల చేసుకోవడం
ఎవరు ఎంత నచ్చచెప్పిన
పెడచెవిన పెట్టడం.

వ్యసనం మానుకోమని
కుటుంబం కూలగొట్టుకోవద్దని
ఎన్నిసార్లు హితవు చెప్పిన
వినకపోగ కలహాలు పెట్టుకున్న
సందర్భాలు
చుట్టుపక్కల వారిని
నిందించిన సందర్భాలు
బంధుత్వాలు మంటగలిసిన
తెలుసుకోని మూర్ఖత్వం.

ముత్తు లో మునిగితేలుతూ
ఇల్లు చేరి భార్య మాటలు
రుచించిక ఇంటిపైకప్పు తీసి
పెట్రోలు వెదజల్లి
నిప్పుపెట్టిన క్రూరత్వం
భార్య పిల్లలు బంధువులు
మొత్తం అరడజను మంది
ఊసురు తీసిన సంఘటన
మానవత్వానికే మచ్చ
తెచ్చిన సంఘటన
ప్రభుత్వానికి ఆదాయవనరు
పేదవాడి జీవితం తో చెలగాటం
ఆరోజు దూబగుంట మహిళల
పోరాటం ఈరోజు మళ్లీ అవసరం
లాక్ డౌన్ లో కూడా ఏరులై పారిన మద్యం
మద్యం దొరకనివాళ్లు శానిటైజర్ తాగి
ప్రాణం పోగొట్టుకున్న
అభాగ్యులకు దిక్కెవరు
బెల్టు షాపులు మూస్తామంటూనే
ఎక్సైజ్ సుంకం రాబట్టుకునే
ప్రభుత్వాలు
ఎలామారతాయి మత్తులో
చిత్తైన పేదల జీవితాలు?



**-అరుణ దేనియల్** 9000606889

## ఆదర్శంగా బతకాలి!!

జీవిత ప్రయాణం ఆగిపోయింది
మృత్యువు
వెంట తీసుకెళ్లడానికే నిర్ణయించుకుంది.

ఇలానే పోతాం మనం కూడా
మనకే తెలియకుండా రేపటిని వదిలేసి
ఎవరూ మనవెంట రారు
ఏది రాదు
ఒక్కళ్ళమే వెళ్ళాలి
నువ్వేదో ఇక్కడే
ఉండి పోయేందుకు వచ్చినట్టు
స్వార్థంగ బతుకుతున్నావ్!
తెలుసుకో
నీకంటూ ఒక మృత్యువు ఉందని
నీకే తెలియకుండా అది సమీపిస్తుందని
ఆధ్యాత్మిక చైతన్యుడువై మేలుకో
నిన్ను నీవు ఏలుకో
నలుగురిలో గొప్పోడిలా బతుకు
ఇదే జీవితం అంటే
ఇలాగే గొప్పగా బతకాలి
ఆదర్శంగా విలువలతో....!!



**-కల్లెం నవీన్ రెడ్డి** 9963691692

## ఆమె

ఆధారాపు దారం తెగి
గాలిపటం రెపరెపలాడుతోంది
నూరేళ్ళ నమ్మకం వమ్ముచేసి గగనానికి ఎగసింది
కంటిరెప్ప కనుపాపను కాటేసి వెళ్ళిపోయింది
రేపటి శూన్యం కంటిముందు ఆవిష్కృతమయింది
కారుమబ్బులు తప్ప చినుకు జాడ లేదు
పిందెలలో పసరుతనాన్ని వీడని అమాయకత్వం
కాలం చేసిన గాయం తెలియని పసితనం
తల్లి కొమ్మ గుండెను ఆధారం కోసం హత్తుకున్నాయి
బాధ్యతల వలయం బరువును మనసులో నొక్కుకుని
ముల్లును దాచుకున్న గులాబీలా నవ్వింది ఆమె
చిరురెమ్మల భుజాల మీద చేతులు వేసింది
మీకు నేనున్నానన్న భరోసాను ఇచ్చింది
లోకపు పరిహాసింపులకు ఎదురొడ్డి నిలిచింది
సుడులను ఎదలో దాచి చిరునవ్వుల పంచింది
రెక్కలొచ్చిన పక్షులు దిక్కులు పట్టి ఎగిరిపోతే
జంట పక్షి వదిలిన కర్తవ్యాన్ని పూర్తి చేశానని
తృప్తితో నవ్వుకుందే గాని కుమిలిపోలేదు
పుడమి చేరిన నాటి నుంచి పృథివి వీడే వరకు
బంధాల చట్రంలో నవ్వుతూ
పరుగులు పెడుతూనే ఉంది
ఊపిరి గగనాన్ని తాకే వరకు
పోరాడుతూనే ఉంది ఆమె.



**-శింగరాజు శ్రీనివాసరావు** 9052048706

## చరమ గీతం.

ఆశల విత్తును నాటే అనుబంధాలు,
అనురాగపు పూలు పూయించే
రక్త సంబంధాలు, బాంధవ్యాలతో
తెగతెంపులు చేస్తూ
అసహనపు చెట్టుపై
మానవీయ విలువలు
వేలాడబడుతున్నాయి.
యద లోతుల్లో
అప్యాయతను చిమ్మే ఆత్మీయ స్పర్శ
నేడుప్రమాద ఘంటికను మోగిస్తున్నది.
ఆహ్వానపు లేఖల్లో
యమకింకరుల
సంతకాలు ప్రత్యక్షమౌతూ,
ఆతిథ్యం ఇచ్చి పుచ్చుకున్న వారివురూ
వీలునామాకు సిద్ధమవ్వాల్సిన స్థితి.
ఇప్పుడు పేదోడు,
గొప్పోడు అన్న బేధం లేదు,
అక్షరాస్యులు నిరక్షరాస్యులు అన్న
అమరికలు ఉండవు.
వైద్యం నైవేద్యంలా మారి,
సగటు మానవుడు
చికిత్సకు దూరమౌతున్నదుస్థితి.
పరిస్థితులతో పోరాడి
గెలవాలన్న తాపత్రయంలో
మానవ మేధస్సు.
శవాల దిబ్బలుగా
మారిన శరీరాలను చూసి
స్మృహతపుతున్న కాలం.
ఎవరికి, ఎప్పుడు,ఎలా,
ఏ రూపంలో ప్రమాదం ముంచుకొస్తుందో
తెలియని అయోమయంలో జీవన సమరాన్ని
సాగిస్తూ నిట్టూర్పుల గూటిలో మానవుని
చలనం. వాదోప వాదాలకు తావు లేని చోట
మౌన దీపం వెలిగించి
తెలివిగా మసలుకోవాలి.
పొంచిఉన్న ప్రమాదాన్ని ఊహించి
జాగ్రత్తలు పాటించాలి. అయినా.....
ఆత్మస్థైర్యం చిరునామాగా
మార్చుకున్న మాతృభూమి మనది.
రోజులు మారతాయని నమ్మి ఆశల
రెక్కలు చాపి విహరించటానికి సిద్ధంగా
ఉండండి. మానవ మనుగడకు పట్టిన
కరోనా అనే ప్రాణాంతక వైరస్ గ్రహణం
త్వరలోనే వీడి పోతుందని నమ్మి
చరమ గీతం పాడేందుకు
గొంతులు సవరించండి.



**-షేక్.నసీమా బేగం** 9603567011

## నిత్య స్మరణీయులు



**-దోరవేటి** సెల్:9866251679

అష్టదిగ్గజ కవులు

* ఆంధ్రభోజుడు మెచ్చ నాంధ్రకవిత పితా
మహుడల్లసాని యిచ్చె మనుచరిత్ర;
'ముక్కు తిమ్మన పల్కు ముద్దుగుల్కగ పారి
జాతపహరణమ్ము చక్క నిచ్చె;
భక్తి శృంగార సద్భస ధూర్జటి కాళ
హస్తి శతక మహత్మ్య మమర గూర్చె;
ఘన రామరాజ భూషణ నామ భట్టుమూ
ర్తియె సంగెను వసుచరిత్ర మలర;
కవి రామలింగ 'వికటకవి' శ్రీపాండు
రంగ మాహాత్మ్యమ్ము సంగినాడు;
రమ్య అయ్యలరాజు రామభద్ర కవీంద్రు
డవని రామాభ్యుదయమ్ము సంగె;
⊙ మిన్న మాదయగారి మల్లన్న సుకవి
రాజశేఖర చరితతో రాజిలెను;
సరస రసభ్రాంగి పింగళి సత్కవీంద్రు
క్రమత నిడె కళాపూర్ణోదయమును మనకు
అష్టదిగ్గజముల చోట నిష్ఠ గలిగి
నిలిపె రా కృష్ణరాయల నిత్యకీర్తి!
భువన విజయమై భాసిల్లె కవన గరిమ
సత్యకీర్తియై నిలిచె సాహిత్య చరిత!!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 198వ రోజు 'చౌరస్తా' అనే అంశంపై తమ కవితలను పంచుకున్నారు. 'చౌరస్తా' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.. – సంపాదకులు



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక &
దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
**డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు,** 9441046839



## దిక్సూచి

చార్ రస్తాల కూడలే చౌరస్తా
చౌరస్తాదాక చకచకా వచ్చినా
దారి తెలియకుంటె తికమక పడడమే
తెలుసుకొని పోతే
గమ్యం చేరుకోవడం
లేకుంటే ఆగమవడమే
చదువుకున్నోల్లు బోర్డుల వంకజూస్తే
చదువురానోల్లు అడిగి చూడడమే
పెద్ద పెద్ద నాయకుల విగ్రహాలకు
చౌరస్తాలే కేంద్రబిందువులు
అంత వరకున్న పేరు మార్పు
నాయకుని పేరుతోనే చెలామణి
ఇంటి చిరునామాలకు సైతం
చౌరస్తా పేరు దిక్సూచి
చౌరస్తా పరిసరాలన్నీ
వాణిజ్య కేంద్రాలుగా మార్పు
ఏం మాట్లాడారో వినబడని ముచ్చట్లు
చౌరస్తా ముచ్చట్లుగా చెలామణి
రానురానూ రద్దీ పెరిగినాక
ట్రాఫిక్ సిగ్నల్ల రాక
ఇచ్ఛాపూర్వక ప్రయాణాలను
అదుపు చేసే సిగ్నల్లు
హద్దు దాటితే జరిమానానే.



**-గుండం మోహన్ రెడ్డి,** 9440161636

## నాలుగు దారుల సంగమం

చౌరస్తా
చిరునామాలకు సూచిక
ఊరైనా
నగరమైనా
ఏదో ఒక చౌరస్తా ప్రసిద్ధమే.
కోఠి అబిడ్స్ క్లాక్ టవర్
మొజాంజాహీ మార్కెట్
చౌరస్తాలు
వ్యాపారాలకు పెట్టింది పేరు.
పట్టణాలకు పేర్లలాగా
చౌరస్తాలకూ ప్రత్యేక ప్రాముఖ్యత
దారులు ఎంత దూరమున్నా
చౌరస్తా దాటకుండా సాగదు ప్రయాణం
ఆగకుండా పోతే
యాక్సిడెంట్లకు అవకాశం.
అవగాహన లేకుంటే
ఎటు వెళ్లాలో కన్ఫ్యూషన్
రద్దీ ఎక్కువైతే గజిబిజి గందరగోళం
వేగానికి కళ్లెం
ఆగి వెళ్ళితే సురక్షితం.
నాలుగు దారుల కూడలి
నలుగురు కలిసే చోటు
ఎన్నో విషయాలూ వార్తా విశేషాలూ.
పల్లెటూర్లో
కాలక్షేపానికి కలుసుకునే ప్లేస్
పంచాయతీ న్యాయస్థానం.
ర్యాలీ నిర్వహణకు
మానవ హారాలకు
నిరసన ప్రదర్శనలకు
దానధర్మాలకు
విస్తృత వ్యాపార ప్రచార ప్రకటనలకు
చౌరస్తానే కేంద్రం.
నిత్యం జీవనోపాధికోసం
వేచి వుండే కూలీల అడ్డా
యాచకుల భిక్షాటన జాగా
గణతంత్ర స్వాతంత్ర దినోత్సవాల
జెండా ఎగురవేసే జంక్షన్
ప్రముఖుల విగ్రహాల నిలయం.



**-డా. భూంపల్లి కేశవరెడ్డి,** 9848473099

## కూడలి

మనిషికి రహదారి వెంట
ఎన్నో విధాల మలుపు
గమనానికి గమ్యానికి
ఒక సూచిక ఈ కూడలి.
రహదారిని
తూర్పు పడమర
ఉత్తరం దక్షిణం భాగాలుగా
విడదీసి ప్రయాణికులకు
ఒక మార్గం చూపడానికి ఈ దారి.
కూడలి వల్ల ప్రయాణం సుగమం
సులువైన ప్రయాణం
సురక్షిత ప్రయాణం
సందడి ఒకవైపు
కాలుష్యం మరోవైపు
రణగొణ ధ్వనుల మధ్య
గ్రీన్ లైటు కోసం
ఎదురు చూపు.



**- నారుమంచి వాణి ప్రభాకరి,** 9849481823

## జీవిత పాఠాలు నేర్పే కూడలి

చౌరస్తా
మనిషికి క్రమశిక్షణ నేర్పే కూడలి
వేగంగా పరిగెత్తే మనుషులకు
వేచి చూడడం నేర్పే క్రమశిక్షణ స్థలి.
ఎదురు లేకుండా వెళ్లే వాహనదారులకు
ఎదురుగా చూసి వెళ్ళమని హెచ్చరించే
నాలుగు మార్గాల కూడలి.
ఎటువైపు వెళ్లాలో
ముందే నిర్ణయించుకుని వెళితే రాచబాట
గతి తప్పిన ప్రయాణం
ఇక్కట్ల పాలు చేసే ముళ్ల బాటే.
మనిషికి
ఓపికనూ సంయమనాన్నీ నేర్పే
సంగమ స్థలి
అదుపు తప్పి ప్రయాణిస్తే
అదొక ప్రమాద కూడలి
నాలుగు మార్గాల కూడలి
జీవితానికి గుణ పాఠం నేర్పే జ్ఞాన బాట
మనిషి ముందు
అనేక మార్గాలు కనిపించినప్పుడు
ఉత్తమమైన మార్గ ఎంపిక
విజయానికి సోపానం
జీవితం
కష్టసుఖాలు
సుఖదుఃఖాల కూడలి
అవరోధాల మార్గాలన్నీ అధిరోహించి
జీవిత ప్రయాణం సాగిస్తే
విజయ తీరం ఖాయం.



**-త్రివిక్రమ శర్మ,** 9000392707

## కూడలి

నాలుగు రోడ్ల కూడలి చౌరస్తా
నలుగురు నడిచే రహదారి
అందరూ తిరిగే దారి
నిండుగా కళకళలాడే స్థలి.
కూడలి మధ్యలో పోలీస్
కుర్ కుర్ మనే పెద్దశబ్దాలు
కూకూ అంటూ బస్ హారన్స్
కార్లూ బైకులూ సైకిళ్లూ ఆటోలూ
జనాల ఉరుకులూ పరుగులూ.
సిగ్నల్స్ తప్పక పాటిస్తే
తప్పుతాయి ప్రమాదాలు
పోలీస్ చూపే చేతులుచూస్తే
గమ్యం సులభతరం.
ఉదయం
స్కూల్ కి వెళ్ళే పిల్లలు
ఆఫీసులకి వెళ్ళే ఉద్యోగులు
పనులకు వెళ్ళే కూలీలు
షాపులకు వెళ్లే వ్యాపారస్తులు
ఎంత రద్దీ ఉంటుందో!
ఆగమ్య గోచరం అందరికీ
సాయంత్రమూ ఇదే పరిస్థితి
చౌరస్తా దగ్గర
జాగ్రత్తగా సిగ్నల్స్ చూసుకుంటూ
పోలీసుల సూచనలు పాటిస్తూ
ముందుకుసాగితే మనమంతా హాయి.



**- తాతపూడి సోమశేఖర శర్మ,** 8328079336

## అందరినీ కలిపే రస్తా

నేను మల్లస్తా!
ఏ రస్తా కెల్లుతున్నవెందీ!
చౌరస్తా కెల్లుతున్న వస్తావా?
నాలుగు కూడళ్ళలో
నలుగురిని కలిస్తే
నాలుగు విషయాలు తెలిస్తయి.
హడావుడి జనాలు
వాహనాలు రాకపోకలు
చిల్లర వర్తకుల కోలాహలం
టీ కొట్టులో కూర్చుంటే
ఎందరో కలుస్తరు!
అందరి బాధలు సుఖాలు
సహాయాలు బేరాలు వ్యాపారాలు
ఒకటి కాదు ఇలా ఎన్నో ఏకరువు
బాతాఖానీ కొట్టొచ్చు సరదాగా!.

## చౌ... రాస్తా...

ధర్మం అర్థం కామం మోక్షం
నాలుగు రోడ్ల కూడలిలో
నవ్వుల పాలు కావద్దని ఎర్రలైటై హెచ్చరిక
చక్కని దారినిస్తూ
నీ వైఖరి భుజం మార్చుకోవద్దనీ
పచ్చలైటు ఆశయాల కల్పనాకూర్పు.
ఓ ప్రార్థనా మందిరం
మానసిక పరిపక్వత సౌందర్యం
కామానికి స్పీడ్ బ్రేకులేస్తూ
క్రమశిక్షణ తో పయనిస్తే
లోకం వివాదరహిత విరజాజి పూల తోట
పక్కోడి రొక్కం కంట్లో కారమనుకుంటే
అష్ట లక్ష్ములు నీవెంటే
పరనిందలేని నరుడి బతుకు పాఠం
చరిత్రకు అద్దం పట్టే విదుర నీతి.
ధర్మం ప్రపంచానికి పూజా పుష్పం
ధర్మాన్ని గుర్తెరిగి నడుచుకునే ఆచరణశీలికి
అసాధ్యమేముందీ ఇలలో
కాటేసే స్వార్థ కీచకులకు
తప్పదు మరి యమపురి.
నిన్ను నీవు సరిదిద్దుకున్నావా
మోక్షం నిను వెతికే వెన్నెల దీపం
కైలాస నాథుడే నీలో పలికే స్వరం
ఓ అమృత ఫలం ఈ జీవనం
ఎవరేమనుకున్నా ఎదురేమొచ్చినా
సాగిపో సత్య నిష్ఠ నియమాలతో
మార్గదర్శివై నిలిచిపో ఈ ధరిత్రిలో.



**- ఏడెల్లి రాములు,** 9494800454

## ఆదమరిస్తే..

చౌరస్తా
ప్రజలు గుమిగూడి
భిన్న విషయాలు చర్చించే అడ్డా
పంచాయతీ కైనా
వ్యాపారానికైనా
ఎన్నికల ప్రచారానికైనా
పబ్లిసిటీ స్టంట్ అయినా
ఫ్లెక్సీ బోర్డ్ అయినా
అడ్డా చౌరస్తా
వాహన చోదనలో గందరగోళం.
ప్రమాదాలకు మార్గం
జేబు దొంగలకు
యాచకులకు
అటూ ఇటూ తిరుగుతూ
అమ్ముకునే విక్రయదారులకు
అడ్డా చౌరస్తా
చౌరస్తా
సాంఘిక ఆర్థిక రాజకీయ కూడలి
భిన్న స్పర్థల నిలువుటద్దం
సంశ్లేషణ విశ్లేషణ ఘటం
సిగ్నల్ వ్యవస్థను అగౌరవపరుస్తూ
ముందుకు సాగే తీరులో ఆదమరిస్తే
ప్రాణాలు హరీ!
రణగొణ ధ్వనులు
కాలుష్యపు విషకోరల కారకాలు
మనిషి జీవితమే చౌరస్తా.



**- వి.ఉమారాణి,** 9440408080

## అగు... చూడు.. వెళ్ళు

నాలుగు రోడ్లకూడలి
నాలుగు దిక్కుల సూచిక
దివారాత్రముల సందడి
ట్రాఫిక్ లైట్లతో
హైమాస్ట్ లైట్లతో
అర్ధ రాత్రి కూడా అపరాహ్నంలా
మెరుపులు
ట్రాఫిక్ నియంత్రణకి మార్గదర్శిని
ఆక్సిడెంట్లు కాకుండా కాపాడే రక్షిణి
తొందరపాటునూ అతివేగాన్నీ
నియంత్రించే కూడలి
సురక్షిత గమ్యం చేరాలంటే
కూడలిదగ్గర
గమనించి వెళ్లాలనే సందేశం!
బీద, ధనిక బేధంలేదు
చిన్న బండి, పెద్దబండి తారతమ్యంలేదు
సైకిల్ అయినా, బెంజ్ కారయినా
ఒకటేరూల్!
రూల్ దాటకుండా ట్రాఫిక్ కానిస్టేబుల్
నిఘా!
చూసీచూడనట్టు గీత దాటినా
పచ్చ లైటు పడకముందే
ముందుకురికినా పడుతుంది చలానా!
ఒక్కో చౌరస్తాలో ఒక నాయకుడి విగ్రహం
వారిమీద గౌరవం
ఆ చౌరస్తాలకూ నామకరణం
కొత్తవారికి అడ్రెస్ అన్వేషణలో
సహాయకారి చౌరస్తా!.



**-మోటూరిశాంతకుమారి,** 8106790978

కొత్త వ్యక్తుల పరిచయాలు
కొత్త విషయాలు తెలువచ్చు
సాయంత్రం అయ్యిందంటే
అందరి దర్శనం అక్కడే.
పనికి లేబర్ దొరికేదక్కడే
ఊరకి బస్సులు దొరికేదక్కడే
ఎటువైపు నుండి ప్రమాదం
ఎలా వస్తుందో తెలియదు కానీ
ఎవ్వరు తప్పించుకున్నా
పట్టుకునేది చౌరస్తాలో నే
అన్నీ రస్తాలను కలిపేది ఈ చౌరస్తా!.
వాహనాల జోరును ఆపేది
పాదచారుల నడకల ఊపిరి
రక్షక భటుల విడిది
చోదకులను కంట్రోలు చేసే బ్రేకిది.
ప్రయాణానికి మలిపే రస్తా ఇది
నగరీకరణకు అభివృద్ధిది
అందరినీ కలిపే రస్తా చౌరస్తా.



**- గుండవరం కొండల్ రావు,** 9705965172

## అభివృద్ధికి మూలం

చౌరస్తా అంటే
నాలుగు రోడ్లు కలిసే కూడలి
నాలుగు వైపుల నుండి వచ్చే ప్రజలతో
వివిధ రకాల దుకాణాలతో సందడి.
ఎటువైపు నుండి వచ్చే మిత్రులైనా
బంధువులైనా
ఇతరత్రా ఏ అవసరాలకైనా
కలవాలనుకుంటే చౌరస్తానే చిరునామా
ధర్నాలకైనా రోడ్ షోలకైనా
రౌడీలు గుండాలకైనాచౌరస్తానే అడ్డా.
ఆటోలు బస్సులు ఇతర వాహనాల
హారన్ చప్పుళ్లతో ధ్వని కాలుష్యం
వాహనాల పొగతో వాయు కాలుష్యం
రోడ్డుపక్కచిన్న చిన్న వస్తువులు
అమ్మేవారు కొనుగోలుదార్లతో
జనసమర్థపు రద్దీలో
రోడ్డు దాటలేని
పిల్లలు, వృద్ధులు, వికలాంగుల పరిస్థితి
దుర్భరం దయనీయం.
ప్రమాదాలకు కారణం
అన్ని వస్తువులూ
ఒకేచోట దొరికే అవకాశం
ఎవరిని కలవాలన్నా అనుకూల ప్రదేశం
ఊరి అభివృద్ధికి మూలం.



**-నాగిరెడ్డి అరుణ జ్యోతి,** 996618156

# బాల సాహిత్య వికాసమే “అక్షర సేద్యం లక్ష్యం”

సమాజంలో మనిషి జీవన విధానంపై పరిసరాల ప్రభావం ఎంతగానో ఉంటుంది ఈ విషయం మన నిత్య జీవితంలో ఏదో ఒక సందర్భంలో అనుభవపూర్వకంగా అందరికీ అర్థమయ్యే ఉంటుంది.

మనం నివసిస్తున్న పరిసరాలకు అనుగుణంగా మనం సహవాసం చేసే మనుషులను బట్టి మన ప్రవర్తనలో మార్పులు రావడం జరుగుతుంది. అయితే ప్రస్తుత సమాజంలో మనుషుల పై పరిసరాల ప్రభావం అనేది సాంకేతిక రూపంలో పడుతుంది. సాంకేతికత వల్ల పనులు సులభం అవుతున్నాయి కానీ, విలువలు క్షీణిస్తున్నాయి.

సమాజంలో అన్ని సులభంగా లభిస్తున్నాయి అనే భావనకు రావడం జరుగుతుంది. దీని వల్ల మనుషులకు కృతజ్ఞతాభావం లేకుండా దేనిని లెక్కచేయకుండా యాంత్రిక మనసులు కలిగిన మనుషులు ప్రస్తుత సమాజంలో తయారవుతున్నారు. ఇదంతా ప్రస్తుత సమాజానికి వర్తిస్తుంది.

ఇదే సమాజంలో ఇప్పుడిప్పుడే చిగురిస్తున్న లేత మొలకలు, సుకుమారపు మంచు ముత్యపు బిందువులు, పసిడి మొగ్గలైన చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పిల్లలకు ప్రస్తుత విద్యా విధానం వల్ల, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం వల్ల నైతిక విలువలు, వారు పొందే సౌకర్యం వెనుక గల కష్టం, కృతజ్ఞతాభావం ఇవేవి తెలియకుండా తయారయ్యే ప్రమాదం ఉంది.

అలా జరిగితే సమాజ భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారై నేరస్తుల శాతం పెరిగి, సంఘ విద్రోహ శక్తులుగా ఈ పసి మొగ్గలు తయారయ్యే ప్రమాదం పొంచి ఉంది.

రాబోయే కాలంలో ఇటువంటి క్లిష్ట పరిస్థితులు రావద్దని పిల్లల్లో నైతిక విలువలు కుటుంబ సంబంధ బాంధవ్యాల గొప్పదనం, పెద్దలను గౌరవించడం, ప్రకృతి పట్ల కృతజ్ఞతా భావం, కలిగి ఉండి ప్రకృతిని కాపాడుకోవడం సాంకేతికతను అవసరం ఉన్నంత వరకే ఉపయోగించుకోవడం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేట్లు పిల్లలను తయారు చేయడానికి బాల సాహిత్యం ఒక గొప్ప వరం అని భావించి “అక్షర సేద్యం ఫౌండేషన్” పిల్లల కోసం కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

అందులో భాగంగానే ఫౌండేషన్ అధ్యక్షులు ఉపాధ్యాయులు బైతి దుర్గయ్య ఆధ్వర్యంలో ఆనంద్ శ్రీనివాస్ సౌజన్యంతో ఉగాది కవితల పోటీ నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి 215 మంది బాలకవులు తమ అద్భుత రచనలతో పాల్గొనడం జరిగిందని అక్షరఫౌండేషన్ అధ్యక్షులు బైతి దుర్గయ్య తెలిపారు.

వీరందరూ సమాజ శ్రేయస్సు కోరే విధంగా అనేక అంశాలలో కవితలు రాశారని వీరందరూ వారి రచనల ద్వారా రేపటి ఉత్తమ పౌరులుగా తల్లిదండ్రులు, గురువులు, సమాజం గర్వించే స్థాయికి ఎదుగుతారని నమ్మకాన్ని కలిగించారన్నారని అన్నారు.

ఈ 215 కవితలు నుండి న్యాయనిర్ణేత అన్నవరం దేవేందర్ 16 మంది ఉత్తమ బాల కవుల రచనలను ఎంపికచేయడం జరిగింది. వారందరికీ నగదు బహుమతులు సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని బైతి దుర్గయ్య తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్నవారికి బహుమతులు గెలుపొందిన విద్యార్థుందరికీ శుభాభినందనలు.

– సంపాదకులు

## మొదటి బహుమతి పొందిన కవితలు

### ప్రకృతే గురువు

సూర్యుడు ఉదయిస్తూ చెపుతాడు
ప్రాణికోటికి వెలుగు ధార
ఇవ్వడమే తన కర్తవ్యమని
ఆకు రాలిపోతూ చెపుతుంది
ఈ జీవితం శాశ్వతం కాదు అని
చెట్టు నీడ నిస్తూ చెపుతాయి
నీవు ఎండలో వున్న
పది మందికి చల్లదనాన్ని కల్పించమని
పక్షి ఆనందంగా ఎగురుతూ చెపుతుంది
ఎంత శ్రమపడినా
ప్రయాణం సాగించమని
పువ్వు నవ్వుతూ చెపుతుంది
ఉండేది క్షణమైనా
సంతోషంగా ఉండమని
నీరు కళకళలాడుతూ చెపుతుంది
జీవితంలో నిర్మలమైన
మనస్సుతో జీవించమని
అగ్ని మండుతూ చెపుతుంది
మనిషి పరిస్థితిని బట్టి
తప్పొప్పులు నిర్ణయించాలని
చంద్రుడు ప్రకాశిస్తూ చెపుతాడు
పరుల జీవితాల్లో వెన్నెల నింపడం లోనే
పరమానందం ఉందని
గాలి వీస్తూ చెప్తుంది
ఉన్నది పంచడంలోనే
పరమార్థం ఉందని
అందుకే ప్రకృతే లోకానికి గురువు
ప్రకృతి ఆగ్రహిస్తే ప్రళయం
ప్రకృతి అనుగ్రహిస్తే ప్రణయం
ప్రకృతి పాఠాలు జీవన వేదాలు
ఆ వేదం లోనే ఉన్నవి
సకల మానవ సౌభాగ్యాలు.



**-బి. శ్వేత**
-శ్రీ సంఘమిత్ర స్కూల్ , 9వ తరగతి,
హైదరాబాద్. 93922809805.

## ద్వితీయ బహుమతి పొందిన కవితలు

### చిన్నారుల సంబరం

తొలి మాసం చైత్రంతో
తొలి ఋతువు వసంతమై
తొలి తిథి పాడ్యమై
శిశిరంలో మోడైన చెట్లన్నీ
వసంతంలో కొత్త వస్త్రాలు
దరించినవా అన్నట్లు
కోకిలమ్మ రాగాల పల్లకిలో
బాలల కల్మషం లేని మాటలతో
చిన్నారుల ఆట పాటలతో
మల్లెల సుగంధాల నడుమ
వీచే పైర గాలి పరవశించగా
వరాల వసంతాలను వెదజల్లుతూ
తొలి కాంతులతో మామిడి కాతలతో
షడ్రుచుల కలయికతో
కొత్త కుండలో ఉగాది పచ్చడి
తెలుగింట సంబరాలు పంచుతూ
పిల్లల ఆనంద కేరింతలతో
ఎలాంటి ఆరోగ్య సమస్యలనైన ఎదిరిస్తూ
సంతోషమైన సమసమాజానికి
జాతీ జాతీ ఏకమై,విశ్వ జగత్తు
సస్యశ్యామలమై విలసిల్లేలా
జీవితంలో విజయాలను పొందాలని
సంతోషంతో...ఆనందంగా ఆహ్వానిద్దాం
ఈ “ప్లవ”నామ సంవత్సరాన్ని...



**-బి. నిక్షిత**
5వ తరగతి మాస్టర్ జీ స్కూల్
హన్మకొండ.
8500175459.

### ప్లవనామ సంవత్సరానికి స్వాగతం

శిశిరం మూతి ముడిచి
వయ్యారాలు ఒలకపోస్తున్న
వసంతానికి స్వాగతం పలుకుతోంది
కొత్త కొత్త ఊహలను చిగురింప చేస్తూ
కొత్త ఆశల వైపు పరుగులు తీస్తూ
కొత్త వసంతాలను అలంకరించుకొని
మనముందుకోస్తుంది
ప్లవ నామ సంవత్సరం
గత జ్ఞాపకాలన్నో
నేర్పిన గుణపాఠాలన్నో
కరోనాతో కల్గిన కష్టాలన్నో
రాబోయే తరానికి అనుభవాలతో
వేసిన బాటలెన్నో
కోయిలమ్మ తీయని రాగాలు తీస్తుండగ
మల్లె పందిరిలో మల్లెలు పొంచి చూస్తుండగా
షడ్రుచుల కలబోతతో
మన ముందుకొస్తుంది యుగాది
ఖండాతరాల్లో ఉన్న ఓ తెలుగు బిడ్డ
మన తెలుగు తనాన్ని నిలబెట్టు
మన తెలుగు సాంప్రదాయాన్ని ఆచరించు



**-పి.చిన్మయి**
7వ తరగతి
సిద్దార్థ స్కూల్ విజయవాడ.
9849366651.

## తృతీయ బహుమతి పొందిన కవితలు

### చెట్టు

లోకాన్ని నీ పచ్చదనంతో ఆకర్షిస్తావు
ప్రజలందరికీ ఆదర్శంగా నిలుస్తావు
ఆస్వాదించే స్వచ్ఛమైన గాలినిస్తావు
అందరికీ ఆహ్లాదకరమైన
నీడను ప్రసాధిస్తావు
తినడానికి ఎన్నో కాయలను
దానం చేస్తావు
పూజకు రంగురంగుల పూలనిస్తావు
రాసుకోవడానికి కాగితాన్ని ఇస్తావు
ఆరోగ్యంగా ఉండడానికి
ఔషధాలు ఇస్తావు
వెలుగు కోసం కట్టెల ద్వారా
మంటను అందిస్తావు
ఎన్నో జంతువులకు ఆకుల ఇచ్చి
ఆహారమవుతావు
పక్షులు నివసించడానికి
చోటును ఇస్తావు
వర్షాలు పడటానికి కారణమవుతావు
పపంచానికి అందమైన చల్లనైన
వాతావరణాన్ని అందిస్తావు.



**-డి . ఉషశ్రీ**
9వ తరగతి,అరవింద స్కూల్
మంగళగిరి గుంటూరు.
8333056782.

### దేశానికి నువ్వే దిక్కు

అన్న రైతన్న.....ఆత్మహత్యలు వొద్దన్న
నిరంతరం పనిజేస్తే బతుకుడాయే
రెక్కలాడితేనే బుక్కెడు బువ్వనాయే
అనుక్షణం బీద బ్రతుకులాయే
రేపన్నది ఎట్లుందో తెలువక దిగులాయే
రైతన్న బిడ్డలకి పొలమే రణరంగమాయే
శ్రమకోర్చి కర్మకోర్చి రంగంలో దిగుడాయే
రాళ్లు రప్పలు మరచి నొప్పులకు ఓర్చుడాయే
పొలంలో విత్తనాలు జల్లుడాయే
దుమ్మనక, బురదనక దుక్కులన్ని దున్నుడాయే
నీడలేక నిద్రలేక ఉండుడాయే
కలుపు లేసి కుప్పలేసి
కంటి నిండా నిద్రవోక జాగారమాయే
కరవు నుండి వరద నుండి
కాపాడ కావలుండుడాయే
పొలానికి మందుగొట్టి
పసిబిడ్డవోలె పెంచుడాయే
కొన్నప్పుడు కొన్నాలాయే
అమ్మినప్పుడు నష్టాలాయే
తిరిగి చూస్తే అప్పులయే
తిరగకుంటే తప్పదాయే
చెప్పకుంటే మందికి కుల్లులాయే
చెప్పుకోకుంటే బాధలెక్కువాయే
జేబు చూస్తే ఖాళీ ఆయే
పండుగకు బట్టలు లేకపాయే
చేసిన కష్టం బూడిదపాలాయే
చేతిలో చిప్ప మిగిలే
అన్న రైతన్న నీకెవరున్నారన్న
అన్న రైతన్న నీకు నువ్వే దిక్కన్న
రైతన్న నువ్వు అదిరిపోకు చెదిరిపోకు
చెదిరిపోయి రాలిపోకు
మాకు అవ్వ అయ్యలెక్క దేశానికి నువ్వే దిక్కు
సరిహద్దున జవానులెక్క రక్షణ మాకు
పిరికి పనులు వద్దన్న
నిత్య పోరు వృత్తి నీదన్న
చివరి దాక నిలవాలే
పోరాడి గెలవాలే
జై జవాన్ జై కిసాన్.



**-గొల్ల స్రవంతి,**
10వ తరగతి,
ZPHS హావేలిఘనపూర్,
మెదక్. 9397304268.

### నా పల్లే నా ఊపిరి

కోడి కూతలతో మేల్కొనే నా పల్లె
సుప్రభాతాలతో మేల్కొలిపే నా పల్లే
ఎంతో అందమైనది నా పల్లె
అందరినీ ఆదరిస్తోంది నా పల్లె
బంధాలతో పెనవేసుకున్నది
నా పల్లె పచ్చని చెట్లకు పుట్టినిల్లు
నా పల్లె స్వచ్ఛమైన నీటి చెరువు నా పల్లె
పక్షుల కిలకిలలు నా పల్లె
పశువుల అరుపులు నా పల్లె
అలుకు పూతల వాకిళ్ళు నా పల్లె
ముగ్గులతో మెరిసేను నా పల్లె
మామిడి తోరణాలతో
మైమరిపించే నా పల్లె
రైతు నుదిటి రాతను రాసిన నా పల్లి
నాగ లను నగలుగా అలంకరించుకున్న నా పల్లి
ఇది వీధి కోలాటాల నా పల్లె
వాడ ఒగ్గు కథల ఒడి నా పల్లె
మహిళల కోలల మోతల నా పల్లె
పిల్లల కేరింతలు నా పల్లె
పురుషుల పొలం చర్చల రచ్చబండ నా పల్లె
పసిపాప బోసి నవ్వుల నా పల్లె
చిన్నారుల చిర్రగోనెలా నా పల్లె
అమ్మాయిల చేతి గోరింటాకు నా పల్లె
మగువ నుదుటన సింధూరం నా పల్లె
గుడి గంటల గారడీ నా పల్లె
కనకాంబరంతో కబుర్లాడే నా పల్లె
సంపంగి పూల సొగసు నా పల్లె
సీత జడతో సయ్యాటలాడే నా పల్లె
తామరలో తేజం అయ్యే నా పల్లె
గులాబీలలో గుబాళించే నా పల్లె
బంతి పూలతో బంధం
పెనవేసుకున్న నా పల్లె
ఈ అందమైన పువ్వుల నవ్వులలో
నా పల్లె ఉక్కిరి బిక్కిరి అవుతోంది
సీతాకోక చిలుకలు రంగులు
అద్దుకున్న నా పల్లె
చిలక జ్యోతిష్యాల నా పల్లె
ఆవుల ఆహ్వానం మేరకు రండి వెళదాం
నా పల్లె తల్లి ఒడిలోకి
ఆకుపచ్చని చీర కట్టుకుని
ఆనందంగా కిలకిల నవ్వుతూ
అందరినీ ఆహ్వానిస్తుంది
అందరూ ఆహ్వానితులే...



**-పి. యశ్వంత్**
8వ తరగతి
MJP శాయంపేట
వరంగల్.
8501884216.

## ప్రోత్సాహక బహుమతి పొందిన కవితలు

### బోనాల ప్రత్యేకత

ఏటేటా వచ్చే బోనాలు,
అమ్మవారిని పూజించే హిందువులు,
తీసుకొచ్చే కొత్త కాంతులు,
పట్టుచీరాలతో ఆడపడుచులు,
పసుపు కుంకుమలతో పూజలు,
అమ్మవారి జానపదాల పాటలు,
పాయసం వంటి తీపి రుచులు,
మొహంపై వెల్లివిరిసే సంతోషతరంగాలు,
ఊరంతా మంగళ వాయిద్యాలు,
ప్రకృతి మాతను ప్రసన్నం చేసుకోవడానికి
ఉత్సవాలు,
రూపం మార్చే మహంకాళి దేవతలు,
ఆహ్లాదంగా చేసుకునే వేడుకలు,
మరువలేని జ్ఞాపకాలు,
సంద్రంలా వచ్చే జనాలు,
ఇవే మా బోనాల శుభాధినాలు.



**-కొండపల్లి ఉదయ్ కిరణ్,**
ZPHS బొల్లారం,
జిన్నారం మండలం, సంగారెడ్డి
–చరవాణి:6309702337.

### సమయం

మధురమైన క్షణాలను మోస్తుంది
క్లిష్ట పరిస్థితులకు
సమాధానం అవుతుంది
సహనం మనకి ఉంటే ఎన్నో నేర్పిస్తుంది
ప్రతి ఒక్కరి పరిచయాన్ని
సార్థకం చేస్తుంది
ఒక్కో సమస్య జ్ఞానాన్ని అందిస్తుంది
ఎప్పుడూ మనల్ని సమాధానపరుస్తుంది
జీవితంలో ఎన్నో మలుపులకు కారణమవుతుంది
కాల క్రమేణా అన్ని బోధిస్తుంది
ఎంతో అమూల్యమైన సమయం
వృధా చేయరాదు ఏనాడ



**-డి.నీలిమ కృష్ణ**
9వ తరగతి,
అరవింద స్కూల్ మంగళగిరి,
గుంటూరు.
8333056782.

### ఓ పువ్వా

ఓ పువ్వా !
పొద్దున్నే వికసిస్తావు
ప్రేమగా సూర్యునికి నమస్కరిస్తావు!
నీ సువాసనలతో
అందరి హృదయాలు దోచుకుంటావు!
సాయంత్రం వరకల్లా ఎందుకలా వాడిపోతావు!
ధనిక పేద ఎవరినైనా దయతో
నువ్వు అందరినీ కనికరిస్తావు!
దేవుని దగ్గర చేరి పూజలను
అందుకుంటావు!
మంచివాడు చనిపోయినా
చెడ్డవాడు చనిపోయినా
ఎవరైనా భేదం లేకుండా
మెడలో మెరిసి పోతుంటావు!
అందుకే నువ్వంటే నాకు గౌరవం
శుభ అశుభ కార్యాలకు నువ్వే.
నీవు చేసే త్యాగం ఎంతో గొప్పది
కానీ నువ్వు సాయంత్రానికే
వాడి పోవడం నచ్చలేదు!
ఇంత మంచి నిన్ను దేవుడు
ఎందుకిలా చేశాడో కదా!
కానీ నువ్వు నీ అందమైన నవ్వుతో
ఉదయాన్నే వికసిస్తావు
అందరినీ పలకరిస్తావు..
అది చూసే నేను రోజును ప్రారంభిస్తాను.
నువ్వంటే నాకు ఇష్టం
నీ నవ్వంటే చాలా ఇష్టం
అందరికీ నీ నవ్వే స్ఫూర్తి!.



**-బలుగూరి సుధీర్ కుమార్**
10వ తరగతి., జి.ప.ఉ.పా .కలకోట, ఖమ్మం.
9441815722.

### ప్రకృతి అందాలు

సీతాకోకచిలుకను చూడు
విప్పారిన రెక్కలు చూడు
అందులోని సౌందర్యం చూడు
ప్రకృతికున్న అందం చూడు
పర్వతాన వృక్షాలను చూడు
వృక్షమునున్న చందం చూడు
వాటిని రక్షించే గుణం చూడు
ప్రకృతికున్న అందం చూడు
చల్లగవీచే మారుతాలను చూడు
జీవులతో ఆడే అల్లరి చూడు
అన్నిటిలో ఐకమత్యమే చూడు
ప్రకృతికున్న అందం చూడు
జలజలపారే సెలయేటిని చూడు
పారే జలాల శబ్దాలను చూడు
దాహార్తిని తీర్చే తత్త్వం చూస్తుడు
ప్రకృతికున్న అందం చూడు
చెట్లునిచ్చే ఆక్సిజన్ చవిచూడు
అందులోని మర్మమును చూడు
భూమిమీద వింతలనే చూడు
ప్రకృతికున్న అందం చూడు.



**-చేబ్రోలు. బాలాదిత్య,**
7వ తరగతి, రామకృష్ణా స్కూల్ ,
విశాఖపట్నం. 8790450418.

### రైతు

నువ్వు మట్టితో బతుకుతావు
మాకొసం బతుకుతావు
మట్టిని దైవంగా కొలుస్తావు
పేరును ప్రాణంగా భావిస్తావు
మీ స్వేదంతో నేలను తడుపుతున్నావు
నేల నుంచి సిరులను పండిస్తున్నావు
వాన చుక్క కోసం పడిగాపులు కాస్తున్నావు
కరువురక్కసితో నిరంతరం యుద్ధం చేస్తున్నావు
కష్టపడి పంట సాగు చేస్తున్నావు
గిట్టుబాటు ధర లేక రోదిస్తున్నావు
అందరికి అన్నం పెడుతున్నావు
నువ్వు మాత్రం పురుగుల మందు సేవిస్తున్నావు
నీ నవ్వు మాకు సుభిక్షం రైతన్నా
నీ కన్నీరు మాకు దుర్భిక్షం రైతన్నా
రైతు బతుకులు మారాల్సింది చిత్రాల్లో కాదు
రైతు బతుకులు మారాల్సింది
వ్యవసాయ క్షేత్రంలో.



**– డి.జశ్వంత్ రెడ్డి**
అంబిటస్ హై స్కూల్ సిద్దిపేట
సెల్ : 9346338238

### చిన్మయానందం

పూసే పువ్వుకు తెలియదు,
దాని అందం వాడిపోతుందని.
రాలే ఆకుకి తెలియదు,
నేలకి రాలక తప్పదని.
వర్షించే చినుకుకి తెలియదు,
భూమికి చేరుతుందని.
ప్రకాశించే దీపానికి తెలియదు,
ఆ జ్యోతి ఆరిపోతుందని.
ఉప్పొంగే కెరటానికి తెలియదు,
చివరకి అది ఒడ్డుకు చేరుతుందని.
ఉదయించే సూర్యుడికి తెలియదు,
సాయంత్రానికి అస్తమిస్తాడని..
కరిగే మంచుకొండకి తెలియదు,
సముద్రం లోకే కలుస్తుందని.
చిగురించే వృక్షానికి తెలియదు,
కొన్ని జీవులకు నీడనిస్తుందని..
మూగ జీవి ధేను కు తెలియదు,
ఒక తల్లి తో సమానమని.
చాలా పిల్లలకు తెలియదు,
తన తల్లి ఎంతో బిడ్డను ప్రేమిస్తుందని..



**-తొల్లల. సన్విత,**
9వ తరగతి, రామకృష్ణా స్కూల్ ,
విశాఖపట్నం. 8106522730.

### కూలన్న

కూలీ పనులు లేవని
పంటలు పండలేదని
పరాయి దేశం పోతివా ఓ కూలన్న
ఉన్న ఊరుని విడిచి
కన్న వారిని వదిలి
కష్టాలు ఎన్నో పడితివా ఓ కూలన్న
కుటుంబ పోషణకు
పిల్ల జెల్లను వదిలి
బాధలు ఎన్నో పడితివా ఓ కూలన్న
పండుగలు లేకపాయే
పబ్బాలు లేకపాయే
పస్తులేమో ఎక్కువాయేనా ఓ కూలన్న
ఏడ ఉన్నవో తెలియదు
ఎట్ల ఉన్నవో తెలియదు
ఎప్పుడు వస్తవో తెలియదు ఓ కూలన్న
అయ్య ఎప్పుడస్తాడని
పిల్లలేమో అడగవట్టిరి
ఏమి తెస్తావని ఎదురు చుడవట్టె ఓ కూలన్న.



**-సామల శివతేజ,**
9 వ తరగతి
ZPHS, చెగ్యాం.
జగిత్యాల.
9848958198.

### ఓ ప్లవనామ ఉగాది బాల!

ప్రకృతికాంత మరల ప్రసవించెనీ వేళ
పుడమితల్లి ప్రేమతో పురుడు పోసే
ప్రభవించె అందాల “ప్లవనామ” బాల
కేరింతల వింత సవ్వడి చేసే
ముత్తైదువుల లీల మత్తకోకిలల జోల
"కుహూ కుహూ" కొత్త రాగాలు తీసే
"చిగురు" చీరలుగట్టి సిగ్గుమొగ్గలు పుట్టి
వనమెల్ల నిలువెల్ల విరిగా పూసె
నవతరానికి ఆశల ప్రోది
నరనారీలోక కలల పునాది
ఊహలకు ఆది హృదయాహ్లాది
అవనికి అరుదెంచె నవ్య ఉగాది
పువ్వు పువ్వున వ్రాలి తేనలే గ్రోలి
తుమ్మెదలు చేసేను ఝుంకారనాదాలు
సిగ్గుమొగ్గలు వేసి అగ్గిపూలు పూసి
మోహింప చేసేను మోదుగు గుమ్మలు
మనసంత పులకింత మిధునపు గిలిగింత
జనమంత పాడేను వసంతగీతాలు
గ్రహరాశి గమనాలు గ్రహణాల ఫలితాలు
వివరించే విపులంగ పంచాంగ శ్రవణాలు
ఆనందభరితం షడ్రుచుల సహితం
సరికొత్త సాహితికి ఉగాది ఉతం
స్వాగతగీతం సుఖశాంతి సమేతం
సాంస్కృతిక విలువల శుభసాంకేతం.



**-కౌశిక్ రచెర్ల**
10 వ తరగతి,అకడమిక్ హైట్స్ స్కూల్,
బోడుప్పల్, హైద్రాబాద్.
8886442434.

### అమ్మ

అమృతం కన్నా
మధురమైన పదం అమ్మ
ఆకాశమంత ప్రేమకు అమ్మ చిరునామా
అమ్మను నిర్వచించడానికి
పదాలు చాలవు
రాయడానికి కావ్యాలు చాలవు
తనకంటు స్వార్థం లేని
నిస్వార్థ జీవి అమ్మ
అనంతమైన మమకారం
అమ్మ సొంతం
ఆయాసంలో ఆనందంలో ఆశ్చర్యంలో
సైతం పలకరించే కమ్మని పదం అమ్మ
బిడ్డ ఎదుగుదలకు ఆరాట పడుతుంది
అనునిత్యం పోరాటం చేస్తుంది
ఖాళీ కడుపుతో ఉండి కూడా
బిడ్డ కడుపు నింపుతుంది అమ్మ
కొండంత సమస్యనైనా తన హృదయ
మందిరంలో పదిలంగా దాచుకుంటుది
కల్మషం లేని ప్రేమ కురిపిస్తుంది
ఓర్పుకు నేర్పుకు ఆలవాలం అమ్మ
తన ప్రాణాన్ని పణంగా పెట్టి
జన్మనిచ్చిన అమ్మకు
ఏమిచ్చి రుణం తీర్చే గలము
మరుజన్మ నందు ఆమెకు
అమ్మగా జన్మని ఇవ్వడం తప్ప.



**-పుట్ట కీర్తన**
10వ తరగతి
ఆదర్శ పాఠశాల కోనరావుపేట
రాజన్న సిరిసిల్ల జిల్లా.
9701652528.

### చెట్టెందుకంటే

తూరుపు దిక్కున సూర్యుడు
నలుపు రంగు పరదాలు తొలగించి
లేలేత అరుణ కిరణాల చేతులతో
భూపుత్రులందరినీ ప్రేమగా తడుముతాడు .
ఆకాశంలో మేఘానికి వెడి బాణా లేయగానే
మా గ్రామం పొలాలన్ని తడిపి
చెరువులోదాక్కుండిపోతుంది
మట్టిలో నిద్రపోతున్న విత్తనం
ఆవులించి లేచి లేతాకుల చేతులతో
ఒళ్ళు విరుచుకుంటూ భూమిపైకి వస్తుంది
నీటిజల్లులతో తడిసి
ఎండపొడకు చలి కి ఎదిగిఎదిగి చెట్టవుతుంది
నీడనిచ్చి గాలినిచ్చి
ఫలాలనిచ్చి పండ్ల నిచ్చి
మానవుల సేవలోనే బతుకువెళ్ళదీసుకుంటుంది
అమ్మతో సమానమైన చెట్టమ్మా
మేము పుట్టినకాడినుంచి
చచ్చేదాకా మాతోనే బతుకంటుంది
ఇంతకి చెట్టెందుకంటే
ఊయలనుంచి కాటిదాకా
తానులేని మనిషి బతుకే లేదు గనుక



**-కె.రవితేజ**
ZPHS కొండూరు,
వరంగల్ రూరల్ జిల్లా
సెల్ :9010849411

## కణిక



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
పోటీ ఫలితాలు
### ‘బుధవారం బాద్షా’



నిర్వహణ: **డా॥ప్రతికంఠం మాలతీలత**
ఈ సమూహంలో చేరదలచినవారు
8985613123కి మెసేజ్ చేయవచ్చు.

ప్రథమ బహుమతి విజేత

శీర్షిక: **అమ్మ కదా..**

సెకండ్ల ముళ్ళుతో పోటీ పడి
ఇంటిల్లిపాదికీ అన్నీ అమర్చి పెట్టేందుకు
నిత్యం ‘అలసిన’ దేహాన్ని బుజ్జగిస్తూనే ఉంటుంది...
కూరలో కరివేపాకులా తనను
పట్టించుకోని ‘వైఖరి’ కి
ఈషణ్మాత్రమైనా వేదన పడక
వారి ఆనందంలో తనను వెతుక్కుంటుంది...
తన చాకిరికి ఎవ్వరూ ‘గుర్తింపు’ ఇవ్వకపోగా
మాటల ఈటెలతో మనసును కుళ్ళబొడిచినా
బాధను మునిపంటితో నొక్కి పట్టి
పెదవులపై చిరునవ్వు చెరగనీయదు!
అప్పుడప్పుడు ఇంద్రధనుస్సు లాంటి ఆనందాలు
‘అనుకోకుండా’ చుట్టుముట్టినా
అన్నింటికీ అతీతంగా
స్థిత ప్రజ్ఞతతో సాగిపోతుంది...
‘ఆరంభం’ నుంచి
అధిపత్య పద ఘట్టనలలో నలుగుతూనే
కుటుంబం కోసమే బతుకంతా
అంకితం చేస్తుంది..
ఎందుకంటే ఆమె అమ్మ కదా
సహనానికి ప్రతి రూపం
శాంతానికి చిరునామా...



**-పురిమళ్ల సునంద**
9441815722

ద్వితీయ బహుమతి విజేత

శీర్షిక: **కణిక ఉరక**

విష బాణాలకు బలై....
విరుగుడు లేని రోగాన్ని తాకి...
పోరాటం తో ‘అలిసిన’ తనువు....
అర్థిస్తుంది ఆపన్నహస్తం కై....
‘వైఖరి’ మారని విళయ తాండవం...
వినాశనమై ఉరకలు వేసే....
విధిని వెక్కిరించి నవ్వుతుంది....
వీధిన కుటుంబాలను బిచ్చ కూపాలనీ చేస్తుంది....
‘గుర్తింపు’ కార్డు తెచ్చుకుంది కరోనా....
గర్వపు గారాలు పోతుంది....
జాగ్రత్తలు తీసుకున్నా జడవని రక్కసి....
రక్షణకై రాత్రులు కరువు....
‘అనుకోకుండా’ వచ్చింది...
అందరి తనువులను తుంచింది....
ఆసరా కరువై రోదనైంది....
ఆదుకునే దిక్కే బరువైంది.....
‘ఆరంభం’ ఆటంకం అయింది....
పీడ కలల ప్రభలించింది.....
పిడుగు లాంటి వార్త అయింది.....
మనిషిని పిప్పి చేసింది....



**-కావ్య నరేష్**

### బైబై కరోనా!

ఏ ముద్దూ మురిపాలు లేవు
సరదాలు సంబరాలు లేవు
సందెగాలిలో వెచ్చని అనుభూతుల్లేవు
చల్లని వెన్నెల్లో
ఇసుక తెన్నెల్లో
మనసైన మగువచెంత
సరసాల సందడి లేదు
అలా వ్యాహ్యాళికెల్దామన్నా
గాలిలో నీవెక్కడ మమ్మల్ని
ఆవహిస్తావో అనే అనుమానం
వాహ్ కరోనా!
అనురూపం నీలాలావినోదం
ఒకసారి మనసార ముద్దిడి
వెళ్ళిపోతావన్న గ్యారంటా లేదు
తనివితీరక మళ్ళ కౌగిలించుకుంటావు
వ్యాక్సిన్ నీకు, అవరోధం కాదు
చిన్నాపెద్దలన్న తారతమ్యం లేదు
ఎవర్నీ వదలవు
ఎక్కడంటే అక్కడుంటావు
నీ నుండి తప్పుకోవడం
మహామహులకే సాధ్యంకానపుడు
నీలాంటి వాళ్ళు నీకెంత
కాలంతోపాటు కదలిపో
సూర్యస్తమయంతో పాటు ఒదిగిపో
మేము తరిమికొట్టకముందే వెళ్ళిపో
బైబై కరోనా!



**-గుర్రాల రమణయ్య**
సెల్: 9963921943

### జడివాన

తెలుపులన్నీ మూసివేశారు ఎవరో
ఏకాంతంలో ఏకాంత స్వరూపడవ్వమని.

గాలి బంధించినట్టు మనసంతా స్తబ్దత
నిబద్ధత లేని లోకం ఊపిరాడనివ్వదు.

నీటిబుడగలా జీవితం పేలిపోతుంది ఏక్షణమైనా
ఋణానుబంధంజడివాన– లెక్కలు సరిచూసుకో
కల్లోలమై కాలం కాటేసే లోలకమైంది
అలకలు చిలకపలుకులు మాని
చివరంచు మంచుబిందువుని చూడు.

విప్పారిన క్షణాలు వేసారిన క్షణాలు
జమిలిగా నవ్వుతుంటాయి
నడిసంద్రపు జడివాన
చుట్టుముడుతుంటుంది.



**-సి.యస్.రాంబాబు**
8374818961

## అమ్మలకు అమ్మ

నా పుట్టుకకు నవమాసాలు ఎదురుచూసింది అమ్మ
నా జన్మ కోసం పునర్జన్మనెత్తింది అమ్మ
పురిటినొప్పులు పడుతూ విధితో పోరాడి నన్ను గెలిపించింది అమ్మ
తనశ్వాసతో నాకు శ్వాసను అందించింది అమ్మ
తనరక్తాన్ని పాలగా మార్చినా ఆకలి తీర్చింది అమ్మ
తన ఒడినే పట్టు పరుపుగా మార్చి నన్ను నిద్రపుచ్చింది అమ్మ
నిత్యదీవెనలతో నా ఆయుష్షు పెంచింది అమ్మ
నా బుడిబుడి నడకలు చూసి కిల కిలా నవ్వింది అమ్మ
నా తేనె పలుకులకు అంబరాన్ని అంటినంత సంబరపడింది అమ్మ
నా చిలిపిచేష్టలకు చిరునవ్వులు చిందించింది అమ్మ
తన ప్రస్తుతాన్ని నా భవిష్యత్తు కోసం త్యాగం చేస్తుంది అమ్మ
నాకు విద్యాబుద్ధులు నేర్పి మొదటి గురువయ్యింది అమ్మ
నా వెన్నంటే ఉండి అన్నింటా ముందుకు నడిపింది అమ్మ
నా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించే ఇంటిచిట్కాల నిపుణురాలు అమ్మ
నా గెలుపే తనలక్ష్యంగా నిరంతర కృషిచేస్తున్న అమ్మ
నాకు కష్టమొస్తే తను కన్నీరుగా మారే అమ్మ
నా జీవితంలో నాకు దక్కిన గొప్పవరం అమ్మ
అమ్మకు.. పాదాభివందనాలు
మనసాభివందనాలు



-సుప్రియ కండె
8985122967

## ఎదురుచూస్తున్నా...!

అణువై ఊపిరిపోసుకున్న
క్షణాలనుంచే ఆరంభం..
నేను ఆడనేమోనన్న అనుమానపు దృక్కులు,
ఆ దృష్టి దోషం తగలకుండా..
భావిసృష్టిని మార్చగలనని
బలంగా సంకల్పించి...
అవతరించాను అమ్మగా!

అడుగడుగునా ఆంక్షలముళ్ళు,
గుచ్చే దాహపుచూపుల రెక్కలు
కత్తిరించే అనలాయుధంగా ...
అక్షరాన్ని ఆరాధిస్తూ
ఆకాశమంత ఎదిగాను.

కటుకుటాతి పయనం దాటి....
సహధర్మచారిణిగా సహగమించాను,
ఊడలమఱ్ఱి లా పాతుకుపోయిన
ఆ అహం ముందు
రాలని నా దుఃఖాశ్రువుల లెక్క తేల్చలేను,
నా మరోసగం మరమనిషని..
అర్థమైనా...,
వెనుతిరుగలేని సనాతనం
నా ప్రత్యణువులో...
నిరతాగ్నిగా వెలుగుతోంది!!

అయినా...
అద్వైతం కోసం,
కంచెలు లేని కలలసాకారం కోసం,
జ్వలించని,
కన్నీటి కడలిని మోయని కలికి కనుల కోసం,
కళ్ళు విప్పని నాటి నా ఆశయం కోసం...
ఆశల వాకిలి ముంగిట ఆశాజీవిగా...
కర్తవ్య దీపకళికనై
ఎదురు చూస్తున్నా!!



-సుభాషిణి ప్రత్తిపాటి
8099305303

## బలిపీఠంపై భావితరాలు !

చదువు చెట్టునుంచి
ఎదగాల్సిన జ్ఞానపు రెమ్మలు
పక్కదోవ పడుతూ
అంతుచిక్కని ప్రశ్నలై
అయోమయానికి గురి చేస్తున్నాయి.

దేశానికి దన్నుగా నిలవాల్సిన యువత
మత్తులో మునకలేస్తూ
పబ్బు గబ్బులో గడిపేస్తున్నారు.

బ్రతుకులు దిశా నిర్దేశనం లేకుండా
మైకంలో తేలిపోతున్నారు
మాదక ద్రవ్యాల మత్తులో
బ్రతుకులు తోలు తిత్తులై
తూలి తడబడుతున్నారు.

మత్తు గమ్మత్తులా మారి
పట్నాన్ని ముంచి
పల్లె గడపలపై ప్రాకుతూ
క్రీనీడలా మరో ప్రకంపనమై
పంజా విసిరి పచ్చని సంసారాల్ని
పచ్చిగా కూల్చేస్తోంది.

యువతరం మారాలి
ఆలోచనలు మారాకై మొలిచి
మేధస్సుతో ముందుకెళ్లాలి
జాతిని నడిపించే
భావితరాల భాధ్యతతో
నడకను సాగించాలి
క్షణాల సుఖం కోసం
అడ్డదారుల్ని ఆశ్రయించి
బలిపీఠంపై నీ భవితను బలిచేయకు...!!



-మహబూబ్ బాషా చిల్లెం
9502000415

## ఇంటికి దీపంలా ఉంటూ..

పాప పుట్టిందంటే
పాపనా పాపం అనే
పాపపు ఆలోచనలను
పెరికి పారేయ్యండి..

పాపని పుణ్ణమి వెన్నెల్లా
భావించిన్నాడే పాప
వికసించి చిరునవ్వుల
మోముతో గుభాలిస్తుంది..

ఇంటికి దీపంలా ఉంటూ
కంటికి రెప్పలా తోడుంటూ
కుంటు పడుతున్న
కుటుంబ కష్టాలను
కోటి ఆలోచనలతో
గట్టెక్కించి గెలుపు చూసే
ముత్తైదువలు మహిళామణులు..

అటు పుట్టింటికీ
ఇటు మెట్టింటికీ
వారధిగా ఉండే
వరదాయినులు వనితలు..

హత్యాచారాలు లేని
ఆత్మహత్యలు లేని
ఆడదంటే చిన్నతనం
పోగొట్టి.. స్వేచ్ఛగా
బతికిన్నాడే మహిళలకు
బంగారు బతుకులై
బంజరు భూముల్లా
పచ్చగా ముచ్చటగా
మురిసి మెరిసి
ఎదిగి మదినిండా
ఆత్మవిశ్వాసంతో సబలలై
తలెత్తుకొని జీవించి
తరించాలి..ఆనందించాలి..



-కొక్కె రాములు
9985341992

## ఆలోచించు ఓ యువత

నీ వెనుక
వెయ్యి అడుగులు
తోడు రాకపోవచ్చు!
నీవే ఓ అడుగై
పది మందికి
ఆదర్శంగా నిలవొచ్చు!

విశ్వాసం నమ్మకం
నీ ఆయుధమైతే..!
గెలుపు నీ విజయానికి
తొలి మెట్టుగా నిలవొచ్చు!
ఒక్క ఉక్కుపిడికిలితో
సమర శంఖం పూరించు
అదే...అదే....

సమైక్య నినాదమై
మనందరి విజయంగా నిలవొచ్చు!
ఆలోచించు ఓ యువత
రేపటిదే నీ భవిత..!!



-పగిడిపల్లి సురేందర్
పూసల
80748 46063

పుస్తక సమీక్షలు

# అభ్యుదయ భావ కాంతులను ప్రసరించిన.. "ప్రత్యూష"...!




ఇరవయ్యో శతాబ్దం మొదటి రెండు దశకాల్లో జన్మించి.. తమ పాతికేళ్ళు ప్రాయంలోనే కవిత్వంవైపు అడుగులేసిన ఆనాటి యువకవుల, కవయిత్రుల పద్య,గేయాలతో వెలువడిన సంకలనం "ప్రత్యూష", "సాధన సమితి"వారు తెలంగాణలోని సుప్రసిద్ధులైన కవులు, కవయిత్రుల ఉత్తమోత్తమ కావ్య సుమాలను ఏర్చి, కూర్చి 1950లో పద్య, గేయ సంకలనంగా నేటి తరానికి అందించడం అభినందనీయం.. తెలంగాణ సాహిత్య అకాడమీవారు సాహితీలోకానికి ఆనాటి కవుల, కవయి త్రుల రచనా శైలిని ఈనాటి కవులకు, కవయి త్రులకు ప్రేరణను, స్ఫూర్తిని అందించడానికి 2019లో మలి ముద్రణ బాధ్యతను చేపట్టడం హర్షణీయం.

తెలంగాణలోను, భారతదేశంలోను చారిత్రకంగా అనేక సంఘర్షణలకు గురైన కాలంలో ఆనాటి యువతరం నవభావాలలో కవిత్వ సృజన చేసి సామాజిక చైతన్యం కోసం కృషి చేశారు. ఒకవైపు జాతీయోద్యమం.. మరోవైపు తెలంగాణలోని దుస్థితి ప్రేరణగా అభ్యుదయ భావాలతో తమ కవిత్వాన్ని పండించారు. అటు సంప్రదాయం. ఇటు ఆధునికత జోడించి ప్రగతి కాంక్షను ప్రకటిస్తూ రాసిన పద్యాలు, గేయాలు ఈ సంకలనంలో పొందుపరిచారు. అయితే ఈ సంకలనంలో పద్య గేయాల్లో ఆధునికం సంప్రదాయం.. అభ్యుదయం.. వంటి రచనలు కనిపించినప్పటికీ భావ కవితా కుసుమాలు కొలువు దీరినప్పటికీ.. ఎక్కువగా అభ్యుదయ భావ కాంతులే ఉండటం గమనార్హం.

ఛందోబద్ధంగా రాసిన రచనల్లోనూ.. వ్యవహారాను కూలమైన భాషకే పట్టం కట్టడం విశేషం.. దాశరథి కృష్ణమాచార్యులు, బాగి నారాయణమూర్తి, పొట్లపల్లి రామారావు, పులిజాల హన్మంతరావు, ధవళా శ్రీనివాసరావు, గడియారం రామకృష్ణశర్మ, శ్రీమతి పర్నా జానకీదేవి, బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి, పల్లా దుర్గయ్య, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, గార్లపాటి రాఘవరెడ్డి, పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు, అడ్లూరి అయోధ్యరామయ్య. మూటుపురి వెంకటేశ్వరరావు, శ్రీమతి సోమరాజు ఇందుమతీదేవి, కేశవ పంతుల నృసింహశాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, సిరిప్రగడ రాధాకృష్ణారావు పూటూరి రాఘవాచార్యులు, సిరిప్రగడ భార్గవరావు, జమ్మల మడక సూర్య ప్రకాశరావు, సన్నిధానం శ్రీధరశర్మ, బూర్గుల రంగనాథరావు, ఖండవల్లి లక్ష్మీ రంజనము, వెల్దుర్తి మాణిక్యరావు, దేవులపల్లి రామానుజారావు, కాళోజీ నారాయణరావు మరియు వానమామలై వరదాచార్యులు వంటి ఉద్దండులు.. సాహితీ దిగ్గజాల కలాల నుండి వారి యవ్వన ప్రాయవయస్సును జాలువారిన రచనలను ఇందులో పొందుప రిచారు. ఈ సంకలనం చివరన ఆయా కవులు, కవయిత్రులు పరిచయాలను నిక్షిప్తం చేశారు. భారత్ రిపబ్లిక్ అవతరణ సందర్భాన 26వ జనవరి 1950న దాశరథి కృష్ణమాచార్యులుగారు 'అమృత సుప్రభాతము" పేరుతో రాసిన గీతంలో.. తరతరాల స్వప్నమ్ములు తరలివచ్చి.. నిత్య సత్యమ్ములై హవణించెనేడు.. భరత మాతృకిరీట శిఖరమునందు.. చిన్మయానంద మణిప్రకాశించె నేడు అంటు తమ ఆనందాన్ని ప్రకటించారు.

**తేనెలు పిండే తెలంగాణము**
**నెత్తుట ముంచెత్తేదరా?**
**తెప్పరిల్లిన, ఈ తెలంగాణము**
**కుత్తుక బట్టొత్తెదరా?** అంటూ ప్రశ్నిస్తూ.. భాగినారా యణమూర్తిగారు తమ కవితను రాశారు.

**అనుకరణలో మ్రగ్గి**
**ఆత్మ చంపెదవేల?** అంటూ పొట్లపల్లి శ్రీనివాసరావు గారు ప్రశ్నించారు.

ధవళా శ్రీనివాసరావుగారు 'అన్వేషణ' శీర్షికతో రాసిన గేయంలో చక్కని భావుకతను ప్రదర్శించారు.

గడియారం రామకృష్ణగారు తమ ఛందోబద్ధ పద్యాల ద్వారా మన పరిస్థితి సరి చేసుకొనుటకు చేయి కల్పండని హితవు పలికారు.

చైత్ర వైశాఖ మాస వాసంత శోభను.. శ్రావణాషాఢ మాసాల్లోని వర్షాన్ని తమ "ఋతు త్రయం" కవితలో పర్నా జానకీదేవిగారు అందంగా ఆవిష్కరించారు.

బెల్లంకొండ చంద్రశేఖర శాస్త్రిగారు 'సఖ్యం' శీర్షికలో రాసిన కవితలో రమణీయ భావాలకు చోటు కల్పించారు. **నేనే నీవై.. నీవే నేనై.. దుఃఖ లోకమును ఆస్వాదిద్దాం.. సఖ్యజీవులుగా నిశ్వాసిద్దాం** అంటూ పిలుపునిచ్చారు.

పల్లా దుర్గయ్యగారు సెలయేరు అందాలను తమ రచనలో సుందరంగా నిక్షిప్తం చేశారు.

'సృష్టి' కవితలో గార్లపాటి రాఘవరెడ్డిగారు ఆలోచనాత్మక అంశాలను ప్రస్తావించారు.

**ఆంధ్రశారద నీకు అక్షరాంజులులు** అంటూ పిల్లల మఱ్ఱి వేంకట హనుమంతరావుగారు రాశారు.

'అడుగుజాడలు" పేరుతో రాసిన కవితలో అడ్లూరి అయోధ్య రామయ్యగారి **"సిగలో పూవేడి తేనే సిరిలొల్కు చూపుల్లు.. నా కంటబడకున్న.. నిలువవే నాకాలొకట.. అడుగు జాడలే మిగిలేనే.. నా రాణి! అడవి బ్రతుకై పోయెనే"** అంటూ వాపోయారు.

**తేట మాటల తేనె లొలుకుచు**
**పాటవంబున బరుషమొప్పుచు**
**సాటి బాసల నీటు మీరెడు.. నాంధ్రభాషను**
**బొగడుమా!** అంటూ సురవరం ప్రతాపరెడ్డిగారు పిలుపునిచ్చారు.

వెల్దుర్తి మాణిక్యరావుగారు 'మా ప్రయాణం' పేరుతో రాసిన రచనలో.. ప్రణయ రాగాలనాలపించారు. ప్రతీ పంక్తిని రసజ్ఞతతో తీర్చిదిద్దారు.

**వాడిపోయిన**
**పూసల దండ**
**పొంగిపోయిన మీగడ**
**కవ్వమాడిన చల్ల పేరుపూ**
**మా ప్రణయంరా..**
**మా ప్రణయం** అంటూ రాసిన పంక్తులు పఠితులకు గిలిగింతలు పెట్టేలా కొలువుదీరాయి.

కాళోజీ నారాయణరావుగారు 'దీపావళి' శీర్షికతో రాసిన కవితలో.. **కోటి వెల్గుల చాటె.. నాటి దీపాలు.. 'రక్కసులు బాధింప.. రక్షయే లేదంచు..**
**కోటిరీతుల దెబ్బ.. నేటి దీపాలు** అంటూ వ్యాఖ్యానించారు. వానమామలై వరదాచార్యులుగారు "పాదరక్ష", "బిచ్చగాడు" శీర్షికలతో కవితలు రాసి మెప్పించారు.

ఇలా భావకవిత్వం.. అభ్యుదయ కవిత్వంతో "ప్రత్యూష" రూపుదిద్దుకుంది. ఆయా కవులు తమ చిన్ననాట రచనా వ్యాసంగం పట్ల శ్రద్ధను చూపి.. వారి సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. వాటన్నిటినీ ఏర్చి కూర్చి నేటి తరంకు మార్గదర్శకంగా.. ప్రేరణదాయకంగా ఉండేందుకు 'సాధనసమితి'వారు చేసిన కృషి ప్రశంసనీయం. తెలంగాణ సాహిత్య అకాడమీ వీటన్నిటినీ మళ్లీ వెలుగులోకి తేవడం సంతోషం.

**ప్రతులకు:**
తెలంగాణ సాహిత్య అకాడమీ
కళాభారతి, రవీంద్రభారతి
ప్రాంగణం,
హైదరాబాద్- 500 004



**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## సింహాసనపు కాంక్ష

అధికారపు దావాగ్ని
సింహాసనపు కాంక్ష
విరుచుకుపడి రాజ్య రాజ్యలనేగి
చివరికి పితృ హంతకుడిని చేసే...

రక్తసంబంధాలను రణమునకేసి
పుత్రుల పాలిట రక్తపిపాసచేసి
సంగ్రామంలో సుశిక్షితుల్ని చేసి
ధర్మంపేరిట అధర్మం చేసి...
సామ్రాజ్యానికి పునాదులు వేసే

సామ్యవాద తరహా లౌకిక భావాలను
వల్లెవేస్తూ... రాజరికాన్ని చేస్తూ
ఆర్థిక సాధికారత పేరు చెప్పి

ప్రక్షాళన పేరుతో ప్రచ్ఛన్న యుద్ధాలు చేస్తూ

అడుగడుగునా అవినీతి కుటిల బుద్ధి
వంచన ఆవరించి, రాజ్యకీయపు
బూటకపు వాగ్దానాలు చేసి
సామాన్యుడిని, సంపదను
సమూలంగా నాశనం చేసే...

అయినా సరే అవినీతికే
ఓటు వేస్తాం నోటుకే ఆశ పడతాం
జిత్తులమారి నక్కని సింహాసనమెక్కిస్తాం
జయ జయ నినాదాలతో నియంతను చేస్తాం
అంటుంది అతి తెలివి ప్రజానికం....



-శ్రీతరం బింగి శ్రీకాంత్
7893613015

## శివ ప్రాసలు

జీవే
శివం!
చావే
శవం!!

నాహం
శివం!
అహం
శవం!!

జాగృతి
శివం!
సుషుప్తి
శవం!!

శక్తిసహితం
శివం!
శక్తిరహితం
శవం!!

విముక్తి
శివం!!
విరక్తి
శవం!!

తేజస్సు
శివం!
తమస్సు
శవం!!

ధర్మమే
శివం!
అధర్మమే
శవం!!

ప్రళయం
శివం!
విలయం
శవం!!

ఉచ్ఛ్వాస
శివం!
నిశ్వాస
శవం!!

వివృతం
శివం!
ఆవృతం
శవం!!

వినోదమే
శివం!
విరోధమే
శవం!!

విశ్వమే
శివం!
నశ్వరమే
శవం!!

సకలం
శివం!
వికలం
శవం!!

కాలమే
శివం!
కలహమే
శవం!!

ఆనందం
శివం!
విలాపం
శవం!!

అనంతం
శివం!
అంతం
శవం!!

చలనమే
శివం!
జడమే
శవం!!

అస్తిత్వం
శివం!
మసిత్వం
శవం!!

విభూతే
శివం!
బూడిదే
శవం!!

లింగమే
శివం!
భంగమే
శవం!!

బ్రహ్మాండం
శివం!
పిండాండం
శవం!!

యుగాది
శివం!
యుగాంతం
శవం!!

త్యాగమే
శివం!
భోగమే
శవం!!

సర్వము
శివం!
గర్వము
శవం!!!!

ద్వంద్వాతీతం
శివం!
ద్వంద్వం
అహం.....



-సాకి
9951172002

## మానవ శాస్త్రం.!

ఆమె...
సృష్టి సూత్రం
మానవ శాస్త్రం

ఆమె...
ఉత్పత్తి జూ
పునరుత్పత్తుల
భౌతిక ప్రపంచ
శక్తి యుక్తి.!

ఆమె..
జీవన తత్వం
జీవిత సత్యం

ఆమె...
అన్నీ తానే అయినా
అడుగడుగున వివక్ష
క్షణ క్షణం విషమ పరీక్ష

ఆమె...

ఇపుడు చేయాల్సింది
ఉత్సవం కాదు
విముక్తి ఉద్యమం

ఆమె
ఇపుడు పురుషాదిక్యతకు
శస్త్ర చికిత్స చేసే
అస్త్రంగా మారాలి.!
సమ సమాజ నవ సమాజ
గానమై సాగాలి.!

(ఉత్పత్తి ,పునరుత్పత్తిలో
పునరంకితమౌతున్న మహిళ
శక్తులకు అంతర్జాతీయ
శ్రామిక మహిళ దినోత్సవ
శుభాకాంక్షలు...)



-చిలువేరు అశోక్
9492443141

# విలువైన "తెలంగాణ కవితా కల్హారాలు"




ఈ వ్యాస సంకలనం ఎంతో విలువైనది. ఇందులో ప్రాచీన మహాకవుల కవితాశైలిని వివరణాత్మకంగా తెలియజేయడమైనది. పాల్కురికి సోమనాథుడు (ఆచార్య అనుమాండ్ల భూమయ్య) నుండి గోనబుద్ధారెడ్డి( డా.ముదిగంటి సుజాతారెడ్డి), కొఱవి గోపరాజు,(డా. మల్లెగోడ గంగాప్రసాద్), బమ్మెరపోతన (శ్రీమాన్ వైద్యం వేంకటేశ్వరాచార్యులు), పొన్నగంటి తెలగన్న (ఆచార్య మసన చెన్నప్ప), అద్దంకి గంగాధరుడు (ఆచార్య ఎస్వీ రామారావు), భద్రాచల రామదాసు (ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి), గంగుల శాయిరెడ్డి (ప్రొ.తంగెడ కిషన్‌రావు), చెర్విరాల భాగయ్య ( డా.తిరుమల శ్రీనివాసాచార్య), వానమామలై వరదాచార్య (కోట్ల వెంకటేశ్వరరెడ్డి), డా॥కాళోజి నారాయణరావు (గిరిజా మనోహర బాబు), ఉత్పల సత్యనారాయణాచార్య (డా.దిలావర్),డా॥దాశరథి, డా॥ సి. నారాయణ రెడ్డి (డా.పెన్నా శివరామకృష్ణ) గార్ల వరకు విశదంగా ఇందులో మనం చదువుకోవచ్చును. వీరి గురించి రచించిన వారు కూడా ఆచార్యులు, పద్యకవులు, పండితులు కనుక ఈ వ్యాసాల సాంద్రత మీకు ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య సాంస్కృతిక రంగాల్లో చేస్తున్న కృషి మనకు ఇప్పటికే అనేక విలువైన గ్రంథ ముద్రణ ద్వారా మనకు అవగతమైనది. ఆధునిక సాంస్కృతి రంగంలో వచ్చిన ఆధునిక మార్గాలను అనుసరించి ఆయా సంబంధిత రచనల విజ్ఞానాన్ని రాబోయే తరాలకు అందివ్వాలనే సంకల్పంతోనే ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి. పరిషత్తు వేదికనుండి అనేకమంది ప్రముఖ కవులు, రచయితలు, పరిశోధకులు ప్రసంగించారు. వీటి ప్రాముఖ్యతను, ఆవశ్యకతను తెలియజేసారు. వీటికి తోడు సాహితీ రంగాలలో కృషి చేస్తున్న అనేకమంది లబ్ధప్రతిష్టులకు, ప్రతిభా మూర్తులకు ప్రతి ఏడూ ప్రతిష్టాత్మకమైన పురస్కారాలు కూడా అందజేయడం జరుగుతోంది. స్మారక ప్రసంగాలు, ప్రయోగాత్మకమైన సదస్సులు కూడా నిర్వహిస్తున్నది. ఏడిదిలో దాదాపుగా మూడు లేదా నాలుగు సదస్సులను నిర్వహించి సాహిత్య సాంస్కృతిక అంశాల మూల్యాంకంగా కూడా రూపుదిద్దుతున్నది. ఇక్కడ అనేక రకాల భావాలను తెలియజేయగల స్వేచ్ఛను కూడా అందిస్తోంది. ఈ పరిషత్తు నిత్యం చైతన్య భరితమై స్వచ్ఛందంగా ప్రవహించే జీవనదిలా ముందుకు సాగుతోంది.

ఇందులోని వ్యాసాలు ఎంతో ప్రామాణికతను పొందివున్నాయి. ఎంతో ప్రఖ్యాతులైన సాహితీమూర్తులతో అనేక ప్రసంగాలు చేయించడం, వాటిని వ్యాస రూపంలో ప్రచురించడం పరిషత్తు కార్యక్రమాల్లో ఒక భాగం. అంతేకాకుండా అనేక ప్రత్యేకాంశాలపై వ్యాసాలు రాయించి గ్రంథాలుగా ప్రకటించడం పరిషత్తు ఆధునిక చేతనలో నిర్వహిస్తున్న పని ఇది. ఈ వ్యాసాలన్నీ తెలంగాణ ప్రాంతంలో కవితా కల్హారాలుగా వెలుగొందిన 14 మంది కవులపై సేకరించి ప్రచురించారు. ఇందులోని మహాకవుల ఉదాత్తమైన బావాల్ని, సంప్రదాయకమైన భావజాలాన్ని రాబోయే తరాలకు అందివ్వాలనే వీరి కృషి కడు ప్రశంసనీయం.

**ప్రతులకు:**
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, అబిడ్స్
హైదరాబాద్-500 001
ఫోన్: 040-24753724



-శైలజామిత్ర
9290900879

## ఈ దుఃఖపు రుధిర రణ క్షేత్రంలో ..

ఒక అనివార్యపు దుఃఖ స్థితి
ఏవో ఆక్రమిత దృశ్యాల్లో ముక్కలవుతూ
కార్యకారణ సంచలిత కల్లోలం ఇది.

కళ్ళలో ఆకాశం చీల్చబడి
నా నిజ ఆనందపు శృతులు
లయ తప్పుతున్నాయి .

దూరాలు దూకినా
నా మట్టి నన్ను వెంటాడుతుంది .

నాలో మునిగిన పర్వత శ్రేణులు
నాలో కుంగిన సూర్యోదయాలు
నాలో నోళ్లు తెరచిన లోయలు
నా ప్రపంచం లో దర్శనమౌతాయి .

ఈ దుఃఖపు రుధిర రణ క్షేత్రంలో
అవ్యక్తాశ్రువులు ఘోషిస్తున్నాయి .
ఛేదించ సాధ్యం కాని
నైరాశ్యపు లోకం లో నిట్టూర్పుల నడకల్లో
క్షణాల్ని ఒంపుకుంటూ విలపిస్తున్నాను .
భళ్ళున వొలికే దుఃఖాన్ని
నా ఊరి చిత్రంగానో
నా ప్రాంత అభిమతం గానో
నా నేల జ్ఞాపకాల పుటగానో
నాలో ఒక వర్ణ క్షోభిత
దుఃఖ జలాలు ఉబుకుతుంటాయి .

నేను విశ్వ మానవుణ్ణే
అయినా వేళ్లవెంట జారుతూ
ఈ దుఃఖపు రుధిర సంక్షోభం లో
రాలుతున్న బొట్టు బొట్టు లో
రగిలే మమకారపు వేదాగ్నిని నేను .



-గవిడి శ్రీనివాస్
7019278368, 9966550601

## నా దారి నాదే

తరతరాలుగా పేరుకుపోయిన అసమానత్వం ఆంక్షలను
బద్దలు కొట్టుకొని
అస్తిత్వపు వేర్లలో ఇంకా పురుగు లా తొలుస్తూ ఉన్న

లింగ భేదాలను మరిపించాలని
విధి వెక్కిరింతల లో ఎదురైన శూన్యా లను
ఎన్నెన్నో శిధిల స్వప్నాలను
నువ్వు తక్కువ అనే ఈసడింపు పరాభవాలను
మదిలో దాచుకున్నా

అసమానత్వపు ఖడ్గాన్ని మది
ఒరల్లో దాచి
అనుభవాల ఆకు రాళ్లతో కుదురు కోల్పోని మదికి సానబెడుతూ
ముందుకు సాగుతూనే ఉన్న

ఆకాశంలో సగం అవకాశాల్లో సగం అంతటా నేను సగం
దీటైన సమాధానం తో ఎదుర్కోవాలని

ఆత్మవిశ్వాసాన్ని అడుగడుగునా నింపుకొని
ఆగని పయనానికి నేనే నిర్వచనం అయ్యి
గమ్యం వైపు పయనిస్తూ
అన్వేషణ వైపు మరో అడుగేస్తున్న నా దారి నాదే నని

సవాల్ విసిరిన ప్రశ్నకు నవాబులా జవాబివ్వాలని
లక్ష వర్ణాలు అద్దుకొని
రేపటి విజయాన్ని ఈరోజు లిఖించుకొని
ప్రతిభకు పట్టాభిషేకం చేసి
కాంతి అలనై ఎదురొస్తున్న
నేను సగం అంటూ



-అరుణ కీర్తిపతాక
9395147443

## ఓ మహిళా ఎక్కడమ్మా నీ స్థానం

వంటింటి మహారాణి అంటే
ఇంటికి ఇలవేల్పు అంటే
పొంగిపోయి మురిసిపోయి
కర్పూరమై నువు కరిగిపోతివ
అయినా....
ఏదీ నీ శ్రమకు తగిన విలువ?
ఓ మహిళా
ఎక్కడమ్మా నీ స్థానం?

గడప దాటని ఆంక్షలున్నా
గగనానికే పయనించి నావు
చేయి చాపిన అబలవు ఆనాడు
చేయూత నిచ్చే భాగమైతివి ఈనాడు
అయినా
ఎక్కడుంది నీ అస్తిత్వపు జాడ?
ఓ మహిళా ఎక్కడమ్మా నీ స్థానం

నువ్వు కాలు మోపని రంగముందా
సాధించలేని విజయముందా
నీవు లేక మనుగడుందా
నీవు లేని జగతి కలదా
అయినా.....
అంతులేని వివక్ష ఈ సమాజంలో..
ఓ మహిళా ఎక్కడమ్మా నీ స్థానం

నువ్వు ముందడుగు వేస్తుంటే
అడ్డు పడే చేతులు ఎన్నో
నువ్వు ఎదుగుతుంటే
అణగదొక్కే అసూయ పరులు ఎందరో
అబలవని నీరుకార్చే
మహానుభావులు ఎందరో నీ చుట్టూ ....
అయినా
వెనకడుగు వేయకు నీవెప్పుడూ

మినుకు మినుకు మంటున్న
స్వేచ్ఛా దీపాన్ని వెలిగించు
బంధానాల సంకెళ్లను సడలించు
అణచబడిన స్త్రీజాతి
గౌరవాన్ని పెంపొందించు
ఎగిసి పడే కెరటమల్లే
గెలుపు తీరం చేరుకో
నీ ఉనికిని కాపాడుకో ....
ఓ మహిళా
తెలుసుకో నీ గమ్యం
పదిల పరుచుకో నీ స్థానం .



-కళావతి కందగట్ల
9948263004

## ఉక్కు హక్కు పోరుకు సై

ఉక్కుపోతుందిర తమ్ముడ
మన హక్కుపోతున్నది చెల్లెలా
మన త్యాగాల ఫలితాన్ని తమ్ముడ
తన్నుక పోతుండ్రు చెల్లెలా ॥ఉక్కు॥
తాతలు తండ్రులు త్యాగాలు చేశారు
పోరాటాలు చేసి ప్రాణాలు ఇచ్చారు
వైజాగ్ స్టీలును సాధించి తెచ్చారు
బ్రతుకుపోతుందిర తమ్ముడ
మన మెతుకుపోతున్నది చెల్లెలా
లక్షలాది మంది తమ్ముడ
వీధిన పడుతుండ్రు చెల్లెలా ॥ఉక్కు॥

లక్షాలాది మంది కడుపును నింపింది
నీడను చూపింది బ్రతుకును ఇచ్చింది
కన్న తల్లి కన్న మిన్నగా చూసింది
మన కడుపులు నింపిన తమ్ముడ
బ్రతుకును ఇచ్చిన చెల్లెలా
అవ్వ పోతుందిర తమ్ముడ
మన బువ్వ పోతున్నది చెల్లెలా॥ఉక్కు॥

కొత్త ఆస్తులాను తెచ్చింది లేదాయే
వున్న ఆస్తులాను వరసపెట్టమ్ముతు
దేశాన్ని అప్పుల ఊబిలో నెట్టుతూ
ఆస్తులు అమ్ముతు తమ్ముడ
అభివృద్ధి అంటుండ్రు చెల్లెలా
దేశ భక్తి పేరున తమ్ముడ
ద్రోహాన్ని చేస్తుండ్రు చెల్లెలా ॥ఉక్కు॥

మంచి రోజులు కాదు
ముంచె రోజులొచ్చె
మనసులోని మాట పచ్చి మోసమాయే
ప్రజల పై పాలకులు
పగపట్టి నిలిచారు
ఉక్కుహక్కుకొరుకు తమ్ముడ
ఉప్పెనై లేవాలి చెల్లెలా
పోరాటం మిగిలింది తమ్ముడ
ఇక త్యాగాలు తప్పవు చెల్లెలా ॥ఉక్కు॥



-ఉప్పెన
8106073661

## వందేళ్ల ఉస్మానియా

అసఫ్జాహీల విజ్ఞాన వసంతం
చరిత్రపుటల్లో రాసుకున్న రాజసం
జాబ్స్ షేర్ వృదిలో కృతి పొందిన జ్ఞానభాండాగారం
ఆచార్యుల ఉలి దెబ్బలకు రాటుదేలిన విద్యార్థులెందరో
వందేమాతర ఉద్యమ తరంగాల్లో కదిలించిన గీతలెన్నో
విప్లవాల వినువీధిలో పుష్పించిన మందారాలెన్నో
ఉషస్సు లోంచి ఉద్భవించిన ఆరుట్ల కమలాలెన్నో
భూస్వామ్య కూసాలు విడిచిన గాండీవాలెన్నో
కథన ఉత్సాహంతో గొంతెత్తిన చురకత్తులెన్నో
ఉస్మానియా ఉద్యానంలో పుష్పించిన పుష్పాలెన్నో
హక్కులకై పోరాడి అసువులు బాసిన అమరులెందఱో

వైతాళిక ఉద్యమంలో ఊపిరిలూదిన మహానుభావులెందరో
వందేళ్ల సంబరాలలో స్మరించబడని స్మృతులెన్నో
ఇటుక ఇటుక కింద దాగిన శిథిల గాథలెన్నో
కథలు కథలుగా చెప్పుకొనే ఉస్మానియా ఉషస్సు
అలహక బాయ్ కైఫియత్తులు ఒదిగిన వెన్నెల
విజ్ఞాన కవాటాల విపంచికి మొలిచిన కాణాచి
హైదరాబాదుకు వన్నెలద్దిన మయూర మంజూష
రాజరికం నుంచి ప్రజాస్వామ్యం ప్రతిఘటన వెనక
నిశ్శబ్ద వీణల నిలుచుండి సాక్ష్యమిస్తున్న మౌన గీతిక
మూసి వాసుల మనసు దోచిన వందేళ్ల ఉస్మానియా.



-మహ్మద్ రుక్నోద్దిన్
9440986576

# సింగపూర్ తెలుగు వెలుగుల.. "అలా సింగపురంలో"




'నూట పదేళ్ళ తెలుగు కథ" ఎన్నో మార్పులకు.. ప్రయోగాలకు.. అంతర్జాతీయ ఖ్యాతిని సంతరించు కొంది. భువనచంద్ర, రాజా (మ్యూజికాలజిస్ట్) వంగూరి చిట్టన్‌రాజు, శాయి రాచకొండ, ఈ కథల సంపుటికి పరిచయ ముందుమాటలు రాసారు. భారతంలోని 18 పర్వాలులాగే.. 18 కథలు ఈ సంపుటిలో వున్నాయి. 17వ కథను అలా.. సింగపురంలో.. (పేజి. 113) ఒక షార్ట్ ఫిల్మ్ కూడా తీయబడింది. దాదాపు ఈ సంపుటిలో 5,6 కథలు సింగపూరు జీవన విధానాన్ని ప్రతిబింబించేవి. సోషల్ మీడియాలో జరిగే దుర్వినియోగాలని చెప్పే కొత్త తరహా కథలు.. వ్యంగ్యంగా సాగాయి.

'ప్యాకేజి పెళ్ళి' కథలో రామశాస్త్రి, వెంకటేశ్వర రావుల కుటుంబాలు కలిసి వారి పిల్లల పెళ్లి వెరైటీ ఈవెంట్ ప్లానర్స్"తో చేయిస్తారు. ప్యాకేజి 15 లక్షలతో ప్రారంభించి చివరకు వెరైటీవారి బిల్లు 24 లక్షల 99 వేలు అవుతుంది. ప్యాకేజీలు-ప్లేటు భోజనాల లెక్కలు.. టాక్స్‌లు.. టిప్పులు.. సర్వీస్ చార్జీలు.. ట్రాన్స్‌పోర్టులు.. వ్యాట్‌లు.. జి.ఎస్.టీలు విడియోలు కలిపి లక్షల బిల్లు.. మరో పెళ్ళిలో 13 లక్షలే అయింది అని వియ్యపురాళ్ళ సంభాషణ- కామాక్షి మహాలక్ష్మిల సంభాషణ మనని ఆలోచింపజేస్తుంది.

వృద్ధులైనా పనిచేసుకొని జీవించే మనస్తత్వంగల పని మనుషులు గురించి చెప్పిన కథే.. "పని మనిషో పాఖ్యానం" కథ (పేజి.35). సింగపూర్‌లో పని మనుషుల స్థితి చెప్పేమరో కథ కూడా (2వ భాగంగా) వుంది.

ఆహార వ్యవహారాలు, వంటలు.. ఆచారం.. కొడుకుల ఉద్యోగాలహడావిడి.. భార్యపోయిన శంకరయ్య కొడుకుల వద్ద కాలం గడపడం.. అతని స్నేహితుడు నరసింహం కల్సి.. కాలంతో ఎలా ప్రయాణం చేయాలో హితబోధ చేసిన కథే "సంక్రాంతి" (పేజి.43)

'కోవిడావకాయ" కథలో.. ముస్తఫా షాపింగ్ మాల్‌కు వెళ్ళి డార్లలో మామిడికాయలు కొనడం సూపర్ మార్కెట్‌లో కారం, ఇతర వస్తువులు కొనడం.. క్యూలు.. కరోనా జాగ్రత్తలు.. హాస్యభరితంగా రాసారు రచయిత్రి. శార్వరి, నిజాలెవరికి కావాలి. పగటి వెన్నెల కథలు.. హాయిగా చివరిదాకా చదివిస్తాయి. తొలి కథా సంకలనంలోనే రచయిత్రి పట్టు సాధించారు. మంచి కథలు అందించారు.

**ప్రతులకు:** వంశీరామరాజు
సత్యసాయిపురం, కుంట్లూరు
అబ్దుల్లాపూర్‌మెట్
రంగారెడ్డి జిల్లా-501 505
సెల్: 984902 3852



**- తంగిరాల చక్రవర్తి**
సెల్: 9393804472



# వికసిస్తున్న బాలసాహిత్యం

మన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పిల్లలకు వారసత్వంగా అందించేది సాహిత్యమే. ఈ సాహిత్యంలో పెద్దవారు పెద్దల కొరకు రాసే రచనలు, పెద్దలు పిల్లల కొరకు రాసే రచనలు మరియు పిల్లల కొరకు పిల్లలు రాసే రచనలు ఉంటాయి. మన తెలుగులో బాల సాహిత్యానికి కొదువ లేదు. కొన్నివేల ఏండ్ల కిందటి నుండే తెలుగు నేలలో మౌఖికం ద్వారా బాల సాహిత్యం విలసిల్లినది. పిల్లలు పెద్దవారి నుండి పాటలు, గేయాలు, పద్యాలు, కథలు మొదలగు అనేక అంశాలను నేర్చుకునేవారు. అంతేకాక చాలామంది ప్రాచీన, ఆధునిక కవులు కూడా తమ బాల్యం నుండే రచనలు చేయడం ప్రారంభించారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్న ఈ తరం పిల్లలు కూడా బాల్యంలోనే పలు రచనలు చేస్తూ పుస్తక ముద్రణ చేస్తున్నారు. ప్రపంచ తెలుగు మహాసభల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బాలసాహిత్యానికి విపరీత ప్రాధాన్యత ఏర్పడింది. మహాసభలలో భాగంగా రవీంద్ర భారతిలో బాలసాహిత్య వేదికను ఏర్పాటు చేయడం ఒక మైలురాయిని చెప్పవచ్చు. బాల సాహిత్యం ద్వారా పసి హృదయాలలో విజ్ఞాన బీజాలు మొలకెత్తుతాయి. భాష పరిజ్ఞానం పెరుగుతుంది. శాస్త్రీయ దృక్పథం అలవడుతుంది. పాఠ్య పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను కూడా చదవాలనే ఆసక్తి విద్యార్థులకు కలుగుతుంది. తెలుగు రాష్ట్రాల్లోని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తూ పిల్లల రచనలతో అనేక పుస్తకాలను ముద్రిస్తున్నారు. తద్వారా అనేక మంది పిల్లలు తమ ఊహలకు పదునుపెడుతూ పలు రకాల రచనలు చేస్తున్నారు. పలువురు సాహితీవేత్తలు, బాల సాహిత్య ప్రేమికులు వీరికి విశేష సహకారం అందిస్తున్నారు.

> మన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను పిల్లలకు వారసత్వంగా అందించేది సాహిత్యమే. ఈ సాహిత్యంలో పెద్దవారు పెద్దల కొరకు రాసే రచనలు, పెద్దలు పిల్లల కొరకు రాసే రచనలు మరియు పిల్లల కొరకు పిల్లలు రాసే రచనలు ఉంటాయి.

నేషనల్ బుక్ ట్రస్ట్ కార్యక్రమాధికారి, తెలుగు సంపాదకులు డాక్టర్ పత్తిపాక మోహన్ మాటల్లో చెప్పాలంటే "పిల్లలు సృజించిన సాహిత్యం ఇవ్వాల తెలుగునేల మీద విస్తృతంగా వస్తోంది. బాల సాహితీ వికాసం, విస్తారం, ప్రచారాల విషయంలో ఇటీవల జరుగుతున్న ప్రయత్నాలు చూస్తే ఆ దిశగా స్వరాష్ట్రమై విలసిల్లిన తెలంగాణ పరుగులు పెడుతోంది. ఇది బాల సాహిత్య లోకంలో విప్లవాత్మక పరిణామం. కొత్త ఒరవడి. మన బడి పిల్లలు రచయితలుగా, కవులుగా పరిచయమవడమే కాక పుస్తకాల రూపంలో అచ్చవుతున్నారు". అదేవిధంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దాసరి వెంకట రమణ అభిప్రాయంలో "పిల్లల సాహిత్యాన్ని పిల్లలే రాసుకోవడం అనేది బాల సాహిత్య చరిత్రలో కీలక మలుపు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని చాలా పాఠశాలల్లో ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదవడం రాయడం బాగా తెలిసిన తెలివైన చురుకైన పిల్లల్ని ఎంపిక చేసుకొని వారికి కొంత శిక్షణ ఇచ్చి మంచి రచనలు చేస్తున్నారు. ఇది చాలా శుభపరిణామమంటారు". "పిల్లల్లో చారిత్రక విశేషాలు పట్ల, ప్రదేశాల పట్ల, కట్టడాల పట్ల, సామాజిక పరిణామాల పట్ల, జిజ్ఞాసను కలిగించి, అవగాహన కల్పించడం మన బాధ్యతగా గుర్తించాలి. తద్వారా పిల్లల ఊహాశక్తికి, వ్యక్తిత్వ నిర్మాణ ఆకాంక్షలకు అనుగుణంగా వారి రచనలు వస్తాయని" చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ అంటారు.

ఆధునిక కాలంలో బాల సాహిత్యంలో విరివిగా రచనలు వస్తున్నాయి. బాల సాహిత్యంలో పిల్లల కోసం పిల్లలు రాసే రచనలు, పిల్లల కోసం పెద్దలు రాసే రచనలు అని రెండు విధాలుగా ఉంటాయి. గేయాలు, కథలు, కవితలు, వ్యాసాలు, మొదలగు విభిన్న ప్రక్రియల ద్వారా పెద్దలతోపాటు బాలలు కూడా నేడు అనేక రచనలు చేస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలలో తాతయ్య, నానమ్మ లేదా ఇంట్లోని పెద్దల ద్వారా పిల్లలు కథలు వినేవారు. మన సంస్కృతిని ప్రతిబింబించే జానపదాలను లాలిపాటలను, జోలపాటలను నేర్చుకునే వారు. పంచతంత్ర కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, చందమామ కథలు మొదలగునవి ఎంతో ఆసక్తితో వినేవారు, చదివేవారు నాటి తరం పిల్లలు. మారుతున్న కాలంతో పాటు పిల్లల ఆలోచన విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. పిల్లలు సాహిత్యాన్ని చదవడమే కాకుండా వారే స్వయంగా రాస్తున్నారు కూడ. ఈ కరోనా సమయంలో కూడా తమ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొని అనేక మంది పిల్లలు తమ బుర్రలకు పదును పెట్టి కలాలకు పనిచెప్పారు.

ఈ సంవత్సరకాలంలో కొంత మంది పిల్లలు వ్యక్తిగతంగా తమ రచనలు పుస్తక రూపంలో తీసుకురాగా, మరికొన్ని పుస్తకాలను కొందరు ఉపాధ్యాయులు తమ బడి పిల్లలు రాసిన వాటిని సంకలన రూపంలో తీసుకువచ్చారు. మొత్తమ్మీదనైతే ఉపాధ్యాయుల, బాల సాహిత్య శ్రేయోభిలాషుల కృషి వలన పిల్లలకు బాల సాహిత్యం పట్ల ఒక అవగాహన ఏర్పడింది. ఇది ఇలాగే కొనసాగుతూ ఇంకా విస్తృతమవ్వాల్సిన అవసరం ఉంది. బాల రచయితలచే వెలువడిన పుస్తకాలలో కొన్ని

కవిత్వ, కథల రూపములో వెలువడగా సంకలనాలలో అనేకానేక అంశాలు పొందుపరిచారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు యం.డి. సమ్రీన్ – ముద్దబంతి అనే పేరుతో, ఐ సౌమ్య – బంగారు బాల్యం అనే పేరుతో తమ పుస్తకాలను తీసుకువచ్చారు. పాల కంకులు పేరుతో లంకదాసరి విస్మశ్రీ కైతికాలు రాయగా, ఐదవ తరగతి చదువుతున్న బి. అనిత రాసిన అనిత పదాలు ఆకట్టుకోగా, నాల్గవ తరగతి చదువుతున్న రాపోలు అద్విక్ రామాయణం రాస్తే ఈ పుస్తకానికి తొమ్మిదవ తరగతి విద్యార్థి హరి నందన చిత్రాలు గీయడం విశేషం. అహల మాట శతకమును అమెరికాలో నాల్గవ గ్రేడ్ చదువుతున్న అయ్యాల సోమయాజుల లక్ష్మీ అహల రాశారు. ఈ విధంగావివిధ దేశాలలో ఉన్న తెలుగు పిల్లలు కూడా మన సంస్కృతి, వారసత్వాన్ని కొనసాగిస్తూ ఏ దేశమేగినా, ఎందుకాలిడిన మన తెలుగు భాషకు తిరుగులేదని, దానిని మరువబోమని నిరూపిస్తున్నారు. ఇటీవలే వడిచర్ల సత్యం సృష్టించిన మణిపూసలు లయాత్మకంగా, సులభతరంగా ఉండటం వలన ప్రక్రియ కొత్తదైనప్పటికీ అనేక మంది విద్యార్థులు ఈ ప్రక్రియలో కూడా తమ కవిత్వాన్ని వెలువరిస్తున్నారు. అందులో భాగంగానే, బోయిని నాగరాజు అనే పదవ తరగతి విద్యార్థి కలం నుండి మణిపూసల హారం అనే పుస్తకం వెలువడినది. ఇవే కాకుండా ఇంకొందరు విద్యార్థులు కూడా భిన్నమైన ప్రక్రియలతో, విభిన్నమైన రచనలతో పలువురిని ఆకట్టుకున్నారు.

ఔత్సాహికులైన కొంత మంది ఉపాధ్యాయులు తమ బడి పిల్లలను ప్రోత్సహిస్తూ వారి రచనలను సంకలన రూపంలో తీసుకువస్తున్నారు. అందులో భాగంగా బాలల కవితలను గడ్డిపూలు పేరుతో వెన్నెల సత్యం , పాటిమట్ల పాల పిట్టలతో ఉప్పలయ్య, మధుర పద్మాలతో భైతి దుర్గయ్య, చైతన్య దీపాలతో యెలిశాల నాగమోహన్, తొలిజల్లుతో కొండ్రు బ్రహ్మం, పట్టు కుచ్చులతో బండారు జయశ్రీ, సర్ప యాగంతో అమృతలత మొదలైనవారు తమ సంకలనాలు తీసుకువచ్చి పిల్లలకు అపురూప కానుకను అందించారు. బాల గేయాలతో కోయిలాలో కోయిలా అని కన్నెగంటి వెంకటయ్య, గుర్రాలగొంది మువ్వలతో వరకోలు లక్ష్మయ్య బాలలయలు పలికించారు. అమ్మకు పోస్ట్ చేయని ఉత్తరాలను యడవల్లి శైలజ పేర్చగా, అంకురం పేరుతో పసుల హన్మంతు మణిపూసలను కూర్చారు. స్వాతంత్ర్య భారతికి బాలల కైతిక హారతి అని రమేశ్ గోస్కుల కైతికాల రూపంలో తమ పిల్లల రచనలు తీసుకువచ్చారు.

పిల్లలందరు కూడా అద్భుతమైన సృజనతో తమ రచనలు చేస్తున్నారు. అందరివి చెప్పడం ఇక్కడ వీలుకాదుగాని మచ్చుకు కొందరి పిల్లల రచనలు పరిశీలించినట్లయితే ఓ వీర నీ ప్రాణం విడిచావు/ నీవు లేని రోజులు చావుతో సమానం/ కానీ నువ్వు ఉన్నప్పుడు వెయ్యి ఏనుగుల బలం/ నీలాంటి వీరుడు ప్రతి ఇంటిలో పుట్టాలని కోరుకుంటూ వివేక్ తేజ జవాన్ గురించి చెప్పాడు. జలమే జగానికి జీవం/ జలమే జగానికి మూలాధారం అని శ్రావణి నీటి ఆవశ్యకతను తెలియజేసింది. సంతలోకి వెళ్ళిన/ పాలకూర తెచ్చిన/ పప్పు వేసి వండిన/ అన్నములో తిన్నను / తొందరగా అరుగును/ జీర్ణశక్తి పెరుగును అంటూ ఆకుకూరల గొప్పతనమును తెలిపింది దీపిక. ఆడ పిల్లల గుండె సప్పుడు బతుకమ్మ/ మట్టి బతుకుల బతుకు సిత్రం బతుకమ్మ/ అని సంస్కృతి సంప్రదాయం ప్రతిబింబించారు భువనేశ్వరి. వేసే అడుగు దమ్మునదయితేనే/ దుమ్మురేపుతోంది/ ఓటమి దౌడు తీయిస్తుంది/ చిరిగిన చొక్కా అయితేనేం/ చెదరని మనసుంటే చాలుగా అని అనిల్ కుమార్ అంటాడు. అమ్మ అనే ప్రేమ లేక/ అమ్మాయి అనే గౌరవం లేక/ అమ్మాయిల ప్రాణాలను ఘోరంగా/ బలి తీసుకుంటున్నారు కదరా అని నేడు ఆడపిల్లల పట్ల జరిగే అమానవీయ సంఘటనలను ఎత్తిచూపింది అర్చన. ఆపదలు ఎదురైనప్పుడు/ ధైర్యాన్ని తలుచుకోవాలి అంటూ కనీస ధర్మం గురించి చెప్పారు దీప్తి. పిల్లలేమొ చదవాలి/ పెద్దలు పని చేయాలి/ జ్ఞాన సంపద తోడ/ ప్రజలు వృద్ధి చెందాలి అంటూ పిల్లలు బడికి పెద్దలు పనికి అనే నినాదాన్ని అందమైన మణిపూసలో కూర్చారు నాగరాజు.

విద్యార్థులు రాసిన కథలు కూడా ఈ సమయంలో కొన్ని సంకలనాలుగా రావడం జరిగింది. వాటిలో చదువు ఎదుగు అంటూ డా. దేవేంద్రప్ప చెపితే, నెమిలేటి కిట్టన్న పసిడి మొగ్గలను పూయించారు. బాల కథా మంజరితో మాడభూషి లలితాదేవి అలరించగా, డి.కె. చదువులబాబు కొత్తపేట కలాలను కదిలించారు. అక్షర మాలను పసుపులేటి నీలిమ ధరించగా, నాగ మల్లెలను మండల స్వామి, పురిమళ్ల సునంద కలకోట కథా సుమాలను పూయించారు. పోతగాని సత్యనారాయణ పూల గోపురమును నిర్మించగా, నల్లగొండ జిల్లా బడి పిల్లల కతలను ఉప్పల పద్మ, నెల్ సెండా1, నెల్ సెండా 2 లను కంచర్ల గోపన్న సాహితీ సమాఖ్య సంకలనంలో మణికొండ వేదకుమార్ గారు వెలువరించారు. ఇవేకాకుండా తెలంగాణ వ్యాప్తంగా మణికొండ వేదకుమార్ సంపాదకులుగా గరిపెల్లి అశోక్ కన్వీనర్ గా తెలంగాణ బడి పిల్లల కతలు వచ్చాయి. నీతి కథలు, హాస్య కథలు, అద్భుత కథలు, జానపద కథలు మొదలగు అనేక రూపాల్లో భిన్నమైన అంశాలను స్పృశిస్తూ సమకాలీన, సామాజిక, సాంస్కృతిక కథలను మనముందుచారు బాల రచయితలు. ఇందులో కొన్ని కథలు మనల్ని మేల్కొలిపితే, మరి కొన్ని నీతిని బోధిస్తాయి. ఇంకొన్ని కథలు కన్నీళ్లు తెప్పిస్తే మరికొన్ని కవ్వించే విధంగా రాస్తూ తమ నైపుణ్యాన్ని చూపారు విద్యార్థులు. ఇటీవలే చెన్నై తెలుగు వెలుగు సంక్షేమ సంఘం వారు నిర్వహించిన కథల పోటీల్లో మన ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతి పొందడం ఆనందదాయకం.

> ఒక పుస్తకం వంద మంది స్నేహితులతో సమానం అంటారు పెద్దలు. అందుకే పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడం వలన అది వారికి చిరకాల జ్ఞాపకంగా ఉండటమే కాకుండా, వారి జీవితాన్ని సన్మార్గంలో నడపడానికి కూడా ఉపయోగపడుతుంది.

గత దశాబ్ద కాలంలో సుమారు 250 పిల్లల పుస్తకాలు రాగా ఈ సంవత్సరంలో కూడా ముప్పైకి పైగా పుస్తకాలు వచ్చాయి. డా. భూపాల్, చొక్కాపు వెంకటరమణ, డా. వి.ఆర్. శర్మ, డా. సిరి, డా. స్వామి, పైడిమర్రి గిరిజ, రామకృష్ణ, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, బెలగం భీమేశ్వరరావు, వాసాల నర్సయ్య, డా. వాసరవేణి పరుశురాం, డా. కందేపి రాణిప్రసాద్, కన్నెగంటి అనసూయ, పుల్లా రామాంజనేయులు, ఉండ్రాళ్ళ రాజేశం, గద్వాల సోమన్న, ఎడ్ల లక్ష్మి, వైరాగ్యం ప్రభాకర్, కూకట్ల తిరుపతి, రామకిష్టయ్య లాంటి బాల సాహితీవేత్తలెందరో బాల రచయితలను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. వీరితోపాటు అనేక మంది ఉపాధ్యాయులు, పలువురు బాల సాహితీవేత్తలు, బాల సాహితీ ప్రియులు, పలు స్వచ్ఛంద సంస్థలు ఇంకా పేరు తెలుపని మహామహులెందరెందరో బాలలు రచనలు చేయుటలో తమతమ స్థాయిల్లో అవకాశాలు అందిస్తూ, బాలల బంగారు భవితకు బాటలు వేస్తున్నారు.

బాల సాహిత్యం వికసించడానికి అనేక మంది బాల సాహితీవేత్తలు, బాల సాహితీ ప్రియులు, ఉపాధ్యాయులు, పత్రికా రంగం వారు , ఆన్ లైన్ , సోషల్ మీడియా, వివిధ స్వచ్ఛంద సంస్థలు చేసే కృషి కూడా ఒక కారణమని చెప్పవచ్చు. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా మణికొండ వేదకుమార్ గారు వివిధ పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయాలను స్థాపించి కరోనా లాక్ డౌన్ సమయంలో కూడా విద్యార్థులకు పుస్తకాలను అందుబాటులో ఉంచి తమ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా చేశారు. బండారు బాలనంద సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బండారు చిన్న రామారావు బాల సుధ పేరిట విద్యార్థులను, బాలసాహితీ వేత్తలను, ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్నారు. రంగినేని ట్రస్ట్, చింతోజు బ్రహ్మయ్య బాలమణి ట్రస్ట్ మొదలగు స్వచ్ఛంద సంస్థలు కూడా బాల రచయితలకు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహానందిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో వివిధ బాల సాహిత్య కార్యశాలలు నిర్వహించడం ద్వారా బాల సాహిత్యాభివృద్ధికి తన వంతు చేయుతనందించడంలో ముందుంటున్నారు గరిపెల్లి అశోక్. డాక్టర్ విజయలక్ష్మి, శివబాబులు కూడా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ వర్క్ షాపులను ఏర్పాటు చేస్తూ బాల సాహిత్య కార్యక్రమాలు చేపడుతున్నారు.

నేటినిజం పత్రిక ద్వారా బైస దేవదాసు, వేదాంత సూరి అంతర్జాలంలో మొలక ఆన్ లైన్ న్యూస్ ద్వారా, టోరి రేడియోలో అక్షరాల తెర కార్యక్రమం ద్వారా వారాల ఆనంద్, మహారాష్ట్రకు చెందిన అశోక్ కంటె ఎకె (౦౩) మీడియా ద్వారా కూడా బాల సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నారు. చందమామ, బాల భారతి, బాల మిత్ర, పాల పిట్ట, బాలబాట, బాల వినోదిని, నాని, చంపక్, బాల భారతం మొదలగు సంచికలతో పాటు వివిధ దిన, వార, పక్ష, మాస పత్రికలు కూడా బాలల కొరకు ప్రత్యేక శీర్షికలతో పేజీలను కేటాయించడం ముదావహం. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) , దక్షిణాఫ్రికా తెలుగు సంఘం, చెన్నైలో తెలుగు వెలుగు సంక్షేమ సంఘం, వివిధ సందర్భాలలో బాలాహిత్యానికి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఇటీవలే తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బాల సాహిత్యం, తెలుగు భవిత్యం అనే అంశము మీద అంతర్జాలంలో చర్చా కార్యక్రమం కూడా నిర్వహిచారు. అంతేకాక యూట్యూబ్ మరియు వాట్సప్ సమూహా వేదికల ద్వారా కూడా పలువురు ఔత్సాహికులు బాల సాహిత్య పోటీలు నిర్వహించి వారిలోని సృజనాత్మక నైపుణ్యమును వెలికితీసె ప్రయత్నం చేస్తున్నారు.

ఇలాంటి కార్యక్రమాల వలన తెలుగు భాషకు చక్కని గౌరవం దక్కుతుంది. మాతృభాష పట్ల మమకారం పెరుగుతుంది. పిల్లలకు బాల్యంలోనే విషయంపై ఆసక్తి, అవగాహన శక్తి పెరుగడంతో పాటు పిల్లలకు విజ్ఞానం, వినోదం కూడా అందుతాయి. పిల్లల కోసం రాసే రచనలకు అనేక పరిమితులు ఉన్నాయి. బాలసాహిత్యంలో స్వీకరించే వస్తువును జాగ్రత్తగా ఎంచుకోవాలి. రచయిత చెప్పదలుచుకున్న విషయాన్ని పిల్లల స్థాయిలో ఎదిగి, ఒదిగి చెప్పాల్సి ఉంటుంది. విషయ స్వభావం మారకుండా విద్యార్థులకు లోక నీతిని, నైతికతను, దేశభక్తిని, బోధించేలా ఉండాలి. లయాత్మకత, సరళత, చమత్కృతి ఉండాలి. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా రచనలు ఉండాలి. స్వీయ అధ్యయనానికి, స్వీయ అనుభవానికి, స్వీయ అవగాహనకు అవకాశం ఉండాలి. మానవీయ విలువలను చాటి చెప్పేలా రచనలు రావాలి. పిల్లల రచనలు నిత్య నూతనంగా, ఆసక్తి కలిగించే విధంగా ఉండి, పఠనాభిలాషను పెంపొందించేలా ఉన్నప్పుడే రచయిత ఆశయం నెరవేరుతుంది.

నేటి బాలల వ్యక్తిత్వ వికాసానికి సంబంధిం చిన రచనలు ఇంకా విరివిగా రావాలి. కేవలం బాల సాహిత్యం వచ్చినంత మాత్రం సరిపోదు. అది పిల్లలకు చేరువకావాలి. నేడు వ్యష్టి కుటుంబాలు ఎక్కువవుతున్నాయి. ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిపోతుంది. చిన్న కుటుంబాల్లోని బాలలు సెల్ ఫోన్లు, ట్యాబ్ లు, కంప్యూటర్ లు , టి.వి లు ఎక్కువగా వాడుతున్నారు. కానీ వారికి పుస్తక పఠనం అలవాటుగా మార్చాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు, పెద్దలు బాలసాహిత్య పుస్తకాలను పిల్లకు అందేలా చూడాలి. అలా చేస్తే పుస్తక పఠనం పట్ల వారికి ఆసక్తి కలుగుతుంది. పిల్లల రచనలు చేసే వారి సాహిత్యానికి సార్థకత చేకూరుతుంది. పిల్లలు ఏదైనా మంచి పని చేసినపుడు లేదా వారి పుట్టిన రోజున గానీ లేదా మరే సందర్భములోనైనా పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చే సంప్రదాయాన్ని మనము తీసుకురావాలి. ఒక పుస్తకం వంద మంది స్నేహితులతో సమానం అంటారు పెద్దలు. అందుకే పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడం వలన అది వారికి చిరకాల జ్ఞాపకంగా ఉండటమే కాకుండా, వారి జీవితాన్ని సన్మార్గంలో నడపడానికి కూడా ఉపయోగపడుతుంది. పిల్లలందరూ స్వచ్ఛ సమాజ నిర్మాణం వైపు అడుగులు వేసి భావి భారత ఆదర్శ పౌరులుగా తయారయ్యే విధంగా బాల సాహిత్య రచనలు వస్తాయని ఆశిద్దాం.



–కందుకూరి భాస్కర్
9703487088

## 'నాన్న' అంశంపై పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని డి.ఆర్.జి. మహిళా కళాశాల విద్యార్థులు రాసిన కవితలు...



### నాన్న

అందమైన నా బాల్యం తడిమి చూస్తే
అపురూపమైన క్షణాలు ఎన్నో
సుమధుర జ్ఞాపకాల దొంతరలో "నాన్న"
అనే నా స్నేహితుడు, అనుక్షణం నా హితుడు
నా జ్ఞానంతో ప్రపంచాన్ని తెలుసుకొనే దశలో
విద్యార్థిగా నా జీవన ప్రయాణంలో
అనుక్షణం నీ తోడు
నా వెన్నంటే అన్నింటా
నాన్న ఆసరా కొండంత బలం
ఆప్యాయతా, అనురాగాలలో క్షణం క్షణం
నా రక్షణ వలయంలా
నేనెక్కడికి ఒంటరిగా వెళ్ళాలన్నా అక్కడికి
నిత్య సైనికుడిలా నీ తోడ్పాటు
అధ్యాపకురాలిగా సమాజంలో నిలబడడానికి
ధైర్యాన్ని, ప్రోత్సాహాన్ని ఇచ్చిన నీ స్ఫూర్తి
ప్రపంచాన్ని అర్థం చేసుకోగలిగే
పరిపక్వత నిచ్చి నా అజ్ఞానంతో
వేలవేల జ్ఞాన కిరణాలు పంచడానికి
కావలసిన సామర్థ్యాన్ని నాలో నింపిన
ఓ 'నాన్న' నీకు
ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలను
అసమాన్య హిమశిఖరంలా ఉన్ననీ సహనం
ముందు మోకరిల్లి ప్రణమిల్లడం తప్ప
నీ చేతి చేయూతతో ఎదిగిన నా
ఈ శరీరం తలవాల్చే వరకు
నీవందించిన ఈ జ్ఞాన జ్యోతిని
అందరికీ పంచి నీ ముందు
ఇంకా గర్వంగా నిలబడాలని ఉంది
నీ ఒడిలో తలవాల్చి
నేను నేనుగా గెలిచాను అని
చెప్పుకోవాలని ఉంది
నా నేను నా నాన్న ప్రతిరూపం
అని నాన్నకళ్ళలో ఆనందం, గర్వం
నేనని సగర్వంగా లోకాలకు అన్నింటికీ
చాటి చెప్పాలని ఉంది.



– ఎం.ఎన్.బి. సూర్యకుమారి
తెలుగు అధ్యాపకురాలు
డి.ఆర్.జి. మహిళా డిగ్రీ కళాశాల,
తాడేపల్లి గూడెం, ప॥గో॥జిల్లా.
8500711209

### నాన్నకు ప్రేమతో

నాన్న ఉంటే భరోసా
నాన్న ఉంటే ధైర్యం
క్రొవ్వొత్తిలా కరుగుతూ
వెలుగునిచ్చే వాడు నాన్న
రాళ్ళ దెబ్బలు తిని పళ్ళు ఇచ్చే
చెట్టులాంటి వాడు నాన్న..

వేలు పట్టి నడిపించేవాడు!
వేలు ఖర్చుపెట్టి చదివించేవాడు!!
మన విజయం కొరకు తపించేవాడు!!
నాన్న చేసిన త్యాగాలు
నాన్న బాధ్యత
ఎన్నిచెప్పుకున్న తక్కువే.
ఆడపిల్లలను ఈ ప్రపంచంలో
తండ్రి కంటే ఎక్కువగా
ఎవరూ ప్రేమించలేరు.
కూతురు ఏదైనా అడిగితే లేదని చెప్పలేని
ఒకే ఒక ప్రాణి నాన్న!
మన సంతోషంలో
తన సంతోషాన్ని వెతుక్కునేవాడు నాన్న
Every Girl's super Hero is her father
అమ్మ ప్రేమ మంచి నీరు లాంటింది.
కనబడి మన దాహం తీరుస్తుంది.
నాన్న ప్రేమ గాలిలాంటిది,
కనబడదు కానీ
మనం ఎదగడానికి బ్రతకడానికి
అది ఆక్సిజన్ లాంటిది!!
కన్న తల్లి లేకపోతే రోడ్డుమీద ఎవరినైన
అమ్మా అని పిలిచి బంధాన్ని కలుపుకోవచ్చు
కాని! నాన్న అనే పిలుపు
ఒక్కసారి దూరం అయితే
గుండెలు పలిగేలా ఏడ్చినా
దిక్కులు అదిరేలా పిలిచినా
బదులు రాదు ఎందుకంటే
ఆ పిలుపు రక్తం పంచిన తండ్రికి
మాత్రమే సొంతం.
నాన్న చూపిన బాటలో
విజయం ఉంటుందోలేదో తెలియదు కాని
అపజయం మాత్రం ఉండదు.
పేగు అమ్మదైతే పేరు నాన్నది
అమ్మ ఒడిగుడి అయితే
నాన్న భుజం లోకాన్ని చూపే బడి.
ఆకాశంలో ఎన్ని వేల నక్షత్రాలు ఉన్న
అందులో
చందమామే గొప్పది.
ఈ ప్రపంచంలో ఎంత మంది
గొప్పవాళ్ళు ఉన్న నాకు మాత్రం
మా నాన్న గొప్పవారు.
జేబు నిండా డబ్బున్నా తనకు ఇష్టమైనవి!
కొనుక్కోలేని వాడు "నాన్న".
ఆడపిల్ల పుట్టిదంటే
తన తల్లి నాకు కూతురు
పుట్టిందంటుంది కానీ– నాన్నమాత్రం
మా అమ్మ నా కోసం మళ్ళీ పుట్టింది,
మా ఇంటికి మహాలక్ష్మి వచ్చిందంటాడు.
అమ్మ అంటే ప్రేమ
నాన్న అంటే నమ్మకం
తల్లి భూమి అంత ప్రేమను చూపితే
తండ్రి ఆకాశం అంత ప్రేమను చూపుతాడు.
ప్రతీ ఆడపిల్ల జీవితంలో మొదటి
స్నేహితుడు నాన్న.
నా జీవితంలో మా నాన్న గొప్పవారు.
మై డాడీ ఈజ్ మై హీరో



– యు. సత్యశ్రీ
ద్వితీయ సంవత్సరం. (బిజడ్‌సి)

### నాన్న

నాన్న....!
కవుల చేతులకు కలానివి కానున్న
చరిత్రపుటల్లో నీ పేరు ఎక్కడ లేకున్న
కుటుంబాన్ని కంటిరెప్పలా కాపాడే వాడే నాన్న
కళ్లలో ప్రేమ కనబడకుండా ప్రేమించేవాడే నాన్న
కష్టంలో తాను ముందుండి, ఆనందంలో వెనకుండి
ఆనందించేవాడే నాన్న..
కుటుంబం కోసం కుటుంబానికే దూరమైనవాడే నాన్న
జేబు నిండా డబ్బులు ఉన్నా ఇష్టమైనది కొనుక్కొవడానికి
ఆలోచించేవాడే నాన్న
కుటుంబం కోసం కష్టాన్ని కూడా ఆనందంగా
అనుభవించేవాడే నాన్న
ప్రపంచమంతా నీకు వ్యతిరేకంగా ఉన్నా
ఓడినపుడు నేనున్నానులే అని వెంట ఉండి
ధైర్యం చెప్పేవాడే నాన్న..
గెలిచినపుడు పదిమందికి చెప్పుకొని
ఆనందపడే వ్యక్తే నాన్న!
ఇలా ఎంత చెప్పాలకున్నా, చెప్పాలేకున్న.
నాన్నకు ప్రేమతో...



– ఎల్. మేథున
9014158629

### నాన్నకు ప్రేమతో...

అమ్మ ప్రాణం పోసం జీవమిస్తే ఆ ప్రాణానికి
ఓ రూపునిచ్చి వ్యక్తిగతంగా చేసే వ్యక్తి నాన్న..
గెలిచినపుడు పదిమందికి చెప్పుకునే వ్యక్తి
ఓడినపుడు భుజాలపై తట్టి గెలుస్తావ్‌లే అని
దగ్గరకు హత్తుకునే వ్యక్తి నాన్న ఒక్కరే.
నేనెరిగిన తొలి నేస్తం
నువ్వే.. నాన్న..
ఐ లవ్ యూ నాన్న..
ప్రపంచాన్ని మనల్ని చూపేది అమ్మ
ప్రపంచాన్నే మనకు చూపేది నాన్న
నీ ఆశలే తన ఆయువుగా..
నీ గెలుపే తన లక్ష్యంగా
నీ జీవితాన్నే నిలబెట్టేందుకు
నీ కోసం నిత్యం శ్రమించే నిశ్వార్థ శ్రామికుడు
నీ తొలి స్నేహితుడు నాన్న
నాన్న అంటే కనిపించే ఒక భరోసా మాత్రమే కాదు
నాన్న అంటే ముందున్న నా భవిష్యత్తుకి
బంగారం చేసిన దేవుడు..
అమ్మ ఎంత తిట్టినా నవ్వొస్తుంది కానీ
నాన్నకొద్దిగా మందలించినా ఏడుపొస్తుంది
నన్ను మీరు ఎంత పైకి ఎగరేసినా
నేను బయపడను, ఎందుకో తెలుసా
క్రిందకు చూసే సరికి తిరిగి కిందపడకుండా
పట్టుకునేది నాన్న కాబట్టి..
నన్ను తన భుజాలపై ఆనందంగా మోస్తూ
ఈ లోకాన్ని మొదటగా..
చూపించేది మా నాన్న
అమ్మ ప్రేమను కళ్ళతో చూడగలం
కానీ.. నాన్న ప్రేమను కన్నీళ్ళతోనే తెలుసుకోగలం –
భూదేవికి ఉన్నంత ఓర్పు
సహనం అమ్మది అయితే
ఆకాశమంత ఔన్నత్యం నాన్నది..!
ఈ ప్రపంచంలో మంచివాళ్ళు
చెడ్డవాళ్ళు ఉంటారేమో కానీ..
ప్రేమ లేని అమ్మ
బాధ్యత లేని నాన్న ఉండరు..!
మనసులో కొండంత ప్రేమని..
గోరంత చిరునవ్వుతో..
చూపించే అద్భుతానివి నువ్వు నాన్న..
చిన్నప్పుడు గుండెల మీద మోసి
తర్వాత జీవితాంతం గుండెల్లో పెట్టుకొని
సంతోషించే ఆనంద జీవివి నువ్వు నాన్న..
ఐ లవ్‌యు నాన్న.



–కె. అంబిక
బి.కామ్.

### నాన్నకు ప్రేమతో

"ఓర్పునకు మారుపేరు మార్పునకు మార్గదర్శి నీతికి నిదర్శనం ప్రగతికి సోపానం" ఆశలే ఆయువుగా గెలుపే లక్ష్యంగా జీవితాన్ని నిలబెట్టేందుకు నిత్యం శ్రమించే నిస్వార్థ శ్రామికుడు నాన్న. మనలో జీవాన్ని నింపి, అల్లారు ముద్దుగా పెంచి, మనలోని లోపాలను సరిచేస్తూ మన భవిష్యత్తుకు పునాదులు వేస్తూ గమ్యం చూపేది నాన్న. అనురాగానికి రూపం, అంతులేని త్యాగానికి నిలువుటద్దం, ఆకాశం అంత ఔన్నత్యం నాన్న. తనజీవితాన్నే త్యాగం చేసేది నాన్న ప్రేమను ఎలా చూపించాలో తెలియని వ్యక్తి. తాను కరిగిపోతు వెలుగుని అందించేవాడు. గెలిచినప్పుడు పదిమందికి చెప్పి,ఓడినప్పుడు భుజంపై తట్టి జీవితంలో గెలుస్తావు అని ఎంతో ఉన్నత శిఖరాలకు చేరుతావు అని చెప్పే గొప్ప ధైర్యం నాన్న. చేతులకు చేయూతనిచ్చి తొలినడకలు నేర్పించిన వ్యక్తి నాన్న. నిస్వార్థమైన ప్రేమకు నిలువెత్తు నిదర్శనం. కళ్ళల్లో ప్రేమ కనబడకుండా ప్రేమించేది నాన్న. "ఆకాశమంత అనురాగాన్ని పంచేది అమ్మ అయితే, భూగోళమంత ధైర్యాన్ని ఇచ్చేది నాన్న.



– ఎ. రమ
సెల్: 9676579474

### నాన్నకు ప్రేమతో

నాన్న అంటే నమ్మకం
నమ్మకమే జీవితం
నాన్న లేని జీవితం నరకం
నాన్నేరా లోకం అందరికీ
తన కళ్ళతో లోకాన్ని చూపిస్తాడు నాన్న
వేలు పట్టి నడిపిస్తాడు నాన్న
మంచి ఏదో చెడు ఏదో చూపిస్తాడు నాన్న..
నాన్న
నీకు నడక నేర్పించాడు
నలుగురిని నీతో నడిపించమనే
నడవడిక నేర్పించాడు
నీకు మొదట వ్రాత నేర్పించాడు
అది నీ తలరాతగా మార్చేందుకు
ప్రోత్సాహాన్ని ఇచ్చాడు
నీకు భయం వేస్తే ధైర్యాన్ని ఇచ్చాడు
అతనికి భయం కలిగితే నిన్ను తలచుకున్నాడు
నువ్వు తప్పు చేస్తే ఆవేశం చూపించాడు
అసలు తప్పే చేయకుండా ఆరాటం చూపించాడు
అతడు అస్తమిస్తూ నిన్ను అలరారింప చేశాడు
ఓపిక లేకపోయినా ఓదార్పు కోరుకోడు
సత్తువ సన్నగిల్లినా సహనం కోల్పోడు.
"నాన్న లేకుంటే బ్రతుకంతా శూన్యం
నాన్నంటే నాకేంతో ఇష్టం".

– ఎస్. సువర్ణమాల
ద్వితీయ సం॥ బిఏ

### నాన్నకు ప్రేమతో..

నాన్న రెండు అక్షరాలు పదం పదం..
వంద కోట్లతో సమానమైన పరమార్థం
మీ మాటల్లో పొందాను మంచి మమకారం..
మీ వ్యక్తిత్వంతో నేర్చుకున్నాను సంస్కారం కొండంత..
బాధ్యతలు తన జీవితంలో ఉండడం..
కాని నలుసంతైనా బాధలేదని నవ్వుతూ మనతో చెప్పడం..
నాకు ఎన్ని సమస్యలు ఉన్నా తీర్చేవాడు
అందుకే నా దృష్టిలో ఎప్పటికి మేరే నా హీరో
మన ప్రపంచం ఎంత ఉన్నానాన్న ప్రేమ పొందకపోవం
ఒక తోడు విశ్వమంతా నాకు పరిచయమైనా పిడికెటంత
గుండెతో ఉంటుంది మీకు గొప్ప చోటు..
నాన్న అంటే త్యాగం నాన్న అంటే ప్రేమతో కూడిన బాధ్యత
నాన్న అంటే ఎత్తైన శిఖరం తన రెక్కలు ముక్కలు చేసుకుని
రేయి పగలు కష్టపడి మనకు కవచంగా నిలిచేవాడు..
నాన్న తాను ఓడిపోయి మనల్ని గెలిపించే త్యాగశీల
నాన్న తన కలల్నిమర్చిపోయి మన కలల్ని నిజం చేసే
గొప్ప మనసున్న వ్యక్తి నాన్న
మన భవిష్యత్తును నిలబెట్టేదే నాన్న
మనం ఎప్పుడూ చదవాలనిపించే
ఒక మంచి పుస్తకం నాన్న..



– వి. లక్ష్మీదుర్గ
సెల్: 8688866039



### పల్లె

చల్లదనం వెల్లివిరుస్తది
ఆ మాటంటేనే..
తీయదనమేదో
పల్లవిస్తది ఆ మాటలో...

పొలిమేరనుంచే
తెలిసిపోతది
హాయిని గొలిపే
కలుపుగోలుతనపు
పలకరింతల పచ్చదనం...

దాపరికం లేని మనసు
తోటలో గుబాళించే
ఆప్యాయతల పరిమళాలతో
మాట మాటలో గుండె చప్పుడు

పంటచేల నుంచి వీచే గాలిలా
వెన్నెల వెలుగులో మెరిసే చెరువులా
అల్లుకునే అనుబంధాల హారం....
తరతరాల మానవ జీవన యానంలో
తరిగిపోని తల్లిదనపు మమకారం..

అణువణువునా ఆత్మీయతా లతలు
అల్లుకున్న చిరంతన అనురాగ ద్వారం
భిన్నత్వపు దారులను కలిపే
ఏకైక ఏకత్వపు తీరం.

మట్టితనం రవళించే
ఆనంద బృందావన వేణుగానం పల్లె
నటనలూ, నాజూకు వ్యవహారాలు లేని
అచ్చమైన మనిషి తనపు ముల్లె.



–వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com